RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 17 జూలై 2025 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:42

# జల వివాదాలపై నిపుణుల కమిటీ
## ఢిల్లీలో అత్యున్నత సమావేశం






న్యూఢిల్లీ, జూలై 16 తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి నిపుణులతో ఓ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో.. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో చర్చలు జరిగాయి. దాదాపుగా గంటన్నర పాటు జరిగిన సమావశంలో .. ఇరు రాష్ట్రాలు కొన్ని అంశాలను ప్రస్తావించాయి. ఈ క్రమంలో జల వివాదాల పరిష్కారానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిపుణుల కమిటీ ఇచ్చే నివేదికను బట్టి నిర్ణయం తీసుకుంటారని మంత్రి నిమ్మల తెలిపారు.

ఈ సమావేశంలో తెలంగాణ మొత్తం 13 అంశాలను ఎజెండాలో ప్రతిపాదించింది.

1. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వాలి
2. శ్రీశైలం నుంచి వేరే బేసిన్ కి ఆంధ్రప్రదేశ్ నీటి తరలింపు పనులను వెంటనే ఆపేయాలి
3. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రారంభించిన ప్రాజెక్టులకు సహకరించేలా కృష్ణ ట్రిబ్యునల్ లో మద్దతుగా వాదించేలా ఏపీని ఒప్పించాలి.
4. కృష్ణానది జలాలను వేరే బేసిన్ కు తరలించకుండా కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు చర్యలు తీసుకునేలా ఆదేశించాలి. కృష్ణా జలాలను అక్రమంగా తరలింపును అడ్డుకునేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు ఏపీ ఒప్పుకోవాలి
5. తుంగభద్ర బోర్డు నీటి తరలింపు పై చర్చించాలి.
6. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్జీటీ ఉత్తర్వులను అమలు చేసే విధంగా కేంద్ర జలశక్తి శాఖ చర్యలు తీసుకోవాలి . ఆ మేరకు పునరుద్ధరణ జరపాలి . ఈ పథకంపై చట్టపరంగానే ముందుకు వెళ్లాలి
7. శ్రీశైలం కుడి కాలువ ద్వారా ఎక్కువ నీటి తరలింపు ను నియంత్రించాలి 8. శ్రీశైలం ప్రాజెక్టులో కొత్త ప్రాజెక్టులు హంద్రీనీవా, వెలిగొండ, గురు రాఘవేంద్ర నిర్మాణాలను నియంత్రించాలి 9. శ్రీశైలం డ్యాం సేఫ్టీ కి తగిన చర్యలు తీసుకోవాలి
10. శ్రీశైలం నుంచి నీటి తరలింపు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతుంది దీనిని అడ్డుకోవాలి. 11. పోలవరం ప్రాజెక్టు తరహాలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. ఇచ్చంపల్లి నుంచి కావేరి కి గోదావరి జలాల తరలింపుకు మేము సిద్ధం. అందులో 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతులు ఇవ్వాలి. 12. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలి
13.ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఏఐబిపి కింద నిధులు ఇవ్వాలి. మహారాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వమే చర్చలు జరిపి తుమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి సహకరించాలిఏపీ ప్రభుత్వం బనకచర్ల అంశం ఒక్కటే చర్చిస్తే సరిపోతుందని ప్రతిపాదించింది. అయితే రెండు రాష్ట్రాలు ప్రతిపాదించిన అంశాలపై లోతుగా చర్చించలేదు. నిపుణుల కమిటీని నియమించాలని నిర్ణయించారు. అలాగే కృష్ణా యాజమాన్య నదీ బోర్డు ఏపీలో.. జీఆర్ఎంబీ తెలంగాణలో ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైలం ప్రాజెక్టును కాపాడుకోవాలని అనుకున్నారు. నిపుణుల కమిటీని సోమవారంలోపు ఏర్పాటు చేయనున్నారుముందుగానే అధికారుల సమావేశాలు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం అయ్యారు. సమావేశం ప్రారంభానికి ముందే రెండు రాష్ట్రాలు.. తమ ఎజెండాను కేంద్రానికి పంపించాయి. రెండు రాష్ట్రాల మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి కారణమైన బనకచర్ల ప్రాజెక్టుతోపాటు ఇతర ప్రాజెక్టుల అంశంపై చర్చలు జరుగుతున్నాయి. ఐదు రోజుల క్రితమే ఈ సమావేశం జరగాల్సి ఉంది కానీ ముఖ్యమంత్రుల నుంచి ఆమోదం రావడం ఆలస్యం కావడంతో బుధవారం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం జలాలపై సమస్యలు ఏర్పడినప్పుడు ఎపెక్స్ కౌన్సిల్లో చర్చలు జరపాల్సి ఉంది. దీనికి కేంద్ర జల శక్తి మంత్రి ఛైర్మన్‌గా ఉంటారు. రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా ఉంటారు. ఇలాంటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గతంలో రెండుసార్లు జరిగింది. ఇది మూడో సారి. బనకచర్ల ఇరు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు పెంచుతున్న వేళ కేంద్రం చొరవ తీసుకొని అపెక్స్ కౌన్సిల్ భేటీ ఏర్పాటు చేసింది. బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పలు మార్లు కేంద్రమంత్రులతో సమావేశమై ఆ ప్రాజెక్టు తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ ప్రాజెక్టు వల్ల ఎలాంటి నష్టం వాటిల్లుతుందో పలుమార్లు పవర్ పాయింట్ ప్రజెంటే,న్ ఏపీ ప్రభుత్వం ఇచ్చింది. బనకచర్ల ప్రాజెక్టు అంశంపై ఉండకూడదని చర్చ అవసరం లేదని తెలంగాణ అంటోంది. ఈ మేరకు కేంద్రానికి లేఖ కూడా రాసింది. కేవలం కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టుల అజెండాగా మాత్రమే మీటింగ్ జరగాలని స్పష్టం చేసింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయహోదా ఇవ్వడంతోపాటు ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. వీటిని అజెండాలో పెట్టాలని సూచిస్తోంది. బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందని చట్టాలు, తీర్పుల ఉల్లంఘన కు అవకాశం ఇచ్చినట్లవుతుందని తెలంగాణ వాదన. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమావేశమయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ భేటీకి ఇరు రాష్ట్రాల జల వనరుల శాఖ మంత్రులు, అధికారులు హాజరయ్యారు.ఆంధ్రప్రదేశ్ మాత్రం బనకచర్ల ఒక్క అంశంపైనే చర్చకు ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కారణంగా ఎవరి ప్రయోజనాలకు భంగం వాటిల్లే పరిస్థితి లేదని చెబుతోంది. ఇది కేవలం వరద జలాలను తరలించేందుకు ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మాత్రమేనని చెబుతోంది. గతంలో తెలంగాణ సీఎంగా ఉన్న టైంలో కేసీఆర్ చేసిన స్పీచ్‌లను కూడా సాక్ష్యాలుగా చూపిస్తోంది ఏపీ ప్రభుత్వం. అప్పట్లో అంగీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం ఇప్పుడు వద్దని అంటున్నారని విమర్శిస్తోంది. అందుకే ఇవాళ్టి అజెండాలో ఆ ప్రాజెక్టు ఉంటేనే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని అనుమతులు రావడం సులభతరం అవుతుందని ఏపీ ప్రభుత్వం పట్టుబడుతోంది. ఈ సమావేశం ఎలాంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదని చర్చలకు ఓ రూట్ మ్యాప్ గా ఎక్కువగా మంది భావిస్తున్నారు.

# సంగారెడ్డిలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు


వార్తా 2 లో




# గోషామహల్ లో తగిన నాయకులున్నారు
## వీ.పాండు యాదవ్

హైదరాబాద్ గోషామహల్ బిజెపి అభ్యర్థిగా మాధవి లత తనకు తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడాన్ని గోల్కొండ జిల్లా మాజీ అధ్యక్షుడు వీ.పాండు యాదవ్ ఖండించారు. . గోషామహల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు గోషామహల్ లో తగిన నాయకులు ఉన్నారని అంత సత్తా గోషామహల్ వారికి ఉంది అని పాండు యాదవ్ స్పష్టం చేశారు. ఎవరు పోటీ చేయాలో అధిష్టానం నిర్ణయిస్తుందని ఈ సమయం లో మాట్లాడవద్దని పాండు యాదవ్ సూచించారు.




# రాష్ట్రంలోనే తెలంగాణ విశ్వవిద్యాలయం అగ్రభాగాన ఉంది
## గవర్నర్ మరియు ఛాన్సర్ మాన్య జిష్ణుదేవ్ వర్మ


వార్తా 2 లో



# ప్రజాబలం

17 జూలై 2025 గురువారం


## ఉపవాసాలకు ఉద్దిష్టమైనది దక్షిణాయణం

మన పూర్వీకులు సూర్య భగవానుని గమనం ప్రకారం యుగాలుగానూ, యుగాలను సంవత్సరములుగానూ, సంవత్సరములను మాసములు గానూ, మాసములను వారములు గానూ, వారములను రోజులు గానూ, రోజులను జాములు గానూ, జాములను ఘడియలు గానూ కాల గమనాన్ని తెలుసు కోవటానికి విభజించారు. సంవత్సరంలో ఉన్న 12 మాసములను రెండు ఆయనాలుగా విభజించారు. సూర్య భగవానుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ఉత్తరాయణం, కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు దక్షిణాయణం ఏర్పడతాయి. ఖగోళ శాస్త్రం ప్రకారం జనవరి 15 నుంచి జూలై 16 వరకు ఉత్తరాయణం, జూలై 17 నుంచి జనవరి 14 వరకు దక్షిణాయనం అని అంటారు. సాయన ఉత్తరాయణం ప్రతి సంవత్సరం డిశంబర్ 21-22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అలాగే సాయన దక్షిణాయణం జూన్ 21-22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అయితే భారతీయ గ్రహగణితం నిర్ణయ గణితం కాబట్టి ఆయనాంశ కారణంగా సాయన, నిర్ణయ సంక్రాంతుల్లో ఇలా మార్పు కననిపిస్తుంది. ఖగోళ శాస్త్రం ప్రకారం.. సూర్యుడి గమనంలో మార్పులే ఉత్తరాయణ, దక్షిణాయనాలు. 'అయనం' అంటే ప్రయాణం అని అర్థం. దక్షిణాయనం అంటే దక్షిణ దిశగా ప్రయాణం చేయడమనే అర్థం వస్తుంది. సూర్యుడు తూర్పు దిశలో ఉదయిస్తాడని తెలుసు. కానీ సూర్యోదయాన్ని గమనిస్తే, అది తూర్పు దిక్కున జరగదు. సూర్యుడు సరిగ్గా తూర్పు దిశ మధ్యలో ఉదయించేది ఏడాదిలో 2 రోజులు మాత్రమే. అవి మార్చి 21, సెప్టెంబరు 23. మిగతా ఆరు నెలలు ఈశాన్యానికి దగ్గరగా, మరో 6 నెలల ఆగ్నేయానికి దగ్గరగా సూర్యోదయం జరుగుతుంది. సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని ఉత్తరాయణం అని, ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని దక్షిణాయణం అని అంటారు. ఈ దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణ దిశలో పయనిస్తాడు. సూర్య గమణాన్ని బట్టి మన భారతీయులు కాలాన్ని రెండు భాగాలుగా విభజించారు . భూమధ్యరేఖకు ఉత్తరదిశలో సూర్యుడు కనిపిస్తే ఉత్తరాయణమని, దక్షిణంగా సంచరించినప్పుడు దక్షిణాయమని అన్నారు. ఏడాదిలో 6నెలలు ఉత్తరాయణం.. 6నెలలు దక్షిణాయనం. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి నప్పుడు ఉత్తరాయణం.. కర్కాటక రాశిలోకి ప్రవేశించి నప్పుడు దక్షిణాయనం ప్రారంభమవుతుంది. సంక్రమణం ప్రవేశించిన తరువాత మొదటి 6గంటల 49 నిముషములు పుణ్యకాలంగా, 2 గంటల 16 నిమిషములు అత్యంత పుణ్యకాలంగా శాస్త్రములందు చెప్పబడింది. ఆ సమయంలో స్నాన, దాన, జపాదులేవైనా అధిక ఫలితాలనిస్తాయి. ఆధ్యాత్మిక పరంగా ఉత్తరాయణం దేవతలకు పగలు అయితే, దక్షిణాయనం దేవతలకు రాత్రి కాలం. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. ఇలాంటి సమయంలో మనిషి ఎదుగుదలకు దైవశక్తి సాయం ఎంతో అవసరం. అందుకే దేవతల శక్తిని ప్రేరేపించడనికి ఈ కాలంలో ఉపాసనలు చేస్తారు. అందువల్ల ఇది ఉపాసన కాలం అయ్యింది. శ్రీహరి ఆషాడ శుద్ద ఏకాదశి రోజున యోగ నిద్రలోకి వెళ్లి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు నిద్రలేస్తారు. ఈ సమయంలో యోగులు, మఠాధిపతులు చాతుర్మాస దీక్షను చేపడతారు. శాస్త్రీయంగా దక్షిణాయనంలో సూర్యకాంతి భూమి మీద తక్కువగా ప్రసరిస్తుంది. ఫలితంగా జీవులలో రోగ నిరోధకశక్తి క్షీణించి రోగాల బారిన పడతారు. వీటిని నిరోధించడానికి ఈ కాలంలో బ్రహ్మచర్యం, ఉపసాన, తరుచుగా ఉపవాసాలు, పూజలు, వ్రతాల పేరుతో పాటించే నియమాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. ఎలా చూసిన దక్షిణాయనంలో చేసే జప, దాన, పూజలు ఆరోగ్యాన్ని, అధ్యాత్మిక అనుభూతుని ప్రసాదించడంతో పాటు పరమాత్మ పాదాలను చేరుస్తాయి. దక్షిణాయనంలో పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేయడం, సాత్వికాహారం ఫలితాన్నిస్తాయి. ముఖ్యంగా దక్షిణాయనం లోనె పితృ దేవతలు తమ సంతానం ఇచ్చే శ్రాద్ధాలు, విశేష తర్పణాలను స్వీకరించేందుకు భూమిపైకి వస్తారని అంటారు. ఈ సమయంలోనే పితృదేవతారాధనకు సంబంధించిన మహాలయ పక్షాలు వస్తాయి. పితృదేవతలను సంతృప్తిపరిస్తే, వారి అను గ్రహంతో సంతానాభివృద్ధి జరుగుతుంది. శ్రాద్ధాదులు నిర్వహించక పోవడం కూడా సంతాన లేమికి ఒక కారణమని పెద్దలు పేర్కొంటారు. బతికుండగా తల్లిదండ్రుల సేవ, మరణించాక శ్రాద్ధాలు చేయడం విధి, ఎంతో ముఖ్యం, శుభప్రదం. పితృ రుణం తీర్చుకోవడానికి అది మార్గం. అంతేకాదు కని పెంచిన తల్లిదండ్రులకు అది ఒక కృతజ్ఞతా పూర్వక చర్య. ధ్యానం, మంత్ర జపాలు, సూర్యోదయానికి ముందే లేచి పవిత్ర నదుల్లో స్నానాలు, పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు, సాత్వికాహారం (శాకాహారం) తీసుకోవడం, అవసరంలో ఉన్న వారికి దానం చేయడం, అన్నదానం, తిల (నువ్వుల ) దానం, వస్త్ర దానం, విష్ణు పూజ, విష్ణు సహస్రనామ పారాయణ, సూర్యరాధన, ఆదిత్య హృదయ పారాయణం చేస్తే అవి శరీరానికి, మనసుకు మేలు చేస్తాయని, పాపాలు తొలగి పోతాయని శాస్త్రాలు తెలుపుతున్నాయి. ఈ ఏడు జూలై 16న దక్షిణాయనం ప్రారంభం అయింది.

# సంగారెడ్డిలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు

**స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వాలంబనకు ఇందిరా మహిళా శక్తి దోహదం**

**నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం**

**10 సం " రాల పాలనలో గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.**

**జిల్లాకు 13000 కొత్త రేషన్ కార్డుల మంజూరు.**

**త్వరలో లబ్ధిదారులకు పంపిణీ.**

**మంత్రుల చేతుల మీదుగా వడ్డీ రాయితీ చెక్కుల పంపిణీ.**

**వివేక్ వెంకటస్వామి, జిల్లా ఇన్చార్జి మంత్రి. రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 16(ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులు గా మార్చాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ లు అన్నారు,బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి వారు టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య లతో కలిసిముఖ్య అతిథులు హాజరై మాట్లాడారు,ఈ సందర్భముగా కార్మిక ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక స్థలంబన కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు,గత ప్రభుత్వం పది సంవత్సరాలపాటు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేస్తామంటూ కల్లబొల్లి మాటలతో కాలం వెళ్లదీశారు. తప్ప ఏ ఒక్కరికి డబుల్ బెడ్ రూములు ఇవ్వలేదన్నారు. కానీ మాన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు.గత పది సంవత్సరాలలో జిల్లాలో, రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డును గత ప్రభుత్వం ఇవ్వలేదని కానీ మన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సంగారెడ్డి జిల్లాకు 13వేల పైచిలుకు రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీ కార్డు హామీల్లో భాగంగా ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం 200 యూనిట్ల ఫ్రీ కరెంటు గ్యాస్ సిలిండర్ పై రూ. 500 రాయితీ, రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో మౌలిక వసతుల మెరుగు కోసం కృషి స్వయం సహాయక సంఘాల మహిళలకు ద్వారా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో క్యాంటీన్ల ఏర్పాటు రాష్ట్రంలోని మొదటి పెట్రోల్ పంపు సంగారెడ్డిలో ఏర్పాటు చేయడం లాంటి ఎన్నో కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక స్వాలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మహిళలు తో పాఠశాల గదుల నిర్మాణం కళాశాల గదుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు సైతం మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు,మహిళా సాధికారత తో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. స్వయం సహాయక సంఘాలసభ్యులను వ్యాపారవేత్తలుగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారురాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సులను మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ఒక స్వయం సహాయక సంఘం మహిళ గతంలో లక్ష రూపాయలు రుణం తీసుకున్నారని , ఈరోజు సంఘాలకు 20 లక్షల లోన్ ఇవ్వడానికి బ్యాంకు వారు రెడీగా ఉన్నట్లు చెప్పడం నాకు ఎంతో సంతోషంగా వచ్చి ఉందని మంత్రి తెలిపారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు వ్యాపారాలు చేసి రాణించి రుణాలు కట్టి ఇంకా ఎక్కువ రుణాలు తీసుకొని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఈ సందర్భంగా మహిళలకు మంత్రి వివేక్ సూచించారు. ఆర్థిక క్రమశిక్షణతోనే మహిళా సంఘాల సభ్యులు ఎదగడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు వెలుగు లు పంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అప్పుల పాలైనప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక వైపు చక్కదిద్దుతుంది ఒక్కొక్కటిగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం నెరవేరుస్తున్నట్లు తెలిపారు,ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం చేయూత పథకం ద్వారా గత 25 సంవత్సరాల క్రితం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి దామోదర్ నరసింహ తెలిపారు,పొదుపు సంఘాలను ఏకం చేసి ఆర్థికంగా ఎదిగేలా రెండు వేల సంవత్సరం నుండి అప్పటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 23 వేలకు పైగా ఉన్న స్వయం సహాయక సంఘాలకు రూ 30 కోట్ల వడ్డీ లేని రుణాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు,జిల్లాలో మహిళా సంఘాల ద్వారా ఒక పెద్ద పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రభుత్వం జిల్లా మండల సమైక్యలకు సహకరిస్తున్నారు . జిల్లాలోని జాతీయ రహదారుల వెంట అరేకరం నుంచి రెండు ఎకరాలు స్థలం వరకు ఆయా మండలాల చెందిన మండల సమైక్యలకు లేదా జిల్లా సమైక్యలకు అందజేసి ఆ ప్రాంతాలలో పెట్రోల్ పంపులు ఏర్పాటు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు.సంగారెడ్డి జిల్లా మొట్టమొదటి పెట్రోల్ బంక్ మహిళలే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు . స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎరువులు మందులు పిచికారి కోసం వినియోగించే డ్రోన్లు,ఓం మహిళా క్యాబ్ డ్రైవర్ల శిక్షణ లాంటి కార్యక్రమాలు జిల్లాలో వినూత్నంగా చేపట్టి రాష్ట్ర ంలోనే ఆదర్శంగా నిలిచినట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలోని 23 వేల స్వయం సహాయక సంఘాలకు 30 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరైనట్లు తెలిపారు. ఏడాది 460 ఇందిరా మహిళా శక్తి యూనిట్ల ఏర్పాటు కోసం ప్రణాళికల రూపొందించినట్లు తెలిపారు చిన్న చిన్న వ్యాపారాలను పెద్దపెద్ద వ్యాపారులుగా మార్చడానికి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం తోడ్పాటు అందిస్తుంది అన్నారు ఒకరికొకరు సహాయం చేసుకోవాలి మరియు మీకు మెప్మా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వం తరఫున చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనికి తోడు అదనంగా బీమా కూడా మహిళా స్వయం సహకార సంఘాల సభ్యులకు అందుబాటులో ఉందన్నారు,మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు చేసినట్లు ఇప్పటివరకు జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 26 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు మహిళా సంఘాలు ముందుకు వస్తే భవిష్యత్తులో అన్ని కేజీబీవీలు ఇంటర్మీడియట్ కళాశాలలో ఒకటి నుండి మూడు కోట్ల వరకు ఉన్న భవన నిర్మాణం పనులు సైతం అప్పగించేలా చర్యలు తీసుకుంటామన్నారు మహిళా శక్తి సమూహాల ద్వారా భవిష్యత్తులో అన్ని రకాల అభివృద్ధి పనులు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు . ఇప్పటికే జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు మహిళా శక్తి మరియు మహిళా సమూహాల ద్వారా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు జిల్లాలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ లో కూడా విజయవంతంగా నడుపుతున్నట్లు తెలిపారు . మహిళా పెట్రోల్ బంక్ ద్వారా నెలకు దాదాపు ఐదు లక్షలవరకు సంపాదిస్తున్నట్లు తెలిపారు . జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మహిళా స్వయం సహాయకార సంఘాల ద్వారా స్కూల్ యూనిఫార్మ్ కుట్టించి సకాలంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా నూతన రకాల వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికల రూపొందిస్తున్నట్లు తెలిపారు వాటిని రుణాలు బ్యాంకు రుణాలు శ్రీనిధి రుణాలు రకరకాల రుణాలను సకాలంలో అందించి స్వయం సహాయక సంఘాలు ఆర్థిక అభివృద్ధి కోసం సహకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు,అనంతరం మంత్రుల చేతులమీదిగా సంగారెడ్డి నియోజక వర్గం లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులను , మహిళా సంఘ సబ్యులకు ఋణ భీమా మరియు ప్రమాద భీమా చెక్కులను,మహిళాసంఘాలకు బ్యాక్ లింకెజీ ఋణాలను అర్హులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు,ఈ కార్యక్రమంలో నిర్మల జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ , అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , పి డి డి ఆర్ డి ఓ జ్యోతి , తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలోనే తెలంగాణ విశ్వవిద్యాలయం అగ్రభాగాన ఉంది

## గవర్నర్ మరియు ఛాన్సర్ మాన్య జిష్ణుదేవ్ వర్మ

ఈరోజు తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకమైన రెండవ స్నాకోత్సవం విజయవంతం మైందని వైస్ -ఛాన్సర్ ఆచార్య టి యాదగిరిరావు తెలిపారు. విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన స్నాతకోత్సవ ప్రాంగణంలో స్నిఫర్ డాగ్ స్క్వాడ్ బృందం, బాంబు డిస్పోజల్ టీం, మరియు ఇంటలిజెన్స్ అధికారులు పర్యవేక్షణలో భారీ బందోబస్తు మధ్య అంగరంగ వైభవంగా స్నా తకోత్సవం పూర్తయింది. ఈ సందర్భంగా గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ చాన్సర్ విష్ణుదేవ్ వర్మ కి ఏడవ పటాలపు గాడ్ ఆఫ్ హానర్ టీం మరియు బ్యాండ్ టీంఆర్ఎస్ఐ కొమ్ము శ్రీకాంత్ ఆధ్వర్యంలో గౌరవ వందనం సమర్పించినారు. అనంతరం గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ నాతకోత్సవాన్ని ఉద్దేశిస్తూ ప్రసంగిస్తూ రాష్ట్రం పేరుతో ఏర్పాటుచేసిన తెలంగాణ విశ్వవిద్యాలయానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని గర్వంగా చెప్తున్నానని తెలిపారు. చైతన్యవంతమైన ఈ మట్టిలోని ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు విశ్వవిద్యాలయ అభివృద్ధిలో స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విశ్వవిద్యాలయం సాధించిన విజయాలు, విశేషమైన ప్రగతిపూర్వకమైన సంఘటనలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. 2006లో ఆరు కోర్సులతో ప్రారంభమై నేడు ఏడు విభాగాలలో 24 ఉపవిభాగాలుగా 31 కోర్సులతో బిక్నూరు సారంగపూర్ క్యాంపస్లతో సహా ఇక్కడ ప్రధాన క్యాంపస్ లో విద్యా వికాసం చెందడం ఆనందంగా ఉందని తెలిపారు.

గడిచిన 19 సంవత్సరాల కాలంలో ఇక్కడి అధికారులు అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకుల ఉమ్మడి కృషి అంకితభావం ప్రతిబింబిస్తుందన్నారు. స్నాతకోత్సవ ఏర్పాట్లు కేవలం విద్యాపరమైన లక్ష్యసాధన మాత్రమే కాదని విశ్వవిద్యాలాయంలో నాణ్యమైన, సాంకేతిక విద్య, ఉపాధి కల్పించే భవిష్యత్ ప్రయాణానికి మార్గాన్ని నిర్దేశిస్తుందన్నారు. 2023 - 24 రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం 51 శాతం పట్టభద్రులు దేశానికి నైపుణ్యాల కొరత తీరుస్తూ ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. ఈ విశ్వవిద్యాలయం అనేకమైన, ఆశాజనకమైనటువంటి పారిశ్రామిక విద్యాపరమైన సంబంధాలతో ముందుకు పోవడం స్వాగతించాల్సిందన్నారు . ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చెప్పినట్లు విద్య యొక్క అంతిమ లక్ష్యం సృజనాత్మకమైన మానవుని తయారు చేయడంతో పాటు , ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ చారిత్రాత్మకమైన అభివృద్ధిని సృశించడం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొఠారి కమిషన్ లో చెప్పినట్లుగా దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్ద పడుతుందనేది విశ్వవిద్యాలయ విజయాలు రుజువు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ మాజీ డైరెక్టర్ ఆచార్య శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుండి బయటకు వెళ్లిన ప్రతి విద్యార్థికి ఆందోళనతో పాటు అవకాశాలు కనిపిస్తాయి అన్నారు. ఆందోళన చెందకుండా అవకాశాల వైపు పరిగెత్తాలి అన్నారు.

వర్తమాన కాలంలో అనేక అవకాశాలతో విద్యార్థులు తమ నైపుణ్యాలను, కౌశలాలను, అభిరుచులను ఉపయోగించుకొని అనేక రకాలుగా స్థిరపడే అవకాశం ఉందన్నారు. వారి వారి శక్తి సామర్థ్యాల మేరకు, అభిరుచి మేరకు కొందరు పరిశోధకులుగా మరికొందరు పారిశ్రామికవేత్తలుగా వ్యవస్థాపకులుగా ప్రజాసేవకులుగా విద్యావేత్తలుగా ఉన్నత ఉన్నతంగా స్థిరపడుతున్నరన్నారు. విద్యార్థులు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది జీవితమనేది పందెం లాంటిది కాదని ఇది ఒక ప్రయాణం మాత్రమేనని గుర్తు చేసినారు. ఈ ప్రయాణానికి సమయస్ఫూర్తి లోతైన అధ్యయనం తో పాటు తీసుకునే నిర్ణయాలు మీద భవిష్యత్ నిర్ణయం జరుగుతుందని తెలిపారు. వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ ఈ యాదగిరిరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న కోర్సుల వివరాలతో పాటు అవస్థాపన సౌకర్యాలను సమగ్రంగా తెలియజేసినాడు. విశ్వవిద్యాలయంలో సమీప భవిష్యత్తులో ఇంజనీరింగ్ మరియు ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పరిపాలనా భవనము 500 మంది విద్యార్థినిలకు అన్ని రకాల వసతులు ఉండే విధమైన బాలికల హాస్టల్ ను, వెయ్యి మంది కెపాసిటీతో ఉండే ఆడిటోరియం అన్ని హంగులతో క్రీడా మైదానం అభివృద్ధి లాంటి భవిష్యత్ ప్రణాళికలను తెలియజేశారు. విశ్వవిద్యాలయం విస్తరణలో భాగంగా విశ్వవిద్యాలయ పరిధిని నిజామాబాదు కామారెడ్డి నుండి ఆదిలాబాద్ నిర్మల్ జిల్లాలకు విస్తరించే కృషి చేస్తానన్నారు. ఈ విశ్వవిద్యాలయ మౌలికమైన అభివృద్ధి, ప్రజా ప్రతినిధులతో పాటు, బోధన బోధనేతర సిబ్బంది యొక్క కృషి మీదనే ఆధారపడుతుందని తెలియజేశారు. ఈ స్నాతకోత్సవంలో 15 విభాగాలలో 2014 నుండి 2023 వరకు 132 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందించినారు. 156 మంది పరిశోధకులకు డాక్టరేట్ పట్టాలనిచ్చి నారు. ఈ స్నాతకోత్సవంలో డీన్స్ ప్రొఫెసర్ గంటా చంద్రశేఖర్, ప్రొఫెసర్ అపర్ణ, ప్రొఫెసర్ రాంబాబు, ప్రొఫెసర్ లావణ్య, ప్రొఫెసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, ప్రొఫెసర్ హారతి, ప్రొఫెసర్ నాగరాజు, ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రో అరుణ ప్రొఫెసర్ నాగరాజు పాత, పి ఆర్వో డైరెక్టర్ డా. ఏ పున్నయ్య లతో పాటు బోధన బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులు ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఆపరేషన్ సింధూర్ సమయంలో.. పాకిస్థాన్ డ్రోన్లను, డ్రోన్ ఆయుధాలను వాడింది, ఆర్మీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్

న్యూఢిల్లీ జూలై 16 చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. మే 10వ తేదీన.. ఆపరేషన్ సింధూర్ సమయంలో.. పాకిస్థాన్ డ్రోన్లను, డ్రోన్ ఆయుధాలను వాడిందని, కానీ ఏ ఒక్కటి కూడా భారతీయ సైనిక లేదా పౌర కేంద్రాలను దాడి చేయలేకపోయినట్లు చెప్పారు. కైనిటిక్, నాన్ కైనటిక్ పద్ధతుల్లో ఆ డ్రోన్లను కూల్చివేశామని ఆయన తెలిపారు. కొన్ని డ్రోన్లను రికవరీ చేసినట్లు ఆయన చెప్పారు. యూఏఎస్ డ్రోన్ వ్యవస్థలు చాలా కీలకమైందని, స్వదేశీ పరిజ్ఞానంతో డెవలప్ చేసిన ఆ వ్యస్థలన్నీ ఆపరేషన్ సింధూర్ సమయంలో ఎంతో ఉపయోగపడినట్లు తెలిపారు. మనల్ని మనం రక్షించుకునేందుకు డ్రోన్లపై ఇన్వెస్ట్ చేయాలన్నారు.యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం పెరిగినట్లు అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. వీటి గురించి చర్చించినప్పుడు.. డ్రోన్ల వ్యవస్థలో వికాసం సాధించామా లేక విప్లవాత్మక వినియోగం జరుగుతుందా అని ఆలోచించాల్సి వస్తుందన్నారు. డ్రోన్ల వ్యవస్థలో జరుగుతున్న అభివృద్ధిని వికాసంగా పరిగణించాలని, ఇక యుద్ధాల్లో వాటిని వాడుతున్న తీరును విప్లవాత్మకమైందిగా భావించాలని అనిల్ చౌహాన్ తెలిపారు. యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం విస్తరించిందన్నారు. విప్లవాత్మకమైన రీతిలో ఆర్మీ డ్రోన్లను వాడుతున్నట్లు ఆయన చెప్పారు. ఇటీవల కాలంలో జరుగుతున్న యుద్ధాల్లో డ్రోన్ల పనితీరును ప్రత్యక్షంగా చూస్తున్న విషయం తెలిసిందే.

# ట్రంప్ ఏకపక్ష వాణిజ్య విధానం

అమెరికాతో భారత్ కుదుర్చుకోవలసిన వాణిజ్య ఒప్పందంలో ట్రంప్ విధించిన గడువు జూలై తొమ్మిదితో ముగిసింది. ఈ విషయంలో ఉభయ దేశాల మధ్య చర్చలు జరుగుతుండగానే ట్రంప్ ఏకపక్షంగా భారత్‌లో వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. దీనిపై ప్రధాని మోడీ స్పందించలేదు. ఈ ఒప్పందం ప్రకారమైతే అమెరికా కోసం భారత్ మార్కెట్‌ను తెరవాలి. తన వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలి. మన మార్కెట్‌లోకి అమెరికా ఉత్పత్తులైన డెయిరీ, పౌల్ట్రీ, మొక్కజొన్న, సోయాబీన్, బియ్యం, గోధుమలు, ఇథనాల్, సిట్రస్ పండ్లు, బాదం, యాపిల్,ద్రాక్ష, క్యానడ్ పీచస్,చాక్‌లెట్స్ ఇవి దిగుమతి అయితే దేశ వ్యవ సాయ రంగానికి తీవ్రనష్టం. ఎందు కంటే, భారత జనాభా 146కోట్ల మందికి సరిపడా ఆహార ధాన్యాలు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని అమెరికా నుండి దిగుమతి చేసుకుంటే వ్యవసాయ రంగంపై ఆధారపడిన సన్న,చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారు. అమెరికాలో సబ్సిడీలెక్కువ. అందులో వ్యవసాయంపై ఆధారపడిన వారు కేవలం ఐదు శాతం మాత్రమే. అక్కడ యావరేజ్ కమతం 187 హెక్టార్లు. భారతదేశంలో ఒక హెక్టార్‌లోపు మాత్రమే వస్తుంది. కాబట్టి అమెరికాలో దిగుబడి బాగా ఉంటుంది. భారత మార్కెట్ లో వ్యవసాయం, పాల ఉత్పత్తుల రంగంలో తమ ఉత్పత్తులను తెరవాలనేది అమెరికా డిమాండ్.ఈ ఉత్పత్తుల దిగుమతులపై విధిస్తున్న సుంకాలను తగ్గించమని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది.అమెరికా ప్రధానంగా గోధుమ,బియ్యం,పాల ఉత్పత్తులు,సోయా,పిస్తా,బాదం వంటి ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించాలని కోరుతోంది. అమెరికన్ కంపెనీలు అమెజాన్,వాల్‌మార్ట్ వంటి సంస్థలు నేరుగా భారత మార్కెట్‌లోకి ప్రవేశించి తమ ఉత్పత్తులను సులభంగా విక్రయించేందుకు ఇది సహాయపడుతుంది.అయితే ఈ ఉత్పత్తులు చౌకధరలకు అందిస్తే భారతదేశ రైతులు తీవ్రనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆహార భద్రత కింద వ్యవసాయ ఉత్పత్తుల ధరలను కూడా కేంద్ర ప్రభుత్వం నియంత్రణలో ఉంచుతుంది. దీంతో మన రైతులకు గిట్టుబాటు ధరలు కూడా రావడం లేదు.జన్యుపరమైన మార్పులతో అమెరికా పండించిన ఆహార పంటలను ఉత్పత్తి చేస్తుంది.ప్రధానంగా మొక్కజొన్న, సోయాబీన్స్ వంటివి వీటితో పాటు పశువులకు అవసరమైన దానా సప్లరు చేయడానికి ఒప్పం దం చేసుకోవాలని చూస్తుంది. గతంలో మనదేశం డెయిరీ ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఇప్పుడు దాన్ని ఎత్తివేయాలని అమెరికా కోరుతున్నది. ఇండియా సాధారణంగా 17శాతం టారిఫ్ వేస్తున్నది.దీన్ని ఇప్పుడు టారిఫ్ కిందకు తీసుకురావాలని చెప్ప కుండా 3.3శాతం టారిఫ్ అమలు చేయాలంటోంది.అమెరికా మన ఎగుమతులపై 26శాతం టారిఫ్‌లు పెంచింది. తమ వాణిజ్యలోటును తగ్గించుకునేందుకు వ్యవసాయ ఉత్పత్తులను భారత్‌కు ఎగుమతి చేయాలనుకుంటోంది.దీంతో అమెరికా లోని రైతులకు లాభం చేకూరుతుంది. అమెరికా ఉత్పత్తులు మన దేశంలోకి వస్తే మన పంటలకు ధరలు లేక రైతుల ఆదాయాలు పడిపోతాయి. పైగా రైతులు అనివార్యంగా వ్యవసాయ రంగం నుంచి తప్పుకుని ఆహార పంటలను తగ్గించాల్సి వస్తుంది. అమెరికాలో మొక్క జొన్న, సోయాబీన్, గోధుమ, బియ్యం వంటి పంటలపై నూతన వ్యవసాయ బిల్లులతో 61డాలర్ల నుండి 175డాలర్లకు సబ్సిడీ పెంచారు.అంటే 150శాతం.పంట బీమా సబ్సిడీ,అగ్రికల్చర్ రిస్క్ కవరేజీ కూడా కనీస దిగుబడి కంటే తక్కువ వస్తే మాత్రమే అంత మొత్తం సబ్సిడీ ఇస్తారు.ధర కోల్పో యిన కవరేజ్ కూడా జాతీయ సగటు ధర కంటే మార్కెట్‌లో తక్కువ ధరకు సరుకు అమ్మితే ఆ మొత్తం సబ్సిడీ ఇస్తారు.పంట ఉత్పత్తి, పర్యావరణహిత పంటలకు మాత్రమే సబ్సిడీ ఇస్తారు.అమెరికాలో చిన్న రైతులకు కేవలం 39శాతం సబ్సిడీలిస్తే పెద్ద రైతులకు 69శాతం సబ్సిడీ ఇస్తున్నారు.ఈ సంఖ్య చాలా పెద్దగా ఉంటుంది. అమెరికాలో చిన్నరైతు అంటే 500 ఎకరాలలోపు ఉన్నవారే.అమెరికా బడ్జెట్‌లో 6.8ట్రిలియన్ డాలర్లు కేటాయించినది.ఒక ట్రిలియన్ అంటే రూ.వెయ్యి కోట్లు.అంటే 6లక్షల 80వేల కోట్ల డాలర్లు.అయితే భారతదేశం వ్యవసాయ రంగానికి కేవలం 2.5శాతం మాత్రమే సబ్సిడీ ఇస్తున్నది.ఈ రకంగా భారతీయ వస్తువులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించిన పక్షంలో వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, ఫార్మా,వైద్య పరికరాలు,విద్యుత్తు పరికరాలు,యంత్రాలతోసహా అనేక రంగాలకు చెందిన వస్తువులపై ప్రతి కూల ప్రభావం పడుతుంది. అమెరికా,భారత్ విధించే దిగుమతి సుంకాల రేట్ల మధ్య చాలా తేడా ఉన్న కారణంగా ట్రంప్ ప్రభుత్వం నుంచి అదనపు కస్టమ్స్ సుంకాలను ఈ రంగాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అమెరికా,భారత్ మధ్య రసాయనాలు,ఫార్మసీ వస్తువుల దిగు మతి సుంకంలో 8.6 శాతం తేడా ఉంది.ట్రంప్ విధించే ప్రతీకార సుంకాల కారణంగా అమెరికాకు దిగుమ తయ్యే భారతీయ వస్తు వులపై నికరంగా 310 కోట్ల డాలర్ల అంటే సుమారు 26,483 కోట్ల రూపాయలు నష్టం ఏర్పడగలదు. ఇది భారత జీడీపీపై 0.1 శాతం ప్రభావం చూపగలదు. అందుకే ట్రంప్ టారిఫ్‌లను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించాలి.

## మళ్లీ యనమల యాక్టివ్...

కాకినాడ, జూలై 16, సీనియర్ నేత మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిలో మళ్లీ ఆశలు పెరిగాయి. మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి దక్కడంతో తనకు కూడా పార్టీ హైకమాండ్ ఏదో ఒక పదవి ఖచ్చితంగా ఇస్తుందన్న నమ్మకం పెరిగిపోయిందట. అశోక్ గజపతిరాజు లాగానే తాను కూడా పార్టీలో సీనియర్ నేత కావడంతో పాటు క్లిష్ట సమయంలో చంద్రబాబు కు అండగా నిలబడటంతో తనకు ఖచ్చితంగా పదవి లభిస్తుందన్న భావనలో ఉన్నారు. అశోక్ గజపతి రాజు కుమార్తె ఆదితి గజపతి రాజుకు కూడా గత ఎన్నికల్లో విజయనగరం టిక్కెట్ ఇవ్వగా, యనమల కుమార్తె దివ్యకు తుని నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చింది. తునిలో యనమల దివ్య గెలిచింది. సుదీర్ఘకాలం తర్వాత తుని నియోజకవర్గంలో టీడీపీ గెలిచింది. ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడంతో తనకు పెద్దల సభకు పంపాలని యనమల రామకృష్ణుడు బలంగా కోరుకుంటున్నారు. పార్టీ కోసం ఇప్పటి వరకూ తాను చేసిన కృషి, పడిన శ్రమను హైకమాండ్ గుర్తించకపోతుందా? అని యనమల బలంగా నమ్ముతున్నారు. అందుకే ప్రస్తుతం యనమల రామకృష్ణుడు మౌనంగానే ఉంటున్నారు. అదే సమయంలో తుని నియోజకవర్గానికే పరిమితమయ్యారు. అలాగని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మీద విమర్శలు మానుకోలేదు. అంటే ఖచ్చితంగా చంద్రబాబు తనవైపు చూస్తారని యనమల గట్టిగా విశ్వసిస్తున్నారు. తనలాంటి సీనియర్ నేతలను, సామాజివర్గానికి చెందినవారిని పక్కన పెట్టే అవకాశం లేదని కూడా అంచనా వేస్తున్నారు.  అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ... ఆయన వయసుతో పాటు కొన్ని ప్రత్యేక పరిస్థితులు టీడీపీ అధినాయకత్వం మంత్రిపదవికి దూరం పెట్టింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ యనమల రామకృష్ణుడు మంత్రి పదవిలో ఉంటారు. ఆయనకు తూర్పు గోదావరి జిల్లా నుంచి నియోజకవర్గం ఫిక్స్ అయినట్లేనని ఎవరైనా లెక్కలు వేసుకుంటారు. పైగా చంద్రబాబుకు యనమల అత్యంత సన్నిహితుడిగా ముద్రపడింది. అనేక కష్ట సమయాల్లో పార్టీకి అండగా నిలిచారన్న పేరు కూడా పార్టీలో యనమల రామకృష్ణుడికి ఉంది. సీనియర్ నేత అయినా ఆయన సేవలను ఉపయోగించుకుంటారని అందరూ భావించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యనమల రామకృష్ణుడుకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో అప్పుడే కొంత సందిగ్దత మొదలయింది.. గత వైసీపీ హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన పెట్టినప్పుడు యనమల రామకృష్ణుడు శాసనమండలిలో తన రాజకీయ చతురతను ఉపయోగించి బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోగలిగారు. ఇలా ఎలా చూసినా యనమల రామకృష్ణుడికి పదవి గ్యారంటీ అన్న ప్రచారం ఊపందుకుంది. మరొక వైపు అశోక్ గజపతిరాజుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఏడాది తర్వాత గోవా గవర్నర్ గా నియమించడంతో ఇక తనను కూడా ఇటు రాజ్యసభ కు కాని, అటు గవర్నర్ గా పంపుతారన్న నమ్మకం యనమల రామకృష్ణుడి వర్గంలో పెరిగిపోయింది. అందుకే ఇక యనమల రానున్న రోజుల్లో మరింత యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నది భవిష్యత్ లో తేలనుంది.

## ఎవ్వరికి పట్టని ఆదిమూలం

తిరుపతి, జూలై 16,కొందరు రాజకీయ నేతలకు పాపం.. ఏ పార్టీలో ఉన్నా సుఖం ఉండదు. ఎమ్మెల్యేగా గెలిచారన్న మాటే కానీ వారు వార్డు సభ్యుడి కంటే హీనంగా చూస్తారు. అందులోనూ రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో ఇటువంటి పరిస్థితి ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోవాల్సిందే. అది వైసీపీ అధికారంలో ఉంటే రెడ్డి సామాజికవర్గం నేతలు ఆధిపత్యం వహిస్తారు. టీడీపీ అధికారంలో ఉంటే కమ్మ సామాజికవర్గం నేతలు పెత్తనం చేస్తారు. ఫలితం మాత్రం సేమ్ టు సేమ్. అక్కడ ఎమ్మెల్యేల మాట చెల్లుబాటు కాదు. పార్టీని నడిపించే అధికార పార్టీ నేతల మాటకే విలువ ఉంటుంది. అధికారులు సయితం వారికే సెల్యూట్ కొడతారు.రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా... చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏ మాత్రం లేదు. సత్యవేడు నియోజకవర్గం నుంచి కోనేటి ఆదిమూలం 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. అయితే అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ఆయన మాట చెల్లుబాటు కాలేదు. అంతా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనమే నడిచింది. తన నియోజకవర్గం కాకపోయినా చిత్తూరు జిల్లా కావడంతో పెద్దిరెడ్డి చెప్పినట్లు అధికారులు నడుచుకునే వారు. ఆదిమూలం మాత్రం పేరుకు ఎమ్మెల్యేగా ఉన్నా ఏ ప్రయోజనమూ లేదు. పెద్దిరెడ్డితో కోనేటి ఆదిమూలం విభేదించడంతో ఆయనను తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం ఎంపీగా పోటీ చేయాలని అన్నారు. దీనికి ఇష్టపడని ఆదిమూలం టీడీపీలో చేరిపోయారు.. టీడీపీ నుంచి 2024 ఎన్నికల్లో టిక్కెట్ తెచ్చుకున్న కోనేటి ఆదిమూలం రెండోసారి కూడా గెలిచారు. అయినా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పురాలేదు. ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదయింది. దీంతో తెలుగుదేశం పార్టీ ఆదిమూలం కోనేటిని సస్పెండ్ చేసింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేసు నమోదయింది. తనపై కుట్ర జరిగిందని ఆయన చెప్పినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత న్యాయస్థానంలో బాధితురాలు ఆ కేసును విత్ డ్రా చేసుకోవడంతో ఆదిమూలం కోనేటి పై కేసును కొట్టి వేశారు. కేసు ఏమీ లేదని తెలిసిన తర్వాత, బాధితురాలు స్వయంగా ప్రకటన చేసిన తర్వాత కూడా కోనేటి ఆదిమూలం పరిస్థితుల్లో మార్పు రాలేదు. దీంతో కోనేటి ఆదిమూలంకు కోపం నషాళానికి అంటింది. ఎంతమంది తనపై పెత్తనం చలాయిస్తారంటూ మండిపడ్డారు. కొద్ది రోజులుగా తనా? పార్టీకి దూరంగా ఉంటే నియోజకవర్గంలో ఎవరు పడితే వాళ్లు వస్తారా? అని ఆయన నిన్న ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేకు కాకుండా పార్టీలో ఉన్న ఇతరులకు పోలీసులు ఎలా సెల్యూట్ కొడతారంటూ ఆదిమూలం కోనేటి మండిపడ్డారు. ప్రజల ఓట్లతో గెలిచిన తనను కాదని, ఒకరు కో- ఆర్డినేటర్ గా, మరకొరు పరిశీలకుడిగా చెప్పుకుంటూ నియోజకవర్గంలో పనులన్నీ చక్కబెట్టుకుంటున్నారని, తనపై తప్పుడు ప్రచారం చేసిన వారినే వీరు వెనకేసుకు వస్తున్నారని ఆదిమూలం కోనేటి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆదిమూలం ఆవేదన పట్టించుకునే వారెవరు?

## లిక్కర్ ఫైల్స్ కొలిక్కి వచ్చినట్టేనా
## ఇవాళ చార్జిషీట్ దాఖలు

విజయవాడ, జూలై 16, అసలు ఎపిసోడ్ ఇప్పుడే స్టార్ట్ అయింది. అరెస్టులు, విచారణలు, కస్టడీలు..ఇవన్నీ ఆల్‌మోస్ట్ కంప్లీట్ అయినట్లే. కానీ కీలక దశలో ఉన్న లిక్కర్ కేసులో నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకోవడమే సిట్ ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం కోర్టులో సబ్‌మిట్ చేసేందుకు పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోందట సిట్. ముడుపుల వ్యవహారం ఏంటి..ఎవరెవరికి లింకులు ఉన్నాయి..ఏ నెంబర్ కార్లు వాడారు..ఫోన్ సంభాషణలు ఏంటి..ఇలా ప్రతీ ఒక్కటి పక్కా స్కెచ్ ప్రకారం జరిగిందని ప్రూవ్ చేసేందుకు తీవ్ర కసరత్తే చేస్తోందట సిట్ టీమ్. లేటెస్ట్ టెక్నాలజీతో మద్యం ముడుపుల వీడియోలను సేకరించినట్లు తెలుస్తోందిడెన్లలో దాచిన డబ్బులు, వాటిని నిందితులు సెల్‌ఫోన్లలో షూట్ చేసిన వీడియోలు దొరికినట్లు చెబుతున్నారు. నిందితుల నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల నుంచి ఈ వీడియోలను స్వాధీనం చేసుకున్నారని అంటున్నారు. ఎన్నికల తర్వాత నిందితులు ముందు జాగ్రత్తగా తమ సెల్‌ఫోన్ల నుంచి ఆ వీడియోలను డిలీట్ చేశారట. అధికారులు ఆ సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపి డిలీట్ చేసిన వీడియోలను రిట్రీవ్ చేశారని చెప్పుకుంటున్నారు.మద్యం డీలర్ల నుంచి ముడుపులు వసూలు చేశాక పెద్దలకు చేరవేసేవరకు..అంతా లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో జరిగిందట. నిందితులు లిక్కర్ సొమ్ము పంపిణీకి ముందు వీడియోలు తీశారని అంటున్నారు. డెన్లలో దాచిన డబ్బుల వివరాలను సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి పెట్టుకున్నారట. ఎన్నికల తర్వాత అలర్ట్ అయిన రాజ్ కసిరెడ్డి తాను ఏర్పాటు చేసుకున్న వసూళ్ల నెట్‌వర్క్‌లోని ప్రతి వ్యక్తినీ హైదరాబాద్‌కు పిలిపించి వారి సెల్‌ఫోన్లు తీసుకున్నాడని విచారణలో తేలిందంటున్నారు.ప్రతి ఫోన్‌కూ కనీసం లక్ష రూపాయలకు తగ్గకుండా ఇచ్చి కొత్త ఫోన్ తీసుకోవాలని సూచించాడట. ఇక లిక్కర్ ఆర్డర్లు పెట్టిన కంప్యూటర్లను డిపోల్లో ధ్వంసం చేశారట. అయినా కొన్ని వీడియో ఫుటేజ్‌లతో పాటు చాటింగ్‌లు, ఫొటోలు బయటపడ్డట్లు తెలుస్తోంది. సిట్ అధికారులు త్వరలో దాఖలు చేయనున్న చార్జిషీట్‌లో ఈ ఆధారాలను పొందుపరచనున్నట్లు తెలుస్తోంది.లిక్కర్ కేసులో ఓ స్కెచ్ ప్రకారం దోపిడీ జరిగిందని విచారణలో తేలిందంటున్నారు. సిట్ ఇప్పటి వరకూ 40 మందిని నిందితులుగా చేర్చింది. రాజ్ కసిరెడ్డితో పాటు మాజీ సీఎం జగన్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేసింది. సాక్షులు, అనుమానితులను 200మందికి పైగా విచారించింది. ఈ కేసులో భాగస్వామ్యం ఉన్న పది మందికిపైగా విదేశాలకు పారిపోయారు. ఈ కేసు విచారణలో మూడు నెలలకు పైగా సిట్ సేకరించిన ఆధారాలు ఈ నెల 17న విజయవాడ ఏసీబీ కోర్టుకు చేరనున్నాయి.మద్యం ముడుపుల వసూళ్లు, డెన్‌లలో దాచడం, కీలక వ్యక్తులకు పంపడం, ఎన్నికల్లో అభ్యర్థులకు పంపిణీ చేయడం, కీలక వ్యక్తుల పాత్ర, బినామీల ఆస్తులు, హవాలా మార్గంలో విదేశాలకు తరలించడం వంటివి చార్జిషీట్‌లో మెన్షన్ చేసే అవకాశం ఉందంటున్నారు. పది రోజులకు పైగా ఇదే పనిలో బిజీగా ఉన్న సిట్ అధికారులు లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో చర్చిస్తున్నారట. సూత్రధారులెవరు, పాత్రధారులెవరనే దానిపై టెక్నికల్ ఎవిడెన్స్‌తో పక్కా ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ వేయబోతున్నారట.ఎక్సైజ్ అధికారులు, గత ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నేతల పాత్రపై కూడా ఇప్పటివరకు తాము కలెక్ట్ చేసి అన్ని ఎవిడెన్స్‌ను సిట్ కోర్టుకు సబ్‌మిట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 21 నాటికి రిమాండ్ ఖైదీగా రాజ్ కసిరెడ్డి జ్యుడీషియల్ కస్టడీ 90 రోజులు పూర్తి అవుతుంది. ఈ లోపు చార్జిషీట్ వేయకపోతే డిఫాల్ట్‌గా బెయిల్ వస్తుంది. దీంతో ప్రధాన నిందితుడిగా అలిగేషన్స్ ఫేస్ చేస్తున్న రాజ్‌కసిరెడ్డి బయటికి వస్తే..కేసు మొత్తం తారుమారైపోతుందని సిట్ భావిస్తోందట. అందుకే చాలా పకడ్బందీగా..లీగల్ ఎక్స్‌పర్ట్స్ ఒపీనియన్‌తో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.ఓ వైపు విజయసాయిరెడ్డి సిట్ విచారణ బాకీ ఉంది. ఇప్పటికే ఆయన ఓ సారి సిట్ ముందుకెళ్లి..ఇన్ అండ్ ఔట్ అంతా చెప్పేసి..అందరినీ ఇరకాటంలో పెట్టేశారు. ఇప్పుడు మరోసారి ఆయన సాక్షిగా సిట్ ముందు హాజరుకాబోతున్నారు. ఈసారి విజయసాయి ఏం చెప్తారనే టెన్షన్ ఓ వైపు కొనసాగుతూనే ఉంది. ఇక ఇప్పుడు ఛార్జిసీట్ అంశం ఇంకా ఉత్కంఠ రేపుతోంది. రాజ్‌కసిరెడ్డికి బెయిల్ రావడం..రాకపోవడం పక్కన పెడితే..ఆయనతో ఎవరికి లింకులు ఉన్నాయని సిట్ ఆరోపిస్తుందో..ఎలాంటి ఆధారాలను బయటపెడుతుందోనన్న ఆందోళన అయితే ఫ్యాన్ పార్టీ పెద్దల్లో కనిపిస్తుందంటున్నారు.

## వలంటీర్ల వ్యవస్థ...కామా కాదు... ఫుల్ స్టాప్...

గుంటూరు, జూలై 16, ఏపీలో కూటమి సర్కార్ వచ్చిన తర్వాత వాలంటీర్ల వ్యవస్థను సైడ్ చేశారు. వాలంటీర్లు సేవలను వాడకుండానే పెన్షన్లను ఇచ్చేస్తున్నారు. రేషన్ బండ్లతో పనిలేకుండానే సరుకుల్ని పంచేస్తున్నారు. ఏపీలో ఇక వాలంటీర్ల అవసరం లేకుండా పోయింది. వాలంటీర్ల వ్యవస్థ వల్లే వైసీపీకి నష్టం జరిగిందని అన్ని సర్వేలు చెబుతున్నాయి. ఇటు వైసీపీ సైతం అదే నిజమని భావిస్తోంది.

అందుకే కూటమి సర్కార్ కూడా వాలంటీర్ల వ్యవస్థను టచ్ చేయడం లేదట.వాలంటీర్ల వ్యవస్థ విషయంలో వైసీపీ కూడా ఓ క్లారిటీకి వచ్చేసినట్టు ఆ పార్టీ నేతలు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. మాజీ సీఎం జగన్ ఇక నుంచి వాలంటీర్ల వ్యవస్థ జోలికి వెళ్లకూడదని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తాజాగా దీనిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే పార్టీ అంతర్గత మీటింగ్‌లో మాట్లాడారని తెలుస్తోంది. వాలంటీర్ల వ్యవస్థ పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకొచ్చారాయన. వాలంటీర్ల వ్యవస్థ అనేది ముగిసిన అధ్యయం కానుంది. కూటమి ప్రభుత్వమే కాదు భవిష్యత్‌లో వైసీపీ కూడా వాలంటీర్ వ్యవస్థ జోలికి పోయేలా కనిపించడం లేదు. ఆ వ్యవస్థతోనే వైసీపీకి దారుణ పరాజయం ఎదురైందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారట.నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల పార్టీ శ్రేణులతో కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ వ్యవస్థ వల్ల వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరమయ్యారని అన్నారు. తాను పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి దగ్గర ఇదే విషయాన్ని ప్రస్తావించానని చెప్పుకొచ్చారు. ఏ పార్టీకైనా కార్యకర్తలే మూలస్తంభాలని, వాలంటీర్లు కాదని హైకమాండ్‌కు చెప్పారట.వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరోసారి వలంటీర్ వ్యవస్థ జోలికి వెళ్ళవద్దని విజ్ఞప్తి చేసినట్లు స్వయంగా పార్టీ సమావేశంలోనే చెప్పారట. అయితే మాజీ ఎమ్మెల్యే అభిప్రాయాన్ని ఆ పార్టీ శ్రేణులందరూ ముక్తకంఠంతో ఆహ్వానించారట. రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఇదే అభిప్రాయంతో ఉన్నారని పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్.  2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ వ్యవస్థను ప్రారంభించింది వైసీపీ ప్రభుత్వం. ప్రతి 50 కుటుంబాల బాధ్యతను వారికి అప్పగించింది. దీంతో వైసీపీ నాయకత్వానికి, పార్టీ శ్రేణులకు పని లేకుండా పోయింది.ప్రభుత్వం అంటే వలంటీర్ వ్యవస్థ అనే భావన ప్రజల్లో పాతుకుపోయింది. ప్రతి చిన్న అవసరానికి జనం వాలంటీర్ల చుట్టూ తిరిగారు. వైసీపీ క్యాడర్, స్థానిక నేతలకు ప్రజలతో గ్యాప్ ఏర్పడింది. అప్పట్లో వాలంటీర్ వ్యవస్థపై వైసీపీ ప్రజా ప్రతినిధులే పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. కానీ మాజీ సీఎం జగన్ లెక్క చేయలేదు. సరిగ్గా ఎన్నికల ముందు వాలంటీర్ వ్యవస్థను నిలిపివేసింది ఎన్నికల కమిషన్. దీంతో చాలామంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. అయితే కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని.. రాజీనామాలు చేయవద్దని విజ్ఞప్తితో.. సగం మంది రాజీనామాలు చేయలేదు.అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదన్నర అవుతోంది. కానీ వాలంటీర్ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం పెద్దగా మాట్లాడడం లేదు. వాలంటీర్ వ్యవస్థ మూలంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగిందన్నది మెజారిటీ పార్టీ శ్రేణుల అభిప్రాయపడుతున్నారు.ఒకవేళ ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థను సమర్థిస్తే.. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం డైలామాలో ఉందట. అందుకే ఈ వ్యవస్థ విషయంలో కూటమి బాటలోనే నడవాలని వైసీపీ నిర్ణయించుకుందని పొలిటికల్ సర్కిళ్లలో మెయిన్ డిబెట్ పాయింట్‌గా మారింది.ఫైనల్‌గా వాలంటీర్ల వ్యవస్థకు తెరపడినట్లేనన్న టాక్ వినిపిస్తోంది. భవిష్యత్‌లో కార్యకర్తలకే ప్రయారిటీ ఇస్తామని స్వయంగా పార్టీ అధినేత జగన్ అంటున్నారు. అంటే వాలంటీర్లు ఉండరని చెప్పకనే చెప్తున్నారు జగన్. అలా అధికార, అపోజిషన్ వార్ మధ్య వాలంటీర్ వ్యవస్థ కనుమరుగైనట్లేనన్న ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి.

## మరొక జాతీయరహదారికి మహర్ధశ

కర్నూలు, జూలై 16, ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల వెంబడి ఉన్న గ్రామాలు, పట్టణాల రోడ్ల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు.. గతంలో జాతీయ రహదారుల వెంబడి బైపాస్ రోడ్లు వేశారు.. అయితే వాటిని పట్టించుకోలేదు. తాజాగా కేంద్రం నిధులు ఇస్తుండటంతో అధికారులు వాటి అభివృద్ధికి ప్రణాళికలు వేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న జాతీయ రహదారుల అనుసంధాన రోడ్లను అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నంద్యాల-చిత్తూరు (నేషనల్ హైవే-40), కర్నూలు-గుంటూరు (340సీ), సోమయాజులపల్లె-డోన్ (340బీ), నేషనల్ హైవే 167, నేషనల్ హైవే-44, చెన్నై-సూరత్ 150సీ జాతీయ రహదారుల వెంబడి బైపాస్ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఈ రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించడంతో అధికారులు అంచనాలు రూపొందించారు.నేషనల్ హైవే-40 పరిధిలో నంద్యాల, ఆళ్లగడ్డ బైపాస్ రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు అవుతుందని అంచనా వేశారు. దీనితో పాటుగా 340బీ సోమయాజులపల్లె-డోన్ రహదారిలో బేతంచెర్ల, డోన్ బైపాస్ రోడ్లకు నిధులు కేటాయించారు. కర్నూలు-గుంటూరు 340సీ రహదారిపై నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర ఉన్న బైపాస్‌ను కూడా అభివృద్ధి చేస్తారు. కర్నూలు జిల్లాలో బళ్లారి-రాయచూరు నేషనల్ హైవే 167కు సంబంధించి.. హాలహర్వి-మాధవరం వరకు 58 కిలోమీటర్ల రోడ్డులో ఆదోని వద్ద బైపాస్‌కురూ.5 కోట్లు అవసరమని అంచనా వేశారు.

# బూస్టర్ లా భోగాపురం

విజయనగరం, జూలై 16, విజయనగరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ పూర్తయితే.. ఉత్తరాంధ్ర రూపురేఖలే మారిపోనున్నాయ్. భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఆ ప్రాంతమే కాదు చుట్టపక్కల ఉన్న మిగతా ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయ్. ఈ ప్రాజెక్టుతో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాదు.. పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు బీజం పడనుంది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం.. అదే.. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్.. విజయనగరంలో జిల్లాలో ఈ విమానాశ్రయం పూర్తయితే.. ఉత్తరాంధ్ర లెక్కే మారిపోతుందనే మాటలు వినిపిస్తున్నాయి. అటు విశాఖ, ఇటు శ్రీకాకుళానికి మధ్య ఉన్న విజయనగరాన్ని కలిపేలా.. ఈ ఎయిర్‌పోర్ట్‌ని నిర్మిస్తున్నారు. ఎన్‌హెచ్-16కి ఆనుకొని దీనిని నిర్మిస్తుండటం.. మరో మేజర్ ప్లస్ పాయింట్. ఇప్పటికే.. ఎయిర్‌పోర్ట్ పనులు సుమారు 80 శాతం వరకు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి.. భోగాపురం ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తీసుకురావాలని.. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎయిర్‌పోర్ట్ పనుల్లో కదలిక. ఎయిర్‌పోర్ట్ పనులు వేగంగా సాగుతుండటంతో.. పదేళ్లుగా పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రతిపాదన వచ్చింది. దాంతో.. రియల్టర్లంతా పెద్ద ఎత్తున లేఅవుట్‌లు వేసుకున్నారు. తర్వాత వైసీపీ హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్వశ్చన్ మార్క్‌లా మారింది. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. విమానాశ్రయ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతుండటంతో.. రియల్టర్లలో మళ్లీ ఆశలు చిగురించాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వల్ల ఉద్యోగ అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ఎయిర్‌పోర్ట్ మెయింటెనెన్స్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, రిటైల్ లాంటి రంగాల్లో.. వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. పారిశఅరామికంగా, విమానాశ్రయానికి సమీపంలో కొత్త పరిశ్రమలు, గోడౌన్‌లు, వ్యాపార సంస్థలు ఏర్పడతాయి. ఇది.. ఆ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థని బలోపేతం చేస్తుందని చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు. ఇదిలా ఉంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్యూచర్ అంతా టూరిజందే అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో.. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను కోరుతున్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల తీర ప్రాంతాల్లో.. టూరిజాన్ని డెవలప్ చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఫైవ్ స్టార్ హోటళ్ల నుంచి బీచ్‌లో కాటేజీల దాకా అన్నింటిపైనా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. టూరిజంతో పాటు ఐటీ సెక్టార్, ఇంజనీరింగ్ పరిశ్రమల్ని అభివృద్ధి చేసి.. ఉత్తరాంధ్రలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతోంది కూటమి ప్రభుత్వం.భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఉత్తరాంధ్రలో టూరిజం బాగా డెవలప్ కానుంది. విజయనగరం జిల్లా సమీపంలోని టూరిస్ట్ స్పాట్‌లకు.. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాకపోకలు పెరుగుతాయి. దాంతో.. హోటల్స్, రిసార్ట్స్, రెస్టారెంట్ల లాంటి హాస్పిటాలిటీ రంగం డెవలప్ అవుతుంది. మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఊహించని మార్పులొస్తాయ్. రోడ్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, కరెంట్ సప్లై లాంటివన్నీ మెరుగుపడతాయి. మొత్తంగా.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విజయనగరం జిల్లాని ఓ ముఖ్యమైన ఎకనమిక్ జోన్‌గా మార్చి.. ఆ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బూస్టర్‌లా మారనుంది

# కోనసీమలో కేంద్రీయ విద్యాలయానికి నిధులు

రాజమండ్రి, జూలై 16, పేద, మద్య తరగతి వర్గాలకు చెందిన వారిలో చాలామందిలో తమ పిల్లలు కేంద్రీయ విద్యాలయంలో చదివించాలని ఉంటుంది. ఎందుకంటే అక్కడ సీబీఎస్ఈ కరికులమ్ ఉంటుంది కాబట్టి. ప్రాథమిక విద్యలో కేంద్రీయ విద్యాలయానికి ఉన్న విలువ అటువంటిది. అయితే కేంద్రీయ విద్యాలయాలు చాలా పరిమితంగా ఉండడంతో చాలా మంది తల్లిదండ్రులు సీబీఎస్ఈ సిలబస్‌పై ఉన్న మక్కువతో తమ శక్తికి మించి ఈ సిలబస్ ఆఫర్ చేస్తోన్న ప్రయివేటు విద్యాసంస్థలను ఆశ్రయించే పరిస్థితి ఉంటుంది.

అయితే ఇలా ఆకాంక్షించే వారి కో గుడ్‌న్యూస్ ఇది.కేంద్రీయ విద్యాలయం ఇప్పుడు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. అల్లవరం మండలం ఓడలరేవు సముద్రతీర ప్రాంతంలో 7.50 ఎకరాల భూమిలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయగా భవన, మౌలిక సదుపాయాల కల్పన కోసం 7.50 ఎకరాల భూమిని పరిశీలన చేశారు అధికారులు. అయితే ఇప్పుడు తాజాగా భూ సేకరణ నిమిత్తం రూ.3.30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడంపై కోనసీమ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇంతవరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రిలో కేంద్రీయ విద్యాలయ ఉండగా అది ఓఎన్జీసీ సహకారంతో కొనసాగుతోంది. అయితే ఇప్పుడు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మరొకటి మంజూరు కాగా ఇది రెండో కేంద్రీయ విద్యాలయం. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు సాగర తీరం సమీపంలో ఈ కేంద్రీయ విద్యాలయాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధూర్ చొరవతో భూ సేకరణ నిమిత్తం నిధులు మంజూరు కాగా దీనికి కృషిచేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎంపీ హరీష్ కృతజ్ఞతలు తెలిపారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలంలోని వడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి మార్గం సుగమం అవ్వడంతో ముఖ్యంగా ఈ ప్రాంత విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నో ఏళ్లుగా కోనసీమ వాసులు ఎదురుచూస్తోండగా ఈప్రాంతంలో ముఖ్యంగా వ్యవసాయ, మత్స్యకార కుటుంబాలు, కార్మిక కుటుంబాల్లోని పిల్లలతోపాటు ఇతర ప్రైవేటు రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు స్థానికంగా ఉన్నతమైన సీబీఎస్ఈ విద్యను అందించే అవకాశం కలగడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీబీఎస్ఈ కోర్సను తమ పిల్లల్ని చదివించేందుకు నిరుపేదలు, మధ్యతరగతి వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ఓడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయాన్ని త్వరితగతిన ప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

# అన్నమయ్య జిల్లా మహిళల అద్భుతాలు

కడప, జూలై 16, అన్నమయ్య జిల్లా మహిళలు రసాయన ఎరువులకు దూరంగా ప్రకృతి వ్యవసాయంతో ఆదర్శంగా నిలుస్తున్నారు. పొదుపు సంఘాలతో కలిసి చిరుధాన్యాల తినుబండారాలు తయారు చేసి విక్రయిస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ, రాగి లడ్డూలు, కొర్ర పాయసం వంటి వాటిని మండల కేంద్రాల్లో అమ్ముతున్నారు. వారానికి రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందుతూ, కుటుంబానికి లక్ష నుంచి రెండు లక్షల వరకు సంపాదిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రసాయన ఎరువుల కారణంగా పంటలు విషపూరితం అవుతున్నాయి. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం వైపు ఎంతోమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. అన్నదాతలు మాత్రమే కాదు.. అన్నమయ్య జిల్లాలోని మహిళలు పొదుపు సంఘాలతో పాటు ప్రకృతి వ్యవసాయం కూడా చేస్తున్నారు. చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేసి అమ్ముతున్నారు.. తద్వారా లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్నారు.. లాభాలు కూడా పొందుతున్నారు.అన్నమయ్య జిల్లా అయ్యవారిపల్లె, చింతలవారిపల్లె, చింతపర్తి, నగిరి మడుగ, బూడిద వేడుకు చెందిన 15 మంది మహిళలు కలిసి ఒక సంఘంగా ఏర్పడ్డారు. వారికి అందుబాటులో ఉన్న తక్కువ విస్తీర్ణంలోనే ఏకంగా ఏడు రకాల కూరగాయలు, ఆకుకూరలు నేచరల్‌గా పండిస్తున్నారు. అంతేకాదు చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేస్తున్నారు.. వీటిలో రాగి లడ్డూలు, కొర్ర పాయసం, సద్ద మురుకులు వంటివి ఉన్నయాయి. ఇలా పండించిన కూరగాయలు, ఆకుకూరలు.. తయారు చేసిన తినుబండారాలను తీసుకెళ్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల దగ్గర విక్రయిస్తున్నారు.. ప్రతి సోమవారం అమ్మకాలు జరుగుతున్నాయి.ఇలా ప్రతి సోమవారం ఒక్క రోజులోనే దాదాపు 4 నుంచి 5 క్వింటాళ్ల కూరగాయలు అమ్ముతు సక్సెస్ అయ్యారు. ఇలా వీరు రూ. 14వేల నుంచి రూ. 20వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు. ఏడాది పొడవునా దిగుబడి వస్తూనే ఉంటుందని మహిళా రైతులు చెబుతున్నారు. ఇలా తమ సంఘంలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది అంటున్నారు. వీరు స్టాల్స్ ద్వారా వారానికి ఒకరోజు అమ్మకాలు చేయడంతో మంచి ఆదాయం వస్తోంది. తాము కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని.. ఈ విధానం అటు మహిళలతో పాటుగా ఇటు ప్రజలకు మంచిదన్నారు.తాము స్వయంగా ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటున్నామని చెబుతున్నారు మహిళలు. ఇటీవల కాలంలో ప్రజలు ప్రకృతి ఉత్పత్తులను కొనడానికి ఆసక్తి పెరిగిందని.. తాము ఏడాదికి లక్ష రూపాయలకు తగ్గకుండా ఆదాయం పొందుతున్నామంటున్నారు. అది కూడా తాము ప్రకృతి విధానంలో వ్యవసాయం చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నాము అంటున్నారు.

నాణ్యమైన ఆహార ఉత్పత్తులను తయారు చేసి స్వయంగా అమ్ముకుంటున్నామని.. తమకు ఆర్థికంగా ఉపయోగంగా ఉంటుందంటున్నారు. ఇలా సంపాదించిన డబ్బులతో తమ పిల్లలను చదివిస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నామంటున్నారు.తామంతా కలిసి వ్యవసాయం చేస్తున్నామని.. అలాగే తినుబండారాలు తయారు చేసి అమ్ముతున్నామంటున్నారు మహిళలు. ఇలా మంచి ఆదాయం వస్తోందని.. తాము రాబోయే రోజుల్లో మరింత విస్తీర్ణంలో పంటలు పండించాలని భావిస్తున్నట్లు తెలిపారు. తాము కూడా భవిష్యత్‌లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరపాలని ఆలోచన ఉందన్నారు. ఈ ఆలోచన ఒక్క అన్నమయ్య జిల్లాకు మాత్రమే కాదు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు కూడా ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

## గొడ్డలి గుర్తు...రచ్చ...

విజయవాడ, జూలై 16, వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తుకు సంబంధించి ఓ లేఖ వైరల్ అవుతోంది. ఆ పార్టీకి ఫ్యాన్‌కు బదులు గొడ్డలిని కేటాయించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరుతూ లేఖ రాసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఈ అంశంపై క్లారిటీ వచ్చింది.. వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తుగా ఫ్యాన్ బదులు గొడ్డలిని కేటాయించాలని తాను ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందన్నారు యుగతులసి పార్టీ అధ్యక్షుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు కొలిశెట్టి శివకుమార్. ఈ మేరకు వైరల్ అవుతున్న లేఖ పూర్తి అవాస్తవం, కల్పితమని తెలిపారు. సోషల్ మీడియాలో ఈ దుష్ప్రచారానికి కారకులైన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతున్నట్లు తెలిపారు. అలాగే త్వరలోనే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాబోతోందని తాను పోటీచేయనున్నట్లు శివకుమార్ తెలిపారు.మా పార్టీకి ప్రస్తుతం 'ఫ్యాన్' గుర్తు ఉంది.. పలు అంతర్గత సంప్రదింపుల అనంతరం మా పార్టీ చిహ్నాన్ని 'గొడ్డలి' గుర్తుగా మార్చాలని నేను ఏకగ్రీవంగా నిర్ణయించాను. మా పార్టీ భవిష్యత్తు, గుర్తింపు, రాజకీయ వ్యూహం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాను.1968 ఎన్నికల చిహ్నాల ఆర్డర్ ప్రకారం సంబంధిత నియమాలు, విధానాలకు అనుగుణంగా వీలైనంత త్వరగా గొడ్డలిని తమ పార్టీ చిహ్నంగా కేటాయించాలని కోరుతున్నాను. పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానాలు, డాక్యుమెంట్లు, అఫిడవిట్లు లేఖకు జత చేశాను.

# సేమ్ సీన్... ఆల్ పార్టీస్

హైదరాబాద్, జూలై 16 తెలంగాణలోని ఏదైనా గ్రామంలోకి వెళ్లి కాంగ్రెసోళ్ల గురించి అడిగితే తిడుతున్నారు. మరి బీఆర్ఎస్ సంగతేంది అంటే మద్దతుగానూ మాట్లాడడం లేదు. అసలు బీజేపీని పట్టించుకోవడం లేదు. ఇలాంటి దృశ్యం తెలంగాణలో ఎప్పుడూ లేదు. ఏదో ఒక పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు ఇక్కడి వారు. కానీ ఎందుకో ఇప్పుడు మూడు ప్రధాన పార్టీల విషయంలో జనాల్లో విముఖత స్పష్టంగా కనిపిస్తోంది. కొత్త శక్తులు, పార్టీలు వచ్చే స్కోపు లేదు. సో ఈ మూడింటిలోనే ఒకదాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతానికి ఏ పార్టీకి కూడా అంతగా ఎడ్జ్ లేని వాతావరణం అయితే స్పష్టంగా కనిపిస్తోంది.తెలంగాణ ప్రజల తీర్పు ఖచ్చితంగా ఉండేది.. అనాదిగా ట్రాక్ రికార్డ్ చూస్తే ఏదో ఒక పార్టీకి పట్టం కట్టేవారు. క్లియర్ కట్ మెజార్టీ అయితే ఈ ప్రాంతంలో వచ్చేది. ప్రజలు సూటిగా సుత్తిలేకుండా ఆలోచించేవారు. అయితే తెలంగాణలో పార్టీలు ఎక్కువయ్యాయి. మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన అయినట్టు.. జనాలు మారిపోయారు. మూడు పెద్ద పార్టీలు.. మధ్యలో చిన్నా చితక పార్టీలతో మొత్తం కలగపులగంగా తయారైంది.తెలంగాణలో బరువుకు మించి హామీలతో గద్దెనెక్కింది కాంగ్రెస్ సర్కార్. రేవంత్, నేతల దూకుడుతో.. బోలెడంత సంక్షేమం, అభివృద్ధి, వేలకు వేలు అకౌంట్లో పడిపోతాయిన జనం భ్రమించి ఓటేశారు. కానీ తెలంగాణ అప్పుల్లో కూరుకుపోయిందని.. కేసీఆర్ అప్పుల పాలు చేశాడని రేవంత్ జరుపుకుంటూ వచ్చేశారు. మొత్తానికి కిందా మీదా పడి డబ్బులు సర్దుకుంటూ సంక్షేమం పంచుతున్నా.. కొందరికి పడుతూ.. మరికొందరికి పడక వ్యతిరేకత అయితే బాగా స్ప్రెడ్ అవుతోందని క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. ఎవరినీ అడిగినా కాంగ్రెస్ గురించి ప్రస్తుతానికి పాజిటివ్ గా స్పందించడం లేదు..మరి ఈ వ్యతిరేకత బీఆర్ఎస్ పై పాజిటివ్ గా మారుతుందా అంటే అదీ లేదు. ఎందుకంటే గత ప్రభుత్వంలో కేసీఆర్ ప్రజలు, ప్రజాప్రతినిధులకు దూరంగా పాలించారు. జనాలకు డైరెక్టుగా కనెక్ట్ కాలేకపోయారు. కొన్ని పథకాలు, సంక్షేమం బాగానే ఉన్నా.. బీఆర్ఎస్ నేతలు జనంలోకి రాకపోవడం వారిపై వ్యతిరేకతకు కారణమైంది. కాంగ్రెసోళ్లు మొత్తం జనాల్లోనే ఉండడం.. తెలంగాణ పట్టణ జనాభా కంటే గ్రామీణ జనాభా మొత్తం కాంగ్రెస్ వెంట నడిచింది. అసలు గ్రామాల్లోకి వెళ్లని బీఆర్ఎస్ ఓడిపోయింది. ఎమ్మెల్యే సీట్లు అన్నీ కూడా కాంగ్రెస్ రూరల్ లోనే గెలిచింది. బీఆర్ఎస్ ఎప్పుడైతే జనానికి దూరమైందో అదే వారి ఓటమికి కారణమైంది. ఇప్పటికీ కాంగ్రెస్ ను తిడుతున్నా.. బీఆర్ఎస్ నేతలు జనంలోకి రారు.. రాలేరు అన్న అపప్రదతో ఆ పార్టీకి మనస్ఫూర్తిగా జనాలు అనుకూలత చూపించడం లేదు..మరి బీజేపీది మరో కథ.. రెండేళ్లకోసారి అధ్యక్షుడిని మారుస్తూ ఏ బీజేపీ నేత ఎప్పుడు ఉంటారో.. ఎవరు నడిపిస్తారో.. అసలు నడిపిస్తామన్న వారికి అధ్యక్ష పీఠం ఎందుకు ఇవ్వరో అర్థం కాని పరిస్థితి. ఒక బలమైన నాయకుడిని ఎదగనీయకుండా కేంద్ర బీజేపీ నాయకత్వం తెలంగాణలో అసలు ఎలాంటి స్ట్రాటజీని అమలు చేస్తుందో బీజేపీ రాష్ట్ర నేతలకు కూడా అర్థం కాని పరిస్తితి. రాజాసింగ్ లాంటి నేతలు దీనిపై నిలదీస్తే 'గెట్ అవుట్' అంటూ గెంటించేస్తున్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో పట్టుమని పాతిక నియోజకవర్గాలకు కూడా బలమైన నేతలు, క్యాడర్ లేదు. ఇదే బీజేపీని తెలంగాణకు దూరం చేస్తోంది. సోదిలో లేకుండా చేస్తోంది..ఏతావాతా చెప్పొచ్చేది ఏంటయ్యా అంటే.. తెలంగాణలో ప్రస్తుతం ఏ పార్టీని చూసినా ఏమున్నాది గర్వకారణం అన్నట్టుగా ఉంది.

# మిథున్ రెడ్డి అరెస్ట్ట కు లైన్ క్లియర్

విజయవాడ, జూలై 16, మద్యం కుంభకోణం కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది కూటమి ప్రభుత్వం. దీని ద్వారా భారీగా ధనం హవాలా రూపంలో విదేశాలకు వెళ్లిపోయిందని అనుమానిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో మద్యం ద్వారా వచ్చిన నగదును ఖర్చు చేసేందుకు కూడా వైసిపి సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటికే ఈ కేసులో కీలక అరెస్టులు జరిగాయి. మరోవైపు ఇప్పుడు ఎంపీ మిథున్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అప్పట్లో మద్యం కంపెనీలతో డీల్.. డిష్టలరీలను చేజిక్కించుకోవడం వంటి వాటిలో మిథున్ రెడ్డి కీలకపాత్ర పోషించారని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేలింది. దీంతో మిథున్ రెడ్డిని అరెస్టు చేస్తారని ప్రచారం సాగింది. ఈ తరుణంలో మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆయనకు నిరాశ ఎదురయింది.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ హయాంలో దూకుడుగా వ్యవహరించిన, అవినీతికి పాల్పడిన నేతలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా వైసిపి మద్యం పాలసీ ద్వారా వేలకోట్ల ముడుపులు అందాయని అనుమానిస్తోంది. దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల వరకు హవాలా రూపంలో దేశం దాటించారని కూడా అంచనా వేస్తోంది. ఈ మొత్తం కుంభకోణంలో రాజ్ కసిరెడ్డి పాత్ర ఉందని తేలింది. ముందుగా ఆయన అరెస్టు జరిగింది. అప్పటి సీఎంఓ కీలక అధికారి ధనుంజయ రెడ్డి, మొన్నటికి మొన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కూడా అరెస్టు చేశారు. అయితే పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఎంపీ కావడంతో ఆయన అరెస్టు విషయంలో దర్యాప్తు బృందం తర్జనభర్జన పడుతోంది. ఈ నేపథ్యంలో కేసు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు.. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టుకు తిరుగుతూ వస్తోంది. అయితే ఇప్పుడు హైకోర్టులో ముందస్తు బెయిల్ విషయంలో తీర్పు వచ్చింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్న ఇలాంటి సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. అంటే మిథున్ రెడ్డి అరెస్టు జరగకుండా.. రక్షించలేమని న్యాయస్థానం తేల్చేసిందన్నమాట.

మద్యం కుంభకోణంలో రాజ్ కసిరెడ్డి సూత్రధారి. ఈ విషయం వైయస్సార్ కాంగ్రెస్ మాజీ నేత విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. మద్యం కంపెనీలతో డీల్ కు సంబంధించి సిట్టింగులు జరిగాయని.. అందులో నేను కూడా ఉన్నానని.. కానీ ఆ కుంభకోణంతో తనకు సంబంధం లేదని విజయసాయిరెడ్డి తేల్చి చెప్పారు. అయితే ఇప్పుడు రాజ్ కసిరెడ్డి వెనుక మిథున్ రెడ్డి ఉన్నారని స్పష్టమవుతుంది. అందుకే విజయసాయిరెడ్డి రాజ్ కసిరెడ్డిని టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. రాజ్ కసిరెడ్డి ద్వారా వ్యవహారం నడిపింది మిథున్ రెడ్డి అని.. ప్రతి శనివారం తాడేపల్లి ప్యాలెస్ కు వెళ్లి లెక్కలు చెప్పే వారని ఒక ప్రచారం అయితే ఉంది. అయితే లిక్కర్ స్కాం డబ్బులను మనీ లాండరింగ్ గా చేశారని.. దీనికి సంబంధించి సిట్ వద్దా స్పష్టమైన సాక్షాలు ఉన్నాయి. కానీ చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని ముందస్తు బెయిల్ పొందాలని మిథున్ రెడ్డి భావించారు. అయితే సుప్రీంకోర్టు వరకు ఈ ముందస్తు వెళ్ళగా.. హైకోర్టుకు వెళ్లి తేల్చుకోవాలని ఆదేశించింది అత్యున్నత న్యాయస్థానం. కానీ హైకోర్టులో ఇప్పుడు షాకింగ్ తీర్పు వచ్చింది. మిథున్ రెడ్డి అరెస్ట్ కు లైన్ క్లియర్ అయ్యింది. ఒకటి రెండు రోజుల్లో అరెస్టు తప్పదని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# నక్సల్స్ కు ఛత్తీస్ ఘడ్ ఓపెన్ ఆఫర్

# సంసార జీవితం ఇస్తామని హామీ

రాయ్ పూర్, జూలై 16నమ్మిన సిద్ధాంతం కోసం.. దోపిడీ లేని సమాజం కోసం.. నక్సల్స్ సంవత్సరాలుగా అజ్ఞాత జీవితాన్ని గడుపుతున్నారు. అడవుల్లో బతుకుతూ.. సభ్య సమాజంలో మార్పుకు కృషి చేస్తున్నారు. దీనికోసం ఎంచుకున్న వారి పోరాటం కొన్ని సందర్భాల్లో సత్ఫలితాలను.. మరి కొన్ని సందర్భాలలో దుష్ఫలితాలను ఇస్తోంది. వీటి గురించి చర్చ పక్కన పెడితే.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఏరిపారేస్తోంది. ఇటీవలి కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్ర నాయకులను కేంద్ర బలగాలు మట్టు పెడుతున్నాయి. వరుస ఆపరేషన్లతో ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు నక్సల్స్ లేని దేశంగా భారత్ ను మార్చుతామని పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగానే చత్తీస్ గడ్ ప్రభుత్వం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది..చత్తీస్ గడ్ ప్రభుత్వం నక్సలైట్లకు సంసార జీవిత యోగాన్ని కల్పించేందుకు ఒక కొత్త పథకానికి రంగం సిద్ధం చేసింది. అయితే సంసారపు జీవితానికి మావోయిస్టులు ఆకర్షితులవుతారా? తిరిగి జనజీవన స్రవంతిలోకి వస్తారా? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. సంసార జీవితానికి ఆకర్షితులు కాని వారంటూ ఉండరు.. ఎందుకంటే 1990లో తిప్పారపు రాములు అనే నక్సలైట్ వరంగల్ నగరాన్ని తన కంటిచూపుతో శాసించేవాడు. ఎంతోమందిని మట్టుపెట్టాడు. వరంగల్ జాయింట్ కలెక్టర్ ను చూస్తుండగానే కిడ్నాప్ చేశాడు. అయితే ఇతడిని హన్మకొండలోని గుడిమండల్ అనే ప్రాంతంలోని సుధా నగర్ ఏరియాలో పోలీసులు ఎన్కౌంటర్ చేశారు. సుధా నగర్ ఏరియాలో రాములు ఉన్న ఇల్లు ఓ మహిళకు చెందింది. ఆ మహిళతో అతడికి సన్నిహిత సంబంధం ఉంది. అతడికి ఉన్న ఈ వీక్నెస్ ను పోలీసులు గుర్తించి.. ఆమె ఇంటికి వచ్చేది కనిపెట్టి.. చివరికి లేపేశారు.1996లో ఉమ్మడి ఆదిలాబాద్ లో నస్పూర్ ఏరియాలో ఒక పెద్ద ఎన్కౌంటర్ జరిగింది. నాటి పీపుల్స్ వార్ గ్రూపుకు అనుబంధంగా ఉండే సింగరేణి కార్మిక సమాఖ్య అగ్ర నాయకుడు రమాకాంత్ అలియాస్ మాదిరెడ్డి సమ్మిరెడ్డి పోలీసులతో ఏకంగా 36 గంటల పాటు పోరాడాడు. నాడు అతడి చేతిలో సిఐ చక్రపాణి, ఇంకా చాలామంది కానిస్టేబుళ్లు చనిపోయారు.. రమాకాంత్ అత్యంత తెలివిగా తప్పించుకోవడంతో.. ఒకానొక దశలో పోలీసులు ఏమీ చేయలేక చేతులెత్తేశారు. చివరికి రమాకాంత్ ఒక మహిళతో ఉన్నాడని తెలుసుకున్నారు. అతడు ఆమెతో ఉన్న ఇంటి పై కప్పుకు రంధ్రం చేసి.. అందులో నుంచి పెట్రోల్ పోశారు. నిప్పు అంటించి అంతం చేశారు. ఈ ఉదాహరణలు సంసార జీవితానికి దూరంగా ఉన్న అగ్రనేతల వీక్నెస్ పాయింట్లను బయటి ప్రపంచానికి తెలిసేలా చేశాయి.ఇప్పుడు మావోయిస్టులకు చత్తీస్ గడ్ ప్రభుత్వం ఓపెన్ ఆఫర్ ఇవ్వడంతో ఏం చేస్తారనేది చూడాల్సి ఉంది. మరోవైపు ఇటీవల కాలంలో ఆ రాష్ట్రంలో దొరికిపోతున్న మావోయిస్టులు పోలీసులు నిర్వహించిన ప్రెస్ మీట్ లలో సంచలన విషయాలు చెబుతున్నారు.. దళంలో ఆడవాళ్లకు రక్షణ లేకుండా పోతుందని.. అత్యాచారాలు నిరాటంకంగా జరుగుతున్నాయని మహిళా నేతలు చెబుతున్నారు. ఈ ప్రచారాన్ని మావోయిస్టు నేతలు ఖండిస్తున్నారు.. ఈ ప్రచారం ఎలా ఉన్నప్పటికీ.. సంసార జీవితాన్ని కోరుకొని మనిషి ఉండడు. సంసార జీవితానికి ఆకర్షితుడు కాని వ్యక్తి ఉండడు.. అలాంటప్పుడు చత్తీస్ గడ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలను ఇస్తుందని చెబుతున్నారు.ఇక ప్రస్తుతం చత్తీస్ గడ్ రాష్ట్ర విషయానికి వస్తే బస్తర్ జిల్లాలోని కాంకేర్ ప్రాంతంలో 2010లో దాదాపు ఆరడజను మంది నక్సలైట్లు వివాహానికంటే ముందు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నారు. ఈ విషయాన్ని అక్కడ పోలీసులు గుర్తించారు. బస్తర్ పోలీసుల పరిశీలనలో 26 కేసులు వెలుగులోకి వచ్చాయి. అయితే ఇందులో 12 మందికి వైద్యుల పర్యవేక్షణలో తిరిగి సంసార జీవితాన్ని ప్రసాదించారు. మిగతా వారికి కూడా ఆ యోగాన్ని కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది మాత్రమే కాకుండా లొంగిపోయే మావోయిస్టులకు గృహాలు.. వివాహాలు.. ఐవీఎఫ్ విధానంలో తల్లిదండ్రులయ్యే అవకాశాన్ని కల్పిస్తామని చత్తీస్ గడ్ హోం శాఖ మంత్రి విజయవర్మ ఇప్పటికే చెప్పడం గమనార్హం.

# నిర్మాణాల్లో కనిపించని నాణ్యత

భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని మనం గొప్పగా చెప్పుకొంటున్నాం. కొత్త రహదారులు, ఆకాశాన్ని తాకే భవంతులు, ఆధునిక వంతెనలతో దేశ ముఖచిత్రం మారిపోతున్నదని సంబురపడుతున్నాం. కానీ, వేగవంతమైన ప్రగతి వెనక, నాణ్యత లేని నిర్మాణాలు, నిర్వహణకు నోచుకోని వంతెనలు, రోడ్లు నిశ్శబ్దంగా ప్రజల ప్రాణాలను బలి గొంటున్నాయి. తాజాగా గుజరాత్‌లోని వడోదర జిల్లాలో మహిసాగర్ నదిపై పాత వంతెన ఉన్నట్టుండి కుప్పకూలింది. వంతెనపై వెళ్తున్న వాహనాలు అమాంతం నదిలో పడ్డాయి. గతంలో తెలంగాణలో నిర్మాణ దశలో ఉన్న మానేరు వంతెన, శతాబ్దాల చరిత ఉన్న వేములవాడ వంతెన కూలాయి. ఈ ఘటనలు నిజానికి చేదు అనుభవాలు. వంతెనలపై మృత్యువీచికలు ఇంకెన్నాళ్లు? ఇటీవల వడోదరలో కూలిన వంతెన దాదాపు నాలుగు దశాబ్దాల పాతది. ఇలాంటి వంతెనలు వాటి జీవితకాలం ముగిసిన తర్వాత, సరైన నిర్వహణ లేకపోతే కూలిపోవడం సహజం.ప్రభుత్వాలు అలాంటి వంతెనల నుంచి ప్రజల ప్రాణాలను ఎలా కాపాడతాయనేదే ప్రశ్న. దేశంలో వంతెనలు కూలడం లేదా పాడవటానికి అనేక కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనది నిర్వహణ లోపం. రెండోది వాటి నిర్వహణకు ప్రభుత్వాలు తగిన నిధులు కేటా యించకపోవడం. మూడోది వంతెనల పటుత్వాన్ని చెక్ చేయాల్సిన ఇంజినీర్లు మిన్నకుండటం. వాస్తవానికి పాత వంతెనలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది.లేకపోతే మొత్తం వంతెన బలహీనపడుతుంది. వంతెనలు కూలడానికి మరో ప్రధాన కారణం.. నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టడం. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం, తక్కువ నాణ్యత గల పదార్థాలను ఉపయోగించడం వంటివి వంతెనల జీవితకాలాన్ని తగ్గిస్తాయి.

వంతెనలపై ప్రతిరోజూ వందలాది వాహనాలు వెళ్తాయి. రాష్ట్రాలను, జిల్లాలను కలిపే వంతెనలపై అధిక లోడ్ తో వెళ్లే వాహనాలు ఎక్కువగా ఉంటాయి.వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ప్రభుత్వాలు వంతెనలు నిర్మాణం చేపడితే బాగుంటుంది. కొన్నిసార్లు ఆ వంతెనలపె,? వాటి సామర్థ్యానికి మించి లోడ్ తీసుకెళ్లే వాహనాలు కూడా ప్రయాణిస్తాయి. వాటి రాకపోకలను నియంత్రించే సరైన వ్యవస్థ లేకపోవడమూ ప్రమాదాలకు కారణం. అలాగే ఎడతెరిపి లేకుండా కురిసే భారీ వర్షాలు, వరదలు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు వంతెనలు కూలడానికి కారణం. 2011లో బీహార్‌లోని కోసీ నదిపై ఉన్న ఒక పాత వంతెన కూలింది. 2012లో పశ్చి మ బెంగాల్‌లోని ఒక వంతెన కూలి కొంద రి ప్రాణాలను బలితీసుకున్నది. 2016లో మహారాష్ట్రలోని మహాడ్ వద్ద సావిత్రి నదిపై పాత వంతెన కూలిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రమాదంలో పలువురు మృతిచెందారు. 2017లో ముంబైలో అంధేరీ రైల్వే స్టేషన్ సమీపంలోని పాదచారుల వంతెన కూలి పలువురు గాయపడ్డారు.2018లో పశ్చి మ బెంగాల్‌లోని మజెరత్ వంతెన కూలి ముగ్గురు మరణించారు.

2019లో బీహార్‌లోని గోపాల్‌గంజ్‌లోని గండక్ నదిపై నిర్మించి వంతెన కూలింది. 2022లో గుజరాత్‌లోని మోర్బీ వంతెన కూలి వంద మందికి పైగా మరణించారు. ఇది ఆ రాష్ట్రంలోనే పాత వంతెన. నిర్వహణ లోపం సరిగా లేకపోవడం వల్లనే ప్రమా దం సంభవించింది.2023లో బీహార్‌లో సుల్తాన్‌గంజ్- అగువానీ ఘాట్ వంతెన కూలిపోయిన ఘటన నిర్మాణంలో ఉన్న వంతెనల నాణ్యతపై ప్రశ్నలను లేవనెత్తిం ది. ఈ ప్రమాదాలన్నీ కలిపి మృతుల సంఖ్య కచ్చితంగా వేలల్లో ఉంటుందని అంచనా. కానీ, ఆయా ప్రభుత్వాలు ప్రమాదాల తీవ్రతను, మృతుల సంఖ్యను కచ్చితంగా చెప్పిన దాఖలా లేదు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కొన్ని వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నా యి. పెద్ద ఎత్తున వంతెనలు కూలిపోయిన సంఘటనలు తక్కువగా ఉన్నప్పటికీ, చిన్నపాటి నష్టాలు, మరమ్మతులు అవసరమైన వంతెనలు అనేకం ఉన్నాయి. తెలంగాణ లో ఇటీవల కాలంలో రెండు వంతెన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒకటి.. 2024 ఏప్రిల్‌లో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామం వద్ద మానేరు వాగుపై నిర్మాణ దశలో ఉన్న వంతెన కూలిన ఘటన.ప్రమాదంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశం. రూ.49 కోట్ల అంచనాతో 2016లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పను లు ఎనిమిదేండ్లు గడిచినా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ నాణ్యాత ప్రమాణాలు పాటించకపోవడం, అధికారులు నాణ్య తాపరమైన అంశాలను పెద్దగా తనిఖీ చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందనేది సుస్పష్టం.ఆ తర్వాత 2023 సెప్టెం బర్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రము ఖ పుణ్యక్షేత్రం వేములవాడలో శతాబ్దాల నాటి ఒక కమాన్ బ్రిడ్జి కూలింది. ఘటన లో పది మందికి పైగా స్థానికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి ఇప్ప టికీ కేవలం మంచానికే పరిమితమై ఉన్న పరిస్థితి. వంతెన కూలిన సమయంలో దానిపై నుంచి వెళ్తున్న ఓ లారీ కూరగాయల మార్కెట్‌లోకి దూసుకెళ్లడంతో నష్ట తీవ్రత పెరిగింది.ఈ వంతెన వంద సంవత్సరాలకు పైగా పాతదని, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే కూలిపోయిందని స్థానికులు నాడు ఆందోళన చేపట్టారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా అనేక పాత వంతెనలు ఉన్నాయి. ముఖ్యంగా తీరప్రాంతంలో, నదులపై ఉన్న వంతెనలు తుఫానులు, వరదల కారణంగా బీటలు వారుతున్నాయి.గతంలో ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలో ప్రభుత్వాలు అనేక మరమ్మతులు చేపట్టాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున వంతెనలు కూలి భారీ ప్రాణనష్టం జరిగిన సంఘటనలు పెద్దగా నమోదు కానప్పటికీ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే మున్ముందు మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.వంతెన ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శిథిలావస్థలో ఉన్న పాత వంతెనలను కూల్చివేయాలి. కొత్తగా వంతెనల పటిష్టతపై ఎప్పటికప్పు డు తనిఖీలు చేయాలి. అందుకు పురాతన పద్ధతులు కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి.

శిథిలావస్థకు చేరిన వంతెనలను గుర్తించి, వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలి.ఆ వైపు వాహనాలను మరో వైపునకు మళ్లించాలి. అలాగే ప్రభుత్వాలు కేవలం వంతెనలు నిర్మించాం.. ఇక మా పని అయిపోయింద ని చేతులు దులిపేసుకోకుండా.. నిర్వహణకు కూడా తగినన్ని నిధులు కేటాయించాలి. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలి. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చూడాలి. నిఘా వ్యవస్థ ను పటిష్టం చేయాలి. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలినాసిరకం పను లు చేసే కాంట్రాక్ట్ కంపెనీలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. నిర్మాణ రంగంలో అవినీతిని అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలి. పారదర్శకతను పెంచాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాలి.

అంతేకాకుండా, ఏదైనా వంతెన ప్రమాదకరంగా కనిపిస్తే, ప్రజలు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వంతెనల పర్యవేక్షణకు డ్రోన్లు, సెన్సార్లను ఉపయోగించాలి గుజరాత్‌లోని వడోదర వంతెన ప్రమాదం, మోర్బీ ఘటన, అలాగే తెలంగాణలోని మానేరు, వేములవాడ వంతెన ప్రమాదాలు భారతదేశ మౌలిక సదుపాయాల భద్రతకు ఒక హెచ్చరిక. మానవ ప్రాణాలు అత్యంత విలువైనవి. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, అధికారులపై ఉంది.ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించడంతో సరిపెట్టుకోకుండా, ప్రమాదానికి గల కారణాలు గుర్తించాలి.

భవిష్యత్తులో ప్రమాదాలకు తావు లేకుండా చూడాలి. లేదంటే అవి ప్రాణాలు తీసే నిర్మాణాలవుతాయా...

## నిమిష ప్రియ కేసులో ఎన్నెన్నో మలుపులు



న్యూఢిల్లీ, జూలై 16 సినిమాలలో ఏవైనా నేరాలకు పాల్పడిన వారికి ఉరి శిక్షలు విధిస్తుంటారు.. ఒకవేళ చేయని నేరానికి కథానాయకుడు లేదా కథా నాయక పాల్పడితే చివరి క్షణం వరకు కథను నెట్టుకొస్తుంటారు. వారికి ఉరిశిక్ష అమలు చేసే క్రమంలో అప్పటికప్పుడు కీలక నిర్ణయం వెలువడుతుంది. చివరికి ఉరి శిక్ష రద్దు అవుతుంది..యెమెన్ దేశంలో ఉరిశిక్ష కరారైన నిమిషప్రియ విషయంలో కూడా ఇలాంటిదే ఏదైనా అద్భుతం జరుగుతుందని అందరూ అనుకున్నారు. కానీ అలాంటిదేమీ చోటు చేసుకోలేదుకేరళ రాష్ట్రానికి చెందిన నిమిషప్రియ ఇక్కడ నర్సింగ్ కోర్స్ చదువుకుంది. ఆ తర్వాత ఉన్నత ఉద్యోగం నిమిత్తం యెమెన్ దేశానికి వెళ్లిపోయింది. అక్కడ ఓ ఆసుపత్రిలో పనిచేస్తోంది. అంతా బాగుంటుందనుకుంటున్న తరుణంలో ఒక్కసారిగా ఆమె ఓ వ్యక్తి మరణానికి కారణం కావలసి వచ్చింది. ఆమె కావాలని చేసిందా? పొరపాటున జరిగిందా? అనే విషయాలను పక్కన పెడితే అక్కడ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఆమె ఆ నేరం చేసిందని పోలీసులు నిరూపించడంలో విజయవంతమయ్యారు. న్యాయ స్థానానికి కూడా కావలసింది సాక్ష్యాలు మాత్రమే కాబట్టి ఆమె ఒక వ్యక్తి మరణానికి కారణమైందని భావిస్తూ.. అక్కడి చట్టాల ప్రకారం మరణ దండన విధించింది.. దీంతో నిమిష ప్రియ రోజులు లెక్క పెట్టాల్సి వచ్చింది.నిమిష ప్రియను కాపాడేందుకు అనేక వ్యవస్థలు పనిచేయడం మొదలుపెట్టాయి. కేంద్ర ప్రభుత్వం యెమెన్ ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిపింది. అయినప్పటికీ అవి విజయవంతం కాలేదు. నిమిష ప్రియాను కాపాడేందుకు ఒక యాక్షన్ కౌన్సిల్ కూడా ఏర్పాటు అయింది. దానికి శామ్యూల్ జెరోన్ నాయకత్వం వహిస్తున్నాడు.. అతడు కూడా అనేక దఫాలుగా యెమెన్ ప్రభుత్వంతో చర్చలు జరిపాడు.. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడాడు. జరిగిన ఘటన బాధాకరమని.. తనవంతుగా పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని.. క్షమాభిక్ష ప్రసాదిస్తే మిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామంటూ అతడు తన సంసిద్ధతను వ్యక్తం చేశాడు. అయితే శామ్యూల్ చేసిన ప్రతిపాదనను చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు ఆమోదించారా? లేదా? అనేది తెలియ రాలేదు.. దీంతో నిమిషప్రియకు ఉరి తప్పదు అనే వార్తలు రావడం మొదలైంది.న్యాయస్థానం వెలువరించిన తీర్పు ప్రకారం నిమిష ప్రియకు బుధవారం ఉరి శిక్ష అమలు చేయాలి. కానీ ఉరి శిక్షను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర విదేశాంగ శాఖ జరుపుతున్న చర్చల వల్ల ఉరిశిక్ష వాయిదా పడిందని తెలుస్తోంది.. సోమవారం నిమిషప్రియ ఉరిశిక్ష పై సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేయగా.. ఆ పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ అడిగింది.."ఇప్పటికే చేయాల్సింది మొత్తం చేసేసాం. నిమిష ప్రియ విషయంలో అనేక దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ ముందడుగు పడలేదు. అక్కడ షరియా చట్టాలు అమలవుతుంటాయని" కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే అలా చెప్పిన ఒక్కరోజులోనే కేంద్ర విదేశాంగ శాఖ యెమెన్ ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరపడం వల్ల నిమిషప్రియ ఉరిశిక్ష వాయిదా పడింది.. అయితే ఈ ఉరిశిక్ష వాయిదా పడుతుందా.. లేకుంటే పూర్తిగా రద్దు అవుతుందా అనేది మరికొద్ది రోజుల్లో తేలుతుంది.

## పొంచి ఉన్న నీటి ముంపు

## ఇంకుడు గుంటలు తప్పనిసరి

హైదరాబాద్, జూలై 16, హైదరాబాద్ నగరవాసులకు జలమండలి హెచ్చరిక జారీ చేసింది. 300 గజాల పైన స్థలం ఉన్న ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని, లేనిచో ట్యాంకర్ల ధరలు పెంచుతామని తెలిపింది. నగరంలో నీటి ట్యాంకర్ల వినియోగం విపరీతంగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. భూగర్భ జలాలను పెంచేందుకు.. నీటి కొరతను అధిగమించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ట్యాంకర్ల బుకింగ్‌లు 36 శాతం పెరిగాయి.హైదరాబాద్‌లో నివసించే వారికి.. ముఖ్యంగా నీటి ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్న ఇళ్ల యజమానులకు వాటర్ బోర్డు ఒక ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. నగరంలో సరిపడా వర్షాలు కురవకపోవడం వల్ల అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా అడుగంటిపోయాయి. ఈ పరిస్థితితో నగరం అంతటా నీటి ట్యాంకర్ల బుకింగ్‌లు విపరీతంగా పెరిగాయి. ఇది వాటర్ బోర్డుకు ఆందోళన కలిగిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 300 గజాలు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని జలమండలి స్పష్టం చేసింది. ఈ నిబంధనను పాటించని వారికి.. అంటే ఇంకుడు గుంత లేకుండా నీటి ట్యాంకర్లను బుక్ చేసుకున్న వారికి, ట్యాంకర్ల ధరలను పెంచుతామని వాటర్ బోర్డు హెచ్చరికలు జారీ చేసింది. వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల క్షీణత నేపథ్యంలో.. భవిష్యత్తులో భూగర్భ జల మట్టాలను పెంచే లక్ష్యంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. ఈ చర్య ప్రస్తుత నీటి కొరతను అధిగమించడమే కాకుండా.. దీర్ఘకాలికంగా నగరానికి నీటి భద్రతను కల్పించే ఒక వ్యూహాత్మక చర్యగా తెలుస్తోంది.గత ఏడాది జూలై నెలతో పోలిస్తే.. ప్రస్తుత జూలైలో హైదరాబాద్‌లో ట్యాంకర్ల బుకింగ్‌లు 36 శాతం పెరిగాయి. గత సంవత్సరం జూలై 1 నుండి 14వ తేదీ వరకు 63,724 ట్యాంకర్లు బుక్ కాగా.. ఈ ఏడాది అదే కాలంలో 86,520 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. అంటే.. దాదాపు 22,796 ట్యాంకర్ల బుకింగ్‌లు అదనంగా జరిగాయి. ఇది సుమారు 36 శాతం పెరుగుదల. ప్రస్తుతం జలమండలి పరిధిలో దాదాపు 1,135 నీటి ట్యాంకర్లు సేవలు అందిస్తున్నాయి. ఇంకుడు గుంతల ఏర్పాటు తప్పనిసరి కావడం, లేనిపక్షంలో ధరలు పెరగడం వంటి చర్యలు ప్రజల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన పెంచి, ఆచరణలో పెట్టేందుకు దోహదపడతాయని అధికారులు ఆశిస్తున్నారు.ఇంకుడు గుంతలు వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి, భూగర్భ జల మట్టాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో కాంక్రీట్ నిర్మాణాలు పెరిగి, సహజంగా నీరు భూమిలోకి ఇంకే అవకాశం తగ్గింది. దీనివల్ల వర్షపు నీరు వృథాగా ప్రవహించి మురుగునీరుగా మారుతోంది. ఇంకుడు గుంతలు ఈ నీటిని సేకరించి, భూమిలోకి పంపి, భవిష్యత్ అవసరాల కోసం జలవనరులను పునరుజ్జీవింపజేస్తాయి. ఈ చర్యలు కేవలం వ్యక్తిగత ఇంటికే కాకుండా, మొత్తం నగరానికి దీర్ఘకాలికంగా నీటి భద్రతను అందిస్తాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నీటి సంరక్షణ పట్ల ప్రజల్లో బాధ్యతను పెంపొందించడమే కాకుండా.. పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు

## పొలిటికల్ జంక్షన్ లో కవిత...



హైదరాబాద్, జూలై 16 పార్టీనే తనదంటున్నారు.. అధినేతను ఒక్క మాట అనడానికి కూడా ఇష్టపడట్లేదు. అపోజిషన్ గులాబీబాస్‌ను విమర్శిస్తే కూడా ఆమె సహించట్లేదు. కానీ అన్నతో పేచీ..కేసీఆర్ చుట్టూ దయ్యాలంటూ కుంపటి రాజేసి..పొలిటికల్ జంక్షన్‌లో నిల్చున్నారు ఎమ్మెల్సీ కవిత. కేసీఆర్‌కు కాళేశ్వరం నోటీసులు ఇచ్చినా..చివరకు కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చినా..ఆమె రియాక్ట్ అయ్యారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడాన్ని నిరసిస్తూ ఏకంగా ఇందిరాపార్క్ దగ్గర నిరసన కూడా తెలిపారు.ఆ ధర్నాలో ఒక్క బీఆర్ఎస్ నేత కూడా పాల్గొనలేదు..అది వేరే సంగతి. సరే అదంతా అలా ఉన్నా..లేటెస్ట్‌గా బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో మొదలైన వివాదం? కవితపై ఆయన చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం లేచాయి. సోషల్ మీడియాలో అన్నివర్గాలు మల్లన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కూడా మల్లన్న మాటలను తప్పుబట్టారు. అయితే సొంత పార్టీ నుంచి మాత్రం కవితకు మద్దతు లభించలేదు.ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జగదీశ్వర్ రెడ్డి మినహా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులే కాదు పార్టీ ముఖ్యనేతలెవరూ మల్లన్న వ్యాఖ్యలపై కనీసం స్పందించలేదు. ఇదే ఎమ్మెల్సీ కవితను మరింత అసంతృప్తికి గురిచేస్తోందట. తనకు పార్టీ అండగా లేకపోవడం..కనీసం మాట వరుసకు అయినా ఖండిస్తూ ఓ ప్రకటనో, ట్వీటో చేయకపోవడం కవితను కలచివేస్తోందట. అందుకే ఇక కారులో ఉండే పరిస్థితి లేదనే నిర్ణయానికి కవిత వచ్చేశారన్న టాక్ విన్పిస్తోంది.. .బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్ సర్కార్ చర్యలను అపోజిషన్ బీఆర్ఎస్ తప్పుబడుతోంది. ఆర్డినెన్స్ తెచ్చి హడావుడి చేసే ప్రయత్నం తప్ప చిత్తశుద్ధి లేదని విమర్శిస్తోంది. ఇదే సమయంలో జాగృతి తరఫున కవిత సంబరాలు చేయడం బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఎమ్మెల్సీగా ఉంటూ పార్టీ లైన్‌కు విరుద్ధంగా కవిత వెళ్తున్నారన్న సంకేతాలు మంచివి కావని పలువురు కీలక నేతలు అభిప్రాయపడుతున్నారు. సేమ్‌టైమ్ ఆమె కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని గతంలోనే వార్తలు వచ్చాయి. లేటెస్ట్‌గా తీన్మార్ మల్లన్న కూడా అదే విషయాన్ని చెప్పారు. మొన్నటి క్యాబినెట్ విస్తరణలోనే కవిత మంత్రి కావాల్సి ఉండే అని ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారితీశారు. ఈ డెవలప్‌మెంట్స్ నేపథ్యంలో కవితను బీఆర్ఎస్ అధినాయకత్వం చాలా లైట్ తీసుకుంటుందట.సోమవారం డే మొత్తం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సుదీర్ఘంగా భేటీ అయి..బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరం, బనకచర్ల, లోకల్ బాడీ పోల్స్, పార్టీ ఫ్యూచర్ ప్లాన్స్‌పై డిస్కస్ చేశారట. కానీ కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలు గురించి గానీ..కవిత సంబరాల అంశానికి సంబంధించి గానీ ఒక్కమాట కూడా కేసీఆర్ ప్రస్తావించలేదని తెలుస్తోంది.కనీసం ఆమె పేరును కూడా కేసీఆర్ ప్రస్తావించలేదని..దీంతో కేటీఆర్, హరీశ్‌లు కూడా ఆ విషయాన్ని మాట్లాడలేదని బీఆర్ఎస్ ఇన్ సైడ్ టాక్. ఇక కాళేశ్వరం విచారణకు వెళ్లేప్పుడు కేసీఆర్‌ను కలిసేందుకు కవిత వెళ్లగా అప్పుడు కూడా ఆయన కనీసం మాట్లాడడానికి ఇష్టపడలేదన్న లీకులు వచ్చాయి. అనారోగ్యంతో హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ పొందుతున్న తండ్రిని పరామర్శించేందుకు వెళ్తే అక్కడ కూడా కవితను కేసీఆర్ పట్టించుకోలేదట.ఈ పరిస్థితులన్నీ గమనించిన కవిత..ఇక తాను బీఆర్ఎస్‌లో ఉండలేనని సన్నిహితులతో చెప్తున్నారట. పార్టీలో ఉండడమా.. బయటకు రావడమా? అనే విషయంపై అత్యంత క్లోజ్‌గా ఉండేవాళ్లతో డిస్కస్ చేస్తున్నారట కవిత. బీఆర్ఎస్‌ను వీడితే కొత్త పార్టీ పెట్టాలా లేక మరేదైనా పార్టీలో చేరాలా.? జాగృతి తరఫునే తన యాక్టివిటీని నడిపించి..కేసీఆర్ పిలిచి మాట్లాడినప్పుడే వెళ్లాలా అనే దానిపై కవిత మల్లగుల్లాలు పడుతున్నారట.

ఇక మొదటినుంచీ కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న ఓ వర్గం తనకు పూర్తి అండగా ఉంటుందని భావిస్తున్నారట కవిత. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చే విషయంపై ఇప్పుడే నిర్ణయం తీసుకుంటే బెటర్ అనే ఆలోచనకు కవిత వచ్చారని అంటున్నారు. స్థానిక ఎన్నికలకు ముందే కవిత కీలక నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. అయితే గతంలోనూ కవిత బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పడం ఖాయమన్న చర్చ జరిగింది. ఇప్పుడు తాజా పరిస్థితులతో మరోసారి ఆమె కారు దిగడం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. రాజకీయంగా కవిత అడుగులు ఎటువైపు పడుతాయో చూడాలి మరి.

## గాయపడిన యువకుడిని ఆదుకున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తన గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. దిగులు చెందొద్దు... అండగా నేను ఉంటానంటూ రోడ్డు ప్రమాద బాధితుడికి ఆపన్న హస్తం అందించారు. సకాలంలో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించేలా చొరవ చూపించారు. మంగళవారం రాత్రి అధికారిక కార్యక్రమాలను ముగించుకొని వస్తున్న సమయంలో కేబుల్ బ్రిడ్జి కి సమీపంలో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడి ఉన్న ఓ యువకుడిని చూసి చలించిపోయారు. వెంటనే తన వాహనాన్ని ఆపి కిందకి దిగి... బాధితుడికి ఆందోళనకు గురి కావొద్దంటూ ధైర్యం చెప్పారు. స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు.

స్వయంగా దగ్గరుండి క్షతగాత్రుడిని ఆటోలో నిమ్స్ ఆసుపత్రికి పంపించారు. సాయంగా ఓ కానిస్టేబుల్ ను కూడా వెంట పంపించారు. ఏదైనా అవసరం అయితే ఫోన్ చేయమని... వ్యక్తిగత సహాయకుడి ఫోన్ నంబర్ ఇచ్చారు. ఆసుపత్రికి చేరుకోగానే నిమ్స్ వైద్యులతో ఫోన్లో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చొరవ తీసుకున్నారు. చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు.

# కృష్ణా-వికారాబాద్ మార్గం రైల్వే లైన్ సర్వే పూర్తి

హైదరాబాద్, జూలై 16, తెలంగాణ ప్రజలకు తీపి కబురు. రాష్ట్రంలో మరో కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి రానుంది. కృష్ణా- వికారాబాద్ కొత్త రైల్వే లైన్ తుది సర్వే పూర్తయింది. సుమారు 122 కిలోమీటర్ల ఈ మార్గం, రూ. 2,000 కోట్ల అంచనా వ్యయంతో ఈ లైన్ నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన ఆఖఖీ ఈ నెలాఖరుకు రైల్వేబోర్డుకు చేరనుంది.

కృష్ణా-వికారాబాద్ మార్గం పూర్తయితే హైదరాబాద్-గోవా మధ్య దూరం 35-40 కి.మీ. తగ్గుతుంది.తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం చర్యలు చేపట్టింది. ఇప్పటికే అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్లు ఆధునీకరించి అందుబాటులోకి తీసుకొచ్చింది. మరికొన్ని స్టేషన్లు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. అదే సమయంలో రైల్వే కనెక్టివిటీ పెంచేందుకు కొత్త మార్గాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా.. రాష్ట్రంలో మరో కొత్త రైల్వే లైన్ అందుబాటులో రానుంది. నారాయణపేట జిల్లా కృష్ణ రైల్వేస్టేషన్ నుంచి వికారాబాద్ వరకు ప్రతిపాదిత కొత్త రైలు మార్గానికి సంబంధించిన తుది సర్వే (ఫైనల్ లొకేషన్ సర్వే) విజయవంతంగా పూర్తయ్యింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా డీపీఆర్ రైల్వేబోర్డుకు చేరే అవకాశం ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ మార్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ మీదుగా వెళ్లనుండటం గమనార్హం.కృష్ణా-వికారాబాద్ నూతన రైల్వే లైన్ కోసం చాలాకాలంగా డిమాండ్ ఉంది. రైల్వే కనెక్టివిటీలో వెనుకబడిన వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లోని పలు ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని ప్రజలు ఆశిస్తున్నారు. గత ఏడాది జనవరి 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ రైల్వే లైన్ విషయమై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఈ రైల్వే లైను నిర్మాణ వ్యయాన్ని 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించాలని ఆయన లేఖలో కోరారు. తుది సర్వేలో భాగంగా ఆర్థిక, సాంకేతిక, పర్యావరణ, భూసంబంధిత అంశాలపై సమగ్ర విశ్లేషణ జరిగింది.కృష్ణా-వికారాబాద్ లైనులో రేట్ ఆఫ్ రిటర్న్ ఐదారు శాతం వరకు వస్తుందని రైల్వే అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. సాధారణంగా 10 శాతం ఖీ్మఖీ ఉంటే రైల్వేశాఖ సులభంగా ఆమోదిస్తుంది. అయితే, ప్రాథమిక సర్వేలోని అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గ కేంద్రానికి కొంత దూరంగా ఉన్న ప్రాథమిక అలైన్‌మెంట్‌ను, స్టేషన్‌ను అక్కడి ప్రజలకు చేరువలో ఉండేలా మార్చారు. ప్రతిపాదిత
ా ం ు ల ే ్వ ల ా ు న ్ న ం
కృష్ణా-మక్తల్-నారాయణపేట-దామరగిద్ద-బాలంపేట-దౌల్తాబాద్-కొడంగల్-పరిగి-వికారాబాద్ వరకు నిర్మించనున్నారు. మె?త్తం 122 కిలోమీటర్లు కాగా.. అంచనా వ్యయం సుమారు రూ. 2 వేల కోట్లు. ఈ ప్రతిపాదిత రైలు మార్గం కార్యరూపం దాల్చి, నిర్మాణం పూర్తయితే అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి.ప్రస్తుతం హైదరాబాద్ నుంచి గోవాలోని మడ్‌గావ్ రైల్వేస్టేషన్‌కు జడ్చర్ల, గద్వాల, కర్నూలు, డోన్, గుంతకల్ మీదుగా ట్రైన్లు వెళ్తున్నాయి. కృష్ణా-వికారాబాద్ మార్గం అందుబాటులోకి వస్తే హుబ్బళ్లి, గోవాలోని మడ్‌గావ్‌కు 35-40 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది. దీని ద్వారా తక్కువ సమయంలోనే హైదరాబాద్ నుంచి గోవాకు చేరుకోవచ్చు. అంతేకాకుండా, తాండూరు సిమెంటు పరిశ్రమల నుంచి సిమెంటు రవాణా సులభం అవుతుంది. ప్రస్తుతం గుంతకల్ మార్గంలో ట్రాక్ రద్దీగా ఉండటంతో అదనపు రైళ్లను ప్రవేశపెట్టడం కష్టంగా మారింది. ఈ ప్రతిపాదిత మార్గంతో ఆ సమస్య ఉండదు. ఇది ప్రాంతీయ అభివృద్ధికి, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు రైల్వే బోర్డు ఆమోదం పొంది, త్వరితగతిన కార్యరూపం దాల్చాలని స్థానికులు, వ్యాపార వర్గాలు ఆశిస్తున్నాయి

# గ్రేటర్ లో మూడు నియోజకవర్గాల్లో ఎన్నికలు

హైదరాబాద్, జూలై 16, లంగాణ రాజకీయం ఫుల్ హీట్ మీదుంది. నువ్వానేనా..తగ్గేదేలే అంటూ అధికార కాంగ్రెస్, అపోజిషన్ బీఆర్ఎస్ సవాళ్లు, ప్రతిసవాళ్లు..విమర్శలతో పొలిటికల్ వార్‌ను నెక్ట్స లెవల్‌కు తీసుకెళ్తున్నాయి. ఇదే టైమ్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పార్టీలు రెడీ అవుతున్నాయి. మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపాలని గులాబీ పార్టీ ఆల్రెడీ డిసైడ్ అయిందంటున్నారు.ఇప్పటికే గ్రౌండ్‌లో పరిస్థితులను అంచనా వేయడానికి సర్వే కూడా చేయించినట్లు తెలుస్తోంది. అయితే జూబ్లీహిల్స్‌తో పాటు గ్రేటర్‌లో మరో రెండు బైపోల్స్ రాబోతున్నాయన్న టాక్ ఊపందుకుంది. ఖైరతాబాద్ అసెంబ్లీ సీటుకు కూడా ఉప ఎన్నిక రావొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లో గెలిచి..కాంగ్రెస్‌లో చేరి..హస్తం పార్టీ సింబల్ మీద ఎంపీగా కంటెస్ట్ చేసిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటం ఖాయమన్న చర్చ జరుగుతోంది. ఈ నెల 18 తర్వాత ఎప్పుడైనా కోర్టు తీర్పు రావొచ్చంటున్నారు.ఈ నేపథ్యంలోనే అనర్హత వేటు పడే కంటే ముందే రాజీనామా చేయాలనే ఆలోచనలో దానం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే మంత్రి పదవి ఇస్తానంటే..జూబ్లీహిల్స్‌లో పార్టీని గెలిపిస్తా..తాను రిజైన్ చేసి ఖైరతాబాద్‌లో మళ్లీ గెలుస్తానని దానం కండీషన్ పెడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే వారం రోజుల్లోపే దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని అంటున్నారు. నెలాఖరులో జరిగే మంత్రివర్గ విస్తరణలో ఆయనకు చోటు దక్కడం పక్కా అని..మినిస్టర్ హోదాలోనే ఆయన ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేస్తారని కూడా గాంధీభవన్ వర్గాల ఇన్ సైడ్ టాక్.దానం రిజైన్ చేస్తే గ్రేటర్‌లో రెండు బైపోల్స్ పక్కా. అదీ కూడా పక్క పక్క నియోజకవర్గాల్లోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇదే క్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్..బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ సందర్భంగా రాజీనామా చేయడం దుమారం లేపింది. ఇప్పుడు ఆయన రిసిగ్నేషన్‌ను పార్టీ హైకమాండ్ ఆమోదించడంతో రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి కూడా రిజైన్ చేస్తారన్న టాక్ వినిపిస్తోంది. బీజేపీ నేతలు కూడా రాజాసింగ్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు తెస్తున్నారు.అవసరమైతే అనర్హత వేటు కోసం స్పీకర్‌కు కంప్లైంట్ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రాజాసింగ్ కూడా ఎమ్మెల్యే పదవికి రిజైన్ చేయాలని భావిస్తున్నారట. అదే జరిగితే గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు బైపోల్స్ రావడం పక్కా. అటు దానం..ఇటు రాజాసింగ్ జూబ్లీహిల్స్ బైపోల్ నోటిఫికేషన్ వచ్చే కంటే ముందే రిజైన్ చేస్తే..మూడు బైపోల్స్‌కు ఒకేసారి నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అటు దానం..ఇటు రాజాసింగ్ డెసిషన్ తీసుకుంటే మాత్రం.. భాగ్యనగరం వేదికగా మినీ దంగల్ పక్కా.ఇదే జరిగితే పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. అంతేకాదు ఒకేసారి మూడు బైపోల్స్ అంటే చిన్న విషయం కాదు. అన్నీ పార్టీలకు ప్రెస్టేజ్‌కా సవాల్. ఇందులో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలు రెండు..బీజేపీది ఒకటి. ఇప్పటికే గ్రేటర్‌లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బైపోల్‌లో గెలిచిన కాంగ్రెస్..మూడు సీట్లకు ఉప ఎన్నికలు వస్తే మాత్రం ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందిఇక రాజాసింగ్ విషయానికొస్తే బీజేపీ అధిష్టానం తన రాజీనామాను ఆమోదిస్తుందని ఆయన ఊహించలేదట. తన వెర్షన్ విని..అంతా సెట్‌రైట్ చేస్తారని భావించారట. అయితే రాజీనామా ఆమోదంతో..రాజాసింగ్ మహారాష్ట్ర రాజకీయాల్లోకి వెళ్లడం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. మహారాష్ట్రలోని ఉద్దవ్ శివసేనలో చేరి..ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉంటూ..అక్కడ..ఇక్కడ పాలిటిక్స్ చేయాలనేది రాజాసింగ్ వ్యూహమట.లేకపోతే మహారాష్ట్రలోనే యాక్టీవ్ పాలిటిక్స్‌లో ఉండాలనేది రాజాసింగ్ ఆలోచన అని కూడా చెప్తున్నారు. ఈ క్రమంలో గోషామహల్ నుంచి మళ్లీ పోటీ చేసి గెలవాలనే కసితో రాజాసింగ్ ఉన్నా..బీజేపీ ఆయనపై అనర్హత ఫిర్యాదు చేసినా..బైపోల్ రావడం ఖాయం. అదే జరిగితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ముందే..రాష్ట్ర రాజధానిలో మూడు అసెంబ్లీ సీట్ల ఎన్నికల సమరం పొలిటికల్ హీట్‌ను పెంచనుంది. దానం ఇచ్చిన ఆఫర్‌పై కాంగ్రెస్ ఎలా స్పందిస్తుంది..? ఎమ్మెల్యే పదవికి రాజీనామాపై రాజాసింగ్ ఆలోచనేంటి.? అనేది చూడాలి మరి

# బీసీ ఏలోకి ముదిరాజ్...

హైదరాబాద్, జూలై 16, తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్లను బీసీ డీ కేటగిరీ నుండి బీసీ ఏ కేటగిరీలోకి తక్షణమే మార్చాలని ముదిరాజ్ అధ్యయన వేదిక అధ్యక్షుడు, మాజీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో సోమవారం జరిగిన ముదిరాజ్ జెండా పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ... రాష్ట్రంలో ముదిరాజ్ల జనాభా 60 లక్షలకు పైగా ఉందని.. అయినప్పటికీ వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తీవ్రంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ముదిరాజ్ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక రిజర్వేషన్లు తప్పనిసరని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కూడా బీసీఏ కేటగిరీలో ముదిరాజ్‌లను చుర్చుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే బీసీఏలోకి ముదిరాజ్ లను చేర్చాలని డిమాండ్స్ కూడా పెరుగుతున్నాయి. ముదిరాజ్ నాయకులు ఈ అంశంపై ప్రజాప్రతినిధులను కలుసుకొని వినతి పత్రాలను కూడా సమర్పిస్తున్నారు.ఇదిలా ఉండగా.. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రతి చెరువులో 18 ఏళ్లు నిండిన ముదిరాజ్లకు మత్స్యకార సొసైటీ సభ్యత్వాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. మత్స్యకారుల సభ్యత్వాల విషయంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా, జిల్లా మత్స్య అభివృద్ధి శాఖ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు పెద్ద ఎత్తున పోటీ చేసి, రాజ్యాధికారాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది వారి సామాజిక, రాజకీయ ప్రాధాన్యతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు బొజ్జ నారాయణ, సలేందర్ శివయ్య, బోండ్ల గంగాధర్, బర్మ రాజనర్సయ్య, అనిల్, కిష్టయ్య, దర్శనం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ డిమాండ్ నెరవేరితే ముదిరాజ్ సామాజిక వర్గం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించే అవకాశం ఉంది. ఈ అంశం తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక పరిణామంగా మారే అవకాశం ఉంది.తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగిన బీసీ కులాల్లో ఒకటి. రాష్ట్రవ్యాప్తంగా వీరు విస్తరించి ఉన్నప్పటికీ, కొన్ని జిల్లాల్లో వారి జనాభా సాంద్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో ముదిరాజ్‌ల జనాభా అత్యధికంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో మత్స్యకారులుగా, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే ముదిరాజ్‌లు ఎక్కువగా కనిపిస్తారు. అలాగే.. ఉమ్మడి నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో కూడా వీరి ఉనికి గణనీయంగా ఉంటుంది.

# గిరిజన గ్రామాల మధ్య పులిజోన్ చిచ్చు -

అదిలాబాద్, జూలై 16, నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మైసంపేట్,రాంపూర్ పునరావాస గ్రామాల వద్ద ఉద్రిక్తత నెలకొంది. 94 మంది లబ్ధిదారులకు ఇక్కడ వ్యవసాయ భూములు కేటాయించింది. దీన్ని నచ్చన్ ఎల్లాపూర్ గొండ్ గూడ రైతులు వ్యతిరేకించారు. వ్యవసాయ భూముల పంపిణీలో అటవీ,పోలీస్,రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, ఎంపీడీవో రేవంత్ చంద్ర ఆధ్వర్యంలో అటవీ అధికారులు రెవెన్యూ అధికారులతో కలిసి పంపిణీకి సిద్ధమయ్యారు. కేటాయించడానికి గుర్తించిన రెవెన్యూ భూములకు హద్దు రాళ్ళు వేసేందుకు అధికారులు వచ్చారు. అక్కడ నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ భూములు తమవని కష్టపడి సాగచేసుకున్నామని అధికారులకు తెలియజేశారు. ఈ భూముల జోలికి రావద్దంటూ రెవెన్యూ, అటవీ అధికారుల కాళ్ళు మొక్కేందుకు కాళ్ళ మీద పడ్డారు.అటవీ అధికారులు టైగర్ జోన్ పరిధిలో ఖాళీ చేసిన రాంపూర్, మైసంపేట పునరావాస గ్రామస్తులకు కేటాయించారు. ఈ భూమిని సాగుచేస్తున్న తమపై అటవీ భూమి అని కేసులు పెట్టారని తెలియజేశారు. ఈ భూమికి తామే అర్హులమని, పంటలు వేస్తే తమకే ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. కేటాయించిన భూముల హద్దులు చూపెడతాము రమ్మని పిలవడంతో మైసంపేట్, రాంపూర్ ప్రజలు వచ్చారు. అధికారుల చర్యలు అడ్డుకోవడానికి నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజన రైతులు వచ్చారు. ఈ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు చెప్పినా వినకపోవడంతో రెండు రోజుల తర్వాత మళ్లీ హద్దుల ఏర్పాటు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం అందరూ వెనుదిరిగారు.

# రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్న కమలం

రంగారెడ్డి, జూలై 16, స్థానిక సంస్థల ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సమాయత్తం అవుతోంది. ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా నాయకులను, శ్రేణులను సంసిద్ధులను చేయడానికి రంగం సిద్ధం చేసిం ది. ఈమేరకు మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి అవుషాపూర్‌లో రాష్ట్ర పదాధికారులతో ప్రత్యేక వర్క్ షాపు నిర్వహించింది.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా వచ్చారు. వర్క్‌షాపునకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ తేదీల వారీగా ప్రకటించా రు.ఈనెల 18 నుంచి ఆగస్టు 20వరకు వరుసగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్లు వేసిన తర్వాత తదుపరి కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ మాదిరిగానే, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే అవినీతి, ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తోందని విమర్శించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను నల్లగొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో మొట్టమొదటి పర్యటన చేశానని, ఈపర్యటనలో వివిధ వర్గాల ప్రజలను కలిసి నట్లు తెలిపారు. గ్రామాల్లో బీజేపీ బలం పెరుగుతోందని, ప్రజలు బీజేపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.గతంలో భారతీయ జనతా పార్టీకి ఒక్క ఎమ్మెల్యే, నలుగురు ఎంపీలు మాత్రమే ఉండగా, ఇప్పుడు ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని, ప్రతీ ఎన్నికలో బీజేపీ ఓటుశాతం, ప్రాతినిధ్యం పెరుగుతోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా విజయసంకల్పంతో ముందుకు సాగాలని, అందుకుకార్యకర్తలు, నాయకులు ముందుకు రావాలని, అందరం కలిసిమెలిసి ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అందులో 10 శాతం మతపరమైన రిజర్వేషన్లను కలుపాలని చూస్తోందని ఇది బీసీలకు వ్యతిరేకమైన చర్య ఉన్నారు. మతపరమైన కారణాల వల్లే ఆనాడు భారతదేశ విభజన జరిగిందన్న విషయాన్ని గుర్తుచేశారు.విద్యా, ఉద్యోగాల్లో మతపరమైన 4 శాతం రిజర్వేషన్లను బీజేపీ గతంలోనే వ్యతిరేకించిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయం కోసం ఇప్పుడు రాజకీయాల్లోనూ అదే విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని, ప్రజల కోసం పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా ఇప్పటినుంచే కృషి చేయాలన్నారు.

# కనిపించని వరుణుడు... ఎండుతున్న పంటలు

మెదక్, జూలై 16, ఖరీఫ్ సాగుకు సిద్ధమైన అ న్నదాతలకు,కన్నీటి కష్టాలు ఎదురవుతున్నా యి. మండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్లో సాగయ్యే ప్రధాన పంటలు పత్తి, వరి, మిర్చిఇతర వాణిజ్య పంటలపై వరుణుడు తన ప్రభావాన్ని చూపుతున్నాడు. ఈ సీజన్లో జూన్ నెల ప్రారంభంలో రైతులు పత్తి, నారుమళ్ళను నాటారు. ఇప్పటివరకు సరైన వర్షాలు పడకపోవడంతో అవి మొలకెత్తలేదు.రైతులు మళ్లీ జూలై నెలలో పత్తి విత్తనాలు రెండవసారి నాటారు .అవి మొలకెత్తిన తర్వాత వర్షాలు కనుమరుగు అ య్యాయి. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం జాడలేక ప్రభు త్వం సాగర్ కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయక పంట పొలాలు బీటలు వారడంతో కాలువల కింద వ్యవసాయం చేస్తున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇం జన్ల ద్వారా నీరు అందిస్తూ పంట ను కాపాడుకోవటానికి భగీరథ ప్రయ త్నం చేస్తున్నారు. కళ్ళ ముందే ఎండుతున్న పంటలను చూసిన రైతు తట్టుకోలేకపోతున్నారు.. నాట్లు వేశామని ఆనందపడిన అన్నదాతలు నేడు సాగునీరు లేక ఎండుతున్న పంటలను చూసి బావురుమంటున్నారు. సకాలంలో వర్షాలు పడతా యని, కాలువలతో సాగునీటికి ఇబ్బంది ఉండదని పంటలు వేసిన అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. నియోజక వర్గంలో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగవుతుంది. వరి సాగు చేసిన రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.కళ్ల ముందే బీటలువారి ఎండుతున్న పంటలనుకాపాడు కోవడానికి అన్నదాతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కాలువలో ఉన్న అరకొర నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడి పంటలను కాపాడుకో వటానికి అష్టకష్టాలు పడుతు న్నారు. పొలంలో చుక్కనీరు లేక నెర్రెలు ఇచ్చి.. ఎండిపోతు చూసి రైతు ఆవేదన చెందు తున్నారు. కొద్దిపాటి నీటిని తొడటానికి రోజుకు ఆయిల్, ఇంజను అద్దె కలిపి రోజుకు 2 వేల రూపాయలు అదనంగా ఖర్చువుతుందని, ఇప్పటికే ఎకరాకు రూ. 22 వేలు ఖర్చు చేశామని వాపోతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగర్ నీటిని విడుదల చేస్తే ఎ లాంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయం చేసుకుంటామని లేకపోతే ఆత్మహత్యలే శరణ్య మంటున్నారు.

# కేంద్ర క్రీడాశాఖ మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ.

న్యూఢిల్లీ, జూలై 16 సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన రెండో రోజు కొనసాగుతుంది. ఇందులో భాగంగా బుధవారం సీఎం చంద్రబాబు కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో భేటి అయ్యారు.. ఏపిలో ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ,క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు,నేషనల్ వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి, స్టేడియమ్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ల నిర్మాణాలకు సంబంధించి విజ్ఞాపనలు అందజేశారు. అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బ్యాడ్మింటన్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించాలని కేంద్రమంత్రిని కోరారు చంద్రబాబు. అమరావతిలో జాతీయ జల క్రీడల శిక్షణా హబ్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని, కృష్ణా నదీ తీరంలో వాటర్ స్పోర్ట్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు విస్తృత అవకాశాలున్నాయని సీఎం కేంద్రమంత్రికి వివరించారు. ఏపిలో క్రీడలకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల్ని కేంద్రమంత్రికి అందేశారునాగార్జునా యూనివర్సిటీ, కాకినాడలలో నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ల ఏర్పాటు, తిరుపతి, రాజమహేంద్రవరం, కాకినాడ, నరసరావుపేటలలో ఖేలో ఇండియా కింద మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి రూ. 27 కోట్లు, గుంటూరు బీఆర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రూ. 170 కోట్లు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి రూ. 341 కోట్లు మంజూరు చేయాలని చంద్రబాబు కేంద్రమంత్రిని కోరారు. జిల్లాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు అదనంగా ఖేలో ఇండియా కేంద్రాలు మంజూరు చేయాలని కోరారు. రాయలసీమలోని తిరుపతిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణా కేంద్రం ఏర్పాటును పరిశీలించాలని ,2024-29 స్పోర్ట్స్ పాలసీలో భాగంగా ఏపీలో స్పోర్ట్స్ ఎకో సిస్టం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు కేంద్రమంత్రికి చంద్రబాబు వివరించారుఖేలో ఇండియా మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ 2025ను ఏపీలో నిర్వహించేందుకు అవకాశం ఇవ్వడంపై కేంద్ర మంత్రి మాండవీయకు ధన్యవాదాలు తెలిపారు విజయవాడ, విశాఖ తదితర నగరాల్లో అత్యుత్తమ క్రీడా వేదికలపై వీటిని నిర్వహిస్తామని చంద్రబాబు కేంద్రమంత్రికి తెలిపారు. ఖేలో ఇండియా మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ నిర్వహణకు రూ.25 కోట్లు విడుదల చేయాలని కేంద్రమంత్రిని చంద్రబాబు కోరారు. చంద్రబాబు వినతి పట్ల కేంద్రమంత్రి సైతం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# వడివడిగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై మంత్రి కీలక ప్రకటన!

హైదరాబాద్, జూలై 16 ఈ ఏడాది దసరా నాటికి ఉప్పల్, నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కొందరు అధికారులతో కలిసి బుధవారం నాడు ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపరిశీలించారు. చాలా కాలం కింటే ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభమైనా వాటిపై పురోగతి లేదన్నారు. నగరంలోని ప్రముఖ ఎలివేటెడ్ కారిడార్‌లలో ఒకటైన ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యేతో కలిసి కారిడార్ పనులను పరిశీలించిన సందర్భంగా మంత్రి ఈ ప్రకటన చేశారు.హైదరాబాద్ నగర వాహనదారులకు శుభవార్త. నగరంలోని ప్రముఖ ఎలివేటెడ్ కారిడార్‌లలో ఒకటైన ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయి. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈరోజు మంత్రి స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డితో కలిసి కారిడార్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. "కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని.. అయితే ఈ ఏడాది దసరా నాటికి కారిడార్‌ను ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఆలస్యానికి ఎవ్వరినీ వ్యక్తిగతంగా బాధ్యులుగా నిలబెట్టాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు, ఘట్‌కేసర్, యాదాద్రి, వరంగల్ వైపు వెళ్లే వాహనదారులకు వేగవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఈ ఎలివేటెడ్ కారిడార్ రూపుదిద్దుకుంది. ఈ ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మితమవుతోంది. దీని అంచనా వ్యయం రూ. 626.76 కోట్లు కాగా..భూసేకరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. భూసేకరణకి రూ. 330 కోట్ల నుంచి రూ. 768 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. నిర్మాణానికి ఎదురైన సవాళ్లు ఈ ప్రాజెక్టు 2017లో ప్రారంభమైనా, అనేక సాంకేతిక, పరిపాలనా కారణాలతో పనులు నెమ్మదించాయి. మొదట ప్రాజెక్టును చేపట్టిన గాయత్రీ సంస్థ వెనక్కు తగ్గడంతో జాప్యం ప్రారంభమైంది. భూసేకరణ, యుటిలిటీల మార్పిడి (విద్యుత్ లైన్లు, నీటి పైపులు మొదలైనవి) వంటి సమస్యలు నిర్మాణాన్ని నిలిపివేశాయి.ఈ ఆలస్యాల కారణంగా రోజూ ఉప్పల్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతూ, ప్రజలు గుంతల రోడ్లపై ప్రయాణిస్తూ తీవ్ర అసౌకర్యాలు అనుభవిస్తున్నారు. ఈ కారిడార్ పూర్తి అయితే హైదరాబాద్ తూర్పు ప్రాంత ప్రజలకు పెద్దగా ఉపశమనం లభిస్తుంది. జాతీయ రహదారి 163 (ఔఉ-163) మీద రాకపోకలు సులభతరం అవుతాయి. ఔట్‌ఘట్, యాదాద్రి, వరంగల్ దిశగా ప్రయాణించే వాహనదారులకు ప్రయాణ సమయం తగ్గుతుంది. ఇది పూర్తి అయిన తర్వాత నగర రహదారి మౌలిక సదుపాయాల్లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుంది.ఉప్పల్- నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు 2017లో ప్రారంభం కాగా, చాలా కాలం కిందటే వాటి పనులు నిలిచిపోయాయి. నిర్మాణ పనులు మధ్యలోనే పనులు ఆపేయడంతో ప్రాజెక్టు పూర్తి కాలేదు. దాంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు చాలా కాలం నుంచి ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా గుంతల రోడ్డు వల్ల ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల కండీషన్ దెబ్బతింటుందని వాహనదారులు చెబుతున్నారు.ఉప్పల్ రింగ్ రోడ్ నుండి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఉప్పల్ ఫ్లైఓవర్ పనులను మేడిపల్లి వద్ద పరిశీలించాను.

# మూడున్నరేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం పోవడం ఖాయం?

విజయవాడ, జూలై 16రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబు పాలనతో భయానక పరిస్థితులు ఏర్పడ్డాయని అరోపించారు. రాష్ట్రంలో రాజ్యాంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు జగన్. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉండేది వైసీపీనేనని గుర్తు చేశారు. రైతుభరోసా నిధుల కోసం...రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబు పాలనతో భయానక పరిస్థితులు ఏర్పడ్డాయని అరోపించారు. రాష్ట్రంలో రాజ్యాంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు జగన్. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉండేది వైసీపీనేనని గుర్తు చేశారు. రైతుభరోసా నిధుల కోసం అన్నదాతకు అండగా ధర్నా చేశామన్నారు. కరెంట్ ఛార్జీల పెంపును నిరసిస్తూ పోరుబాట చేపట్టామని జగన్ చెప్పుకొచ్చారు. యువత పోరు పేరుతో ఆందోళనలు చేపట్టాం.. చంద్రబాబు మోసాలపై వెన్నుపోటు దినం నిర్వహించాం.. బాబు షూరిటీ–మోసం గ్యారంటీపై.. ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని వైఎస్ జగన్ అన్నారువైసీపీని అణిచివేయాలని చంద్రబాబు కుట్రలు పన్నారని జగన్మోహన్ రెడ్ఇ ఆరోపించారు. అధికారులపై తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. డీజీ స్థాయి అధికారులనూ వేధిస్తున్నారని జగన్ ఆరోపించారు. మూడున్నరేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం పోవడం ఖాయమని జగన్ జోస్యం చెప్పారు.

ఎన్టీఆర్ కంటే గొప్ప నటుడు

న్టీఆర్ కంటే గొప్ప నటుడు చంద్రబాబు అని.. దానవీరశూరకర్ణ కన్నా గొప్పగా ఏపీ సీఎం నటించారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. మీరు దాడి చేసి జడ్పీ చైర్ పర్సన్ హారికను మహానటి అని మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. హారిక భర్త రాము తన కారుతో ఢీకొట్టాడని తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారు. డ్రైవర్ గవర్నమెంట్ ఉద్యోగి, వెనక సీట్లో కూర్చున్న వ్యక్తిపై ఏ విధంగా కేసు పెట్టారో అర్థం కావడం లేదు. ఈ దాడి ఘటనలో పోలీసులు ఎంత మందిని అరెస్ట్ చేశారు. ప్లాన్ చేసి దాడులు చేస్తున్నా పోలీసులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తన పర్యటన ఉంటే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారని చంద్రబాబుపై ఆరోపణలు గుప్పించారు. తాడేపల్లిలో వైఎస్ జగన్ ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో ప్రజలు తలెత్తుకుని పనిచేసేవారు. స్పందన అనే కార్యక్రమంలో వైసీపీ వాళ్ల కన్నా టీడీపీ వాళ్ల సమస్యలే ఎక్కువగా పరిష్కారం చేశాం. ఎవరికి సమస్య వచ్చినా చంద్రబాబు మాట వినని పోలీసులు అధికారుల పరిస్థితి ఎలా ఉందంటే.. డీజీ స్థాయి అధికారి అయిన పీఎస్ఆర్ ఆంజనేయులును, మరో అడిషనల్ డీజీ స్థాయి అధికారి సునీల్ కుమార్, సంజయ్ అనే అధికారి, బీసీ అధికారి క్రాంతి రానా టాటా, డీఐజీ స్థాయి విశాల్ గున్నీలపై అక్రమ కేసులు బనాయించారు. విచారణ పేరుతో ఎంతో మంది ఎస్పీలను వేధించారు. 22 మంది అడిషనల్ ఎస్పీలు, 50 మంది డీఎస్పీలకు పోస్టింగ్ ఇవ్వలేదు. మరికొందరు పోలీసు ఉన్నతాధికారులను హెడ్ క్వార్టర్ లో రిపోర్ట్ చేయాలన్నారు. ఎంతో మంది అధికారులు వీఆర్ లో ఉన్నారు.

వేధింపులు తట్టుకోలేక అధికారులు రాజీనామాతన మోచేతి నీళ్లు తాగే అధికారులను మాత్రమే పోత్సహిస్తూ వారిని అవినీతిలో భాగస్వామ్యం చేస్తున్నారు. వీరు ఆయన ఆర్మీగా మారి బెల్ట్ షాపులు, నియోజకవర్గంలో పరిశ్రమలు, పేకాడ క్లబ్బుల విషయంలో డీఐజీల ఆధ్వర్యంలో సీఐలు కలెక్ట్ చేసి ఎమ్మెల్యేలకు మనీ ఇస్తున్నారు. పైకి చినబాబు, పెద్దబాబుకు వెళు _ంది. సిద్ధార్థ కౌశల్ లాంటి యంగ్ ఐపీఎస్ అధికారి వేధింపులు తట్టుకోలేక రాజీనామా చేసి వెళ్లిపోతున్నారు. నేరాలు చేసేవాళ్లకు బదులు, పోలీసులు రాష్ట్రాన్ని వదిలి వెళ్తున్న దుస్థితి ఏపీలో ఉంది.' ఇన్నేళ్ల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబుకు ప్రతిపక్షం పాత్ర ఏంటో కూడా తెలియదా. ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత మాపై ఉంది. గుడివాడలో కృష్ణా జిల్లా చైర్ పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ సైకోలు, చంద్రబాబు శాడిస్ట్ గ్యాంగ్ దాడి చేసింది. బీసీ మహిళ అయిన హారిక చేసిన తప్పేంది. ఆమెను నోటికొచ్చిన మాటలు ఎందుకన్నారు. చంద్రబాబు మోసాలను, హామీల అమలుపై ప్రశ్నిస్తే వైసీపీ మహిళా నేతకు ఇలాంటి పరిస్థితి తలెత్తింది. కారు అద్దాలు పగలగొడుతుంటే గంటలపాటు ఆమె తన భర్తతో పాటు భయంభయంగా వాహనంలోనే కూర్చున్నారు. పోలీసుల సమక్షంలోనే ఇది జరుగుతున్నా వారు ప్రేక్షకపాత్ర పోషించారు.

రైతులను పరామర్శించినా కేసులే..మిర్చి ధరలు పడిపోయాయని ఫిబ్రవరిలో గుంటూరు మిర్చియార్డుకు వెళ్లాను. గతంలో మా ప్రభుత్వంలో మిర్చి క్వింటాలు ధర రూ.21 నుంచి 27 వేలు. ఇప్పుడు మిర్చి ధర 8 నుంచి 10 వేలకు పడిపోయింది. రైతులకు అండగా మిర్చి యార్డుకు వెళ్లడం తప్పా. పోలీసులు సహకరించవద్దు అని నాకు జడ్ ప్లస్ కేటగిరీ భద్రతను తొలగించారు. చంద్రబాబు ఆదేశాలతో మాకు సహకరించకపోగా, రైతులకు సంఘీభావం తెలిపినందుకు తిరిగి మాపైనే కేసులు పెట్టారు.సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో స్థానిక ఎమ్మెల్యే చేతిలో వైసీపీ నేత కురుమ లింగయ్య హత్యకు గురైతే ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తే.. భద్రత కరువైంది. హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతింది. రామగిరిలో పర్యటన తరువాత వైసీపీ ఇంచార్జ్ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మీద అక్రమ కేసులు పెట్టారు. పార్టీకి చెందిన వారికి సమస్య వస్తే పరామర్శించడం కూడా తప్పేనా.. పొగాకు ధరలు పడిపోవడంతో పొదిలికి వెళ్తే వేధించారు. 160కి పడిపోయింది. అసలు కొనేనాథుడు లేదు. గతంలో 180 పైచిలుకు ఉండే ధర రూ.80 కి పడిపోయింది. ఎక్కడ పరామర్శకు వెళ్లినా, రైతులకు సంఘీభావం తెలిపినా అక్రమ కేసులు పెడుతున్నారు.

# ఆస్తుల కోసం ఫ్యామిలీ ఫైట్

నల్గోండ, జూలై 16 నల్లగొండ జిల్లా మునుగోడు మండలం సింగారం గ్రామానికి చెందిన కోడి చంద్రయ్య, అంజమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని సాగు చేసి ఇద్దరినీ పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేశాడు. కూతురు పెళ్లి సమయంలో ఇల్లు కానీ భూమిలో కొంత భాగం కానీ అమ్మి పెళ్లి చేయమని కొడుకు రాములు పెద్ద మనుషుల సమక్షంలో బాండ్ పేపర్ రాసి ఇచ్చాడు. అయితే పెళ్లికి కట్నంగా తామున్న ఇంటిని కూతురికి గిఫ్ట్ డీడ్ చేశాడు తండ్రి. కొద్ది రోజుల తర్వాత కొడుకు రాములు తల్లిదండ్రులిద్దరిని ఇంటి నుండి గెంటి వేయడంతో గ్రామంలో కిరాయి ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమకు కొడుకు రాములు ద్వారా మెయింటెనెన్స్ ఇప్పించాలని చంద్రయ్య దంపతులు ఆర్డీఓను కోరారు. అధికారుల ఆదేశాలు మేరకు ఉన్న భూమిలో కొంత భాగాన్ని కొడుకుకు ఇవ్వాలని, మిగిలిన భాగాన్ని తండ్రి చంద్రయ్య తీసుకునేలా గ్రామ పెద్దలు తీర్మానించారు. తిరిగి కొంతకాలంగా మిగిలిన భూమిని కూడా తనకు ఇవ్వాలంటూ వేధిస్తున్నాడని తండ్రి చంద్రయ్య వాపోతున్నాడు.వృద్ధాప్యంలో ఉన్న తమను? భూమికోసం కొడుకు రాములు ఇబ్బందులు పెడుతున్నాడంటూ మునుగోడు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు. ఇంటిని ఖాళీ చేయకుండా వ్యవసాయ భూమిలోకి రానివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారుల స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.తల్లిదండ్రులు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగగా, కొడుకు కూడా గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీతో ధర్నాకు దిగాడు. చెల్లెలు అలివేలు వివాహానికి ముందే కొన్నేళ్లుగా ఉమ్మడిగా ఉంటున్న ఇంటిని తనకు తెలియకుండా తండ్రి చంద్రయ్య.. చెల్లెలు అలివేలు పేరిట గిఫ్ట్ డీడ్ చేశాడని కొడుకు రాములు వాపోతున్నాడు. అధికారులకు ొప్పుడు సమాచారం ఇచ్చి ఇంటిని ఖాళీ చేయాలంటూ తన తండ్రి తనను ఇబ్బందులు పెడుతున్నాడని రాములు అంటున్నాడు. ఇంటిని ఖాళీ చేయాలనీ పోలీసులతో ఇబ్బందులు పెడుతున్నాడని రాములు వాపోయాడు. ఈ వివాదంపై కోర్టును ఆశ్రయిస్తానని రాములు చెబుతున్నాడు. మొత్తానికి ఆస్తికోసం ఇటు తండ్రి అటు కొడుకు ఆందోళనలు అధికారులకు తలనొప్పులు తెచ్చిపెడుతోంది.

# నిమిష ప్రియకు ఊరట కష్టమే



తిరువనంతపురం, జూలై 16 రళ నర్సు నిమిషా ప్రియకు ఉరిశిక్ష నుంచి ఉపశమనం లభించింది. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా దోషికి శిక్ష పడాల్సిందేనని అంటున్నారు. తలాల్ అబ్దో మెహదీ సోదరుడు అబ్దేల్‌ఫత్తా మెహదీ మాట్లాడుతూ జరుగుతున్న పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. తాను బ్లడీ మనీకి అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఈ నేరానికి క్షమాపణ ఉండదని అన్నారు. నిమిషా ప్రియకు మరణశిక్ష విధించాలని అబ్దేల్‌ఫత్తా అన్నారు. నిమిషా బాధితురాలిగా భారత మీడియా పేర్కొనడంపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.నిమిషా ప్రియను బుధవారం, ఉరితీయాల్సి ఉంది, కానీ సుదీర్ఘ చర్చల తర్వాత ఉరిశిక్ష వాయిదా పడింది. దీనికి భారత ప్రభుత్వం, సౌదీ అరేబియాకు చెందిన ఏజెన్సీలు జోక్యం వంటి అనేక పార్టీల ప్రయత్నాలు జరిగాయి. వీరిలో యెమెన్‌లోని షురా కౌన్సిల్‌ను మధ్యవర్తిత్వం కోసం సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ ప్రయత్నాలన్నింటి కారణంగా, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఉరిశిక్షను వాయిదా వేయాలని నిర్ణయించారు.'మా కుటుంబం రాజీ కోసం చేసిన అన్ని ప్రతిపాదనలను తిరస్కరించింది'

ఉరిశిక్షను వాయిదా వేస్తున్నప్పుడు, నిమిషా ప్రియ కుటుంబానికి బ్లడీమనీ కోసం తలాల్ కుటుంబాన్ని ఒప్పించడానికి సమయం ఇస్తామని చెప్పారు, కానీ ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. తలాల్ సోదరుడు బ్లడీ మనీకి అంగీకరించడం లేదు. తలాల్ సోదరుడు అబ్దేల్‌ఫత్తా మెహదీ మాట్లాడుతూ "మా కుటుంబం రాజీ కోసం చేసిన అన్ని ప్రతిపాదనలను తిరస్కరించిందని అన్నారు. మా సోదరుడిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించాలని మేము కోరుకుంటున్నాము. క్షమాపణ ప్రశ్నపై, ఇది చాలా తీవ్రమైన నేరం దీనిలో క్షమాపణ ఇవ్వలేం"అన్నారు.అల్లా మాతో ఉన్నాడు–అబ్దేల్‌ఫట్టా మెహదీ

ప్రాణాలను కొనలేమని అబ్దేల్‌ఫత్తా మెహదీ కఠినమైన స్వరంలో అన్నారు. శిక్ష వాయిదా వేయడం ఆశ్చర్యంగా ఉంది. న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది. సమయం తీసుకున్నా న్యాయం జరుగుతుంది. ఇది కేవలం చిన్న విరామమే. అల్లా మాతో ఉన్నాడు. సోమవారం కూడా అబ్దేల్‌ఫత్తా మెహదీ అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని చెప్పారు, సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను కూడా షేర్ చేశారు. ఈ విషయానికి సంబంధించి, కేరళ సిపిఐ(ఎం) కార్యదర్శి ఎం.వి. గోవిందన్ బుధవారం మాట్లాడుతూ, మరణశిక్ష వాయిదా పడిందని, అనేక ఇతర అంశాలు కూడా చర్చకు వస్తాయని మధ్యవర్తులు తనకు చెప్పారని అన్నారు.

# లోకేష్ కామెంట్స్ పై రచ్చ రచ్చ



విజయవాడ, జూలై 16 కర్ణాటక ప్రభుత్వం ఎయిర్ పోర్టు వద్ద ఎరో స్పేస్ పార్క్ నిర్మాణం కోసం పదిహేడు వందల ఎకరాల్ని సేకరించాలనుకుని భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ ఈ భూములు ఉన్న దేవనహల్లి గ్రామంలో రైతులు తిరగబడ్డారు. దాంతో ప్రభుత్వం భూసేకరణను నిలిపివేస్తున్నట్లుగా ప్రకటించారు. ఏరోస్పేస్ పార్క్ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. వెంటనే నారా లోకేష్ స్పందించారు. కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంతో ఏరోస్పేస్ ఇండస్ట్రీ కోసం తన వద్ద మంచి ఆలోచన ఉందన్నారు. మీ కోసం మా వద్ద ఆకర్షణీయమైన ఏరోస్పేస్ పాలసీ ఉంది, అత్యుత్తమ ప్రోత్సాహకాలు అలాగే 8000 ఎకరాలకు పైగా ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్న భూమి ఉందన్నారు. అది కూడా బెంగళూరుకు సమీపంలోనే ఉందన్నారు. త్వరలోనే కలుద్దామని కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం.. అనంతపురం సరిహద్దులకు దగ్గరగా ఉంటుంది. అందుకే నారా లోకేష్ పిలుపునకు ఏరో స్పేస్ ఇండస్ట్రీ కి చెందిన వారు స్పందిస్తే.. అనంతపురంకు అడ్వాంటేజ్ అవుతుంది. నారా లోకేష్ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ట్వీట్‌కు బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య స్పందించారు. లోకేష్ ను చూసి నేర్చుకోవాలని కర్ణాటక ప్రభుత్వానికి కౌంటర్ ఇచ్చారు. తర్వాత ట్వీట్ తొలగించారు. కానీ చాలా మంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరును విమర్శించారు. చివరికి పరిశ్రమలు ఏపీకి తరలిపోతాయన్న ఆందోళన వ్యక్తంత కావడంతో కర్ణాటక ఇండస్ట్రీస్ మంత్రి సోషల్ మీడియాలో స్పందించారు. కర్ణాటక కేవలం భూమిని మాత్రమే అందించదు – ఇది భారతదేశంలో నంబర్ 1 ఏరోస్పేస్ డ డిఫెన్స్ కోసిస్టమ్‌ను అందిస్తుందని చెప్పుకొచ్చారు. భారతదేశ ఏరోస్పేస్ ఉత్పత్తిలో 65% తోడ్పడి జాతీయంగా నంబర్ 1, ప్రపంచవ్యాప్తంగా 3వ స్థానంలో ఉన్నామన్నారు. ఏమి చేయాలో, ఎప్పుడు చేయాలో మరియు ఎలా చేయాలో మాకు తెలుసు. ఏరో స్పేస్ పార్క్ ఎక్కడికీ వెళ్లదన్నారు.

# మస్క్... చార్జింగ్ స్టేషన్ వద్ద కలుసుకుందాం...

ముంబై, జూలై 16 ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ టెస్లా, ఎట్టకేలకు భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో తమ మొదటి 'టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ప్రారంభించింది. టెస్లా ప్రవేశాన్ని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా స్వాగతించారు. పోటీ అనేది ఆవిష్కరణకు దారితీస్తుందని, భారతీయ ఈవీ మార్కెట్‌లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఆనంద్ మహీంద్రా ఎక్స్ వేదికగా ఎలాన్ మస్క్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, "ఎలాన్ మస్క్, టెస్లా... భారతదేశంలోకి మీకు స్వాగతం. ప్రపంచంలోనే అతిపెద్ద ఈవీ అవకాశాలలో ఒకటి ఇప్పుడు మరింత ఉత్సాహంగా మారింది. పోటీ అనేది ఆవిష్కరణను నడిపిస్తుంది. ప్రయాణించాల్సిన దూరం చాలా ఉంది. ఛార్జింగ్ స్టేషన్‌లో మిమ్మల్ని కలవడానికి ఎదురుచూస్తున్నాను" అని పోస్ట్ చేశారు. 2017లో మహీంద్రా, ఎలాన్ మస్క్‌కు ఇలాంటి ఆహ్వానమే పలికారు, "మహీంద్రాకు మొత్తం మార్కెట్‌ను వదిలేయాలని మీరు అనుకోవడం లేదు కదా? ఎంత ఎక్కువ మంది ఉంటే పర్యావరణానికి అంత మంచిది... అంతా పచ్చదనమే" అని సరదాగా పేర్కొన్నారు. ఇది భారతదేశ ఈవీ భవిష్యత్తుపై ఆయనకున్న సానుకూల దృక్పథాన్ని తెలియజేస్తుంది.కాగా, నేడు టెస్లా తన మోడల్ వై కారును భారతదేశంలో విడుదల చేసింది. దీని ధరలు సుమారు రూ. 61 లక్షల నుంచి ప్రారంభమవుతాయి. ప్రస్తుతానికి టెస్లా వాహనాలు షాంఘైలోని ప్లాంట్ నుంచి దిగుమతి అవుతాయి. భారతదేశంలో అధిక దిగుమతి సుంకాలు ఉన్నప్పటికీ, టెస్లా తన ప్రీమియం ఉత్పత్తులతో భారతీయ వినియోగదారులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనితోపాటు, టెస్లా తన ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తోంది, ఇందులో నెక్స్ట్–జెన్ వీ4 సూపర్ ఛార్జర్‌లు కూడా ఉంటాయి, ఇవి కేవలం 15 నిమిషాల్లో 267 కిలోమీటర్ల పరిధికి సరిపడా ఛార్జ్ చేయగలవు.టెస్లా ప్రవేశం భారతీయ ఈవీ మార్కెట్‌కు గణనీయమైన ఊపునిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. భారతదేశం 2024లో 2 మిలియన్లకు పైగా ఈవీల విక్రయాలతో ఎలక్ట్రిక్ వాహన రంగంలో వేగంగా వృద్ధి చెందుతోంది. అయితే, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు ఈ మార్కెట్లో అధిక వాటాను కలిగి ఉన్నాయి.

టాటా మోటార్స్, ఎంజి మోటార్ వంటి దేశీయ మరియు అంతర్జాతీయ సంస్థల నుండి పోటీ పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొత్త ఈవీ పాలసీ కూడా విదేశీ తయారీదారులకు తక్కువ దిగుమతి సుంకాలు మరియు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇది టెస్లా వంటి సంస్థలకు మార్గాన్ని సుగమం చేస్తుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ కూడా టెస్లా ప్రవేశాన్ని స్వాగతించారు, తమ రాష్ట్రం ఎలక్ట్రిక్ మొబిలిటీలో అగ్రగామిగా ఉందని, టెస్లాకు పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. టెస్లా యొక్క ఈ చర్య భారతదేశంలో లగ్జరీ ఈవీ విభాగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పనుంది. ఇది ఇతర ప్రీమియం ఈవీ తయారీదారులైన బీవైడీ, మెర్సిడెస్ బెంజ్ ఈక్యూ సిరీస్‌లకు కూడా పోటీని పెంచుతుంది.

# విద్యా పరిరక్షణ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలి
## ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డిసోమన్న

పత్తికొండ పట్టణంలో (బాలికల మేనేజ్మెంట్) ఇంటర్ డిగ్రీ సంబంధించిన వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి ఏఐఎస్ఎఫ్ డిమాండ్ కర్నూలు జిల్లా (ఉదయం న్యూస్) బుధవారం:–ఏఐఎస్ఎఫ్ పత్తికొండ పట్టణ సమితి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో కళాశాల నూతన కమిటీ ఎన్నిక పత్తికొండలోని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీ ఉన్న పీఈటి,టీచర్ ,పోస్టులను భర్తీ చేయాలి. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పత్తికొండ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమావేశం నిర్వహించడం జరిగినది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న పాల్గొన్నారు వీరితోపాటు మండల కార్యదర్శి శివ పట్టణ కార్యదర్శి వినోద్, సహాయ కార్యదర్శులు మాబాష,దర్శి,నాయకులు చరణ్ ,రావి,తదితరులు పాల్గొన్నారు. , అనంతరం పత్తికొండ జూనియర్ కళాశాల నూతన కమిటీనిఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. నూతన కమిటీ అధ్యక్షులు; –బాబు,ఉపాధ్యక్షులు: – మనోహర్,వీరేంద్,రాజు,కార్యదర్శి: – రంగ స్వామి,సహాయకార్యదర్శిలు: – ధనంజయ ,హరీష్ ,రాజు, కోశాది కారి:– గణేష్, అఖిల్ ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు,

### బేతంచర్ల సహకార సంఘం చైర్మన్ ప్రమాణ స్వీకారం

బేతంచర్ల మండలం సహకార సంఘం సొసైటీ చైర్మన్గా ఉన్నాం చంద్రశేఖర్ బుధవారం నాడు ఎమ్మెల్యే కోట్ల జయసుర ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా ధోని ఎమ్మెల్యే కోట్ల జయసుధ ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని తెలియజేశారు.

# బెంగాల్ లో మమత నిరసన

కోల్ కత్తా, జూలై 16 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వారిని వేధిస్తున్నారని ఆరోపిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్షంలో సైతం నిరసన మార్చ్ నిర్వహించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బెంగాలీ వలసదారులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆమె ఆరోపించారు. బెంగాల్ భారతదేశ స్వేచ్ఛ కోసం పోరాడిందని ఆమె అన్నారు. బెంగాలీలను వేధిస్తున్నందుకు బీజేపీ సిగ్గుపడాలని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు."అసలు బీజేపీ ఏమనుకుంటోంది? బెంగాలీలను బాధపెడతారా? వారిని రోహింగ్యాలు అని పిలుస్తున్నారు. రోహింగ్యాలు ఇక్కడ కాదు, మయన్మార్‌లో ఉన్నారు. 22 లక్షల మంది పేద వలస కార్మికులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారు స్వదేశానికి తిరిగి రావాలని నేను వారిని విజ్ఞప్తి చేస్తున్నాను. వారు ఇక్కడ సురక్షితంగా ఉంటారు. బీజేపీ బెంగాలీ మాట్లాడే వారిని నిర్బంధ శిబిరాలకు పంపుతోంది. పశ్చిమ బెంగాల్ భారతదేశంలో లేదా?" అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. బెంగాలీల త్యాగం, స్వాతంత్ర్య సమరయోధులను బీజేపీ మరచిపోయిందా అని ఆమె నిలదీశారు.

# 100 జిల్లాల్లో 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన

న్యూఢిల్లీ, జూలై 16 కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. 2025-26 నుంచి ఆరేళ్ల కాలానికి ఈ పథకం 100 జిల్లాలను కవర్ చేసేలా ప్రణాళిక రూపొందించారు.వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంట కోత తర్వాత గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేయడానికి గోదాముల సదుపాయం, నీటి పారుదలాకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడం వంటి లక్ష్యాలతో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని రూపొందించారు. 11 శాఖల్లోని 36 పథకాలు, రాష్ట్రంలోని ఇతర పథకాలు, ప్రైవేటు రంగంతో స్థానిక భాగస్వామ్యం ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు.కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మరికొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీకి రూ. 20 వేల కోట్ల పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతరిక్ష కేంద్రంలో 18 రోజులు గడిపి విజయవంతంగా భూమికి తిరిగి వచ్చిన శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యం

## ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని నేడు గ్రామాలలో హామీల అమలుతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారుబుధవారం ఖిల్లా గణపురం మండల కేంద్రంలో ఖిల్లగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో పల్లె ప్రకృతి వనం వద్ద నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారుఅనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అలనాటి వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆయన పరిశీలించారుఅనంతరం మండల కేంద్రంలోని ఖంఅూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని అన్నదాతలకు మంజూరైన రాయితీ రుణాల కు సంబంధించిన పత్రాలను అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల్లోకి వచ్చాక అన్నదాతలకు కావలసిన అన్ని రకాల పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సింగిల్ విండో బ్యాంకుల నుంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గోల్డ్ లోన్, వ్యవసాయ రుణాలు, దీర్ఘకాలిక రుణాలను అందజేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.బికార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, క్యామరాజు వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, వెంకట్రావు, సాయిచరణ్ రెడ్డి, క్యామ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ కుమార్, ఆగారం ప్రకాష్, గంజాయి రమేష్, మనాజిపేట సతీష్, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం,అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**బొందిమడుగుల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం.**

**ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించిన టిడిపి నాయకులు**



.తుగ్గలి: ప్రజా సంక్షేమం,అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర,మారెళ్ళ సొసైటీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడులు తెలియజేశారు.బుధవారం రోజున పత్తికొండ శాసనసభ్యులు కేఈ శాంబాబు ఆదేశాల మేరకు తుగ్గలి మండల పరిధిలోని గల బొందిమడుగుల గ్రామం నందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం ప్రజలకు అందజేసిన సంక్షేమ ఫలాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు ఏడాది పాలనలో ప్రభుత్వం పెంచిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల గురించి,తల్లికి వందనం పథకం గురించి, త్వరలో అందజేసే అన్నదాత సుఖీభవ పథకం గురించి,ప్రభుత్వం అందజేస్తున్న దీపం పథకం గురించి మరియు త్వరలో మహిళలకు కొరకు ప్రవేశపెట్టనున్న ఉచిత బస్సు ప్రయాణం సేవల గురించి వారు ప్రజలకు వివరించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని వారు తెలియజేశారు.రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంతో,పత్తికొండ నియోజకవర్గం నందు శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు నాయకత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వారు తెలియజేశారు. రాష్ట్రానికి వస్తున్న కంపెనీల ద్వారా యువతకు మంచి ఉద్యోగాలు లభిస్తాయని వారు ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం వలన ప్రజా సంక్షేమం మరియు అభివృద్ధి సాధ్యమవుతుందని వారు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరవ సలహాదారులు ప్రతాప్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటరాముడు, రాతన మోహన్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడు వెంకటరాముడు చౌదరి, డీలర్ తిమ్మప్ప,భాష,రంగస్వామి,మై రాముడు తదితర మండల టిడిపి నాయకులు,కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నానో యూరియాతో సత్ఫలితాలు

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




ములుగు వ్యవసాయ రంగంలో నానో యూరియాతో సత్ఫలితాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.బుధవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామంలోని స్నేహ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ కేంద్రంలో వ్యవసాయ శాఖ,ఇఫ్కో సంయుక్త ఆధ్వర్యంలో నానో యూరియా ప్లస్, నానో డీఏపీ పై ( డ్రోన్ తో పిచికారి చేసే )అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో డ్రోన్ ద్వారా నానో యూరియా ద్వారా పొలాల్లో వేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నానో యూరియా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నదని అన్నారు. రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నానో సాంకేతికత పరిజ్ఞానంతో మొట్టమొదటిసారిగా యూరియాను ద్రవ రూపంలో తీసుకువచ్చిన ఘనత ఓ భారతీయుడిని ఇది దేశానికే గర్వకారణం అన్నారు. సత్వర ప్రయోజనం అందించే నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నానో యూరియా వాడకం పై రైతులకు అవగాహన కల్పించుటకు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. రైతు శిక్షణ కార్యక్రమాలు ప్రదర్శన నిర్వహించి నానో యురియాను ఎలా ఉపయోగించాలి రైతులకు ప్రత్యక్షంగా చూపించాలన్నారు. నానో యూరియా వాడకం వల్ల అధిక దిగుబడి, ఖర్చు తగ్గడం, భూసార పరిరక్షణ, పర్యావరణహితం కలుగుతుందన్నారు.లాభదాయకమైన ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. పంట సాగుకు ముందుకువచ్చే రైతులకు ప్రభుత్వ సబ్సిడీలతో పాటు, ఇతర అన్ని విధాల తోడ్పాటును అందిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్,జిల్లా వ్యవసాయ అధికారి వి.సురేష్ కుమార్,ఇఫ్కో డిఎం విశాల్ షిండే, స్నేహ,ఎఫ్పిఓసి ఈఓ చాంద్ పాషా,ఎఫ్పిఓ డైరెక్టర్లు అశోక్,పోరికా ప్రమీలా,కవిత, ఎంపిడిఓ హనుమంత్ రావు, టిజివివి బ్యాంక్ మేనేజర్, మండల వ్యవసాయ అధికారులు నల్లెల్లా శ్రీధర్, పరమేశ్వర్, ఏఈఓ రామ్‌చంద్రాపూర్ కావ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి:

## మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్




హుస్నాబాద్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హుస్నాబాద్ లోని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయం లో కోహెడ మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ గ్రామాలవారిగా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాల్లో కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలన్నారు.గత కేసీఆర్ ప్రభుత్వం హాయంలో చేసిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ హయాం లో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, గ్రామాల్లో చర్చ పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. వార్డు మెంబర్ నుండి ఎంపీపీ, జెడ్పీటీసీ వరకు బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్త కష్టపడి పని చేయాలని, పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని తెలిపారు.భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలతో మమేకమై అండగా ఉండాలని పిలుపునిచ్చారు

# అంగరంగ వైభవంగా గంగమ్మ తల్లి బోనాల జాతర

**- బోనాలెత్తిన మహిళలు.. వలలు విరిసిన పురుషులు**

**-అధిక సంఖ్యలో పాల్గొన్న గంగపుత్ర బెస్తలు**

మంథని గంగమ్మతల్లిబోనాల జాతర వేడుకలను గంగపుత్ర బెస్తలు బుధవారం అంగరంగ వైభవంగా ఘనంగా జరుగుపుకున్నారు. ప్రత్యేకంగా ఆలంకరించిన పల్లకిలో శ్రీ గంగామాత విగ్రహాన్ని ఉంచి కొబ్బరి కాయ కొట్టి గంగమ్మ తల్లి బోనాల వేడుకను ప్రారంభించారు. గంగాపుత్ర బెస్తలు తమ సంప్రదాయ వృత్తి అయిన చేపలు పట్టే పెద్ద వలన అందంగా ఆలంకరించి ప్రదర్శిస్తుండగా, మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ర్యాలీగా గోదావరి వరకు తరలి వెళ్లారు. ర్యాలీలో భాగంగా ప్రధాన రస్తాలలో డీజే సౌండ్స్‌తో పాటు సంప్రదాయల నృత్యాలు చేయడంతో పాటు చేపలు పట్టే విధానాలను ప్రదర్శించారు. అదే విధంగా డప్పు కళాకారులతో సైతం ప్రత్యేక నృత్యాలు చేశారు. గంగపుత్ర బెస్తలు నిర్వహించిన బోనాల వేడుకలను పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆనంతరం గోదావరి తీరం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెపై గంగమ్మ తల్లి, గౌరమ్మ, మత్స్యగిరింద్ర, చేప, తాబేలు ప్రతిమలను పెట్టి వివిధ రకాల పూలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా పూజించారు. ఆనంతరం గంగ, గౌరమ్మలతో పాటు మత్స్యగిరింద, చేప, తాబేలు ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సమర్పించిన బోనాలను గంగాపుత్రులు ప్రసాదంగా స్వీకరించడంతో పాటు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగాపుత్ర సంఘం నాయకులు అంకరి కుమార్, గంధం వెంకటస్వామి, అంకరి ప్రకాష్, అంబటి సతీష్, అంబటి శ్రీనివాస్, గట్టయ్య, సౌళ్ల స్వామి, అటికేటి నరేష్, అంకరి శివమురళీ, అటికేటి కోటేష్, మోసం నర్సయ్య, జీదుల రాజేందర్, మోసం శంకర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో జంటహత్యలు

విజయవాడ లో జంటహత్యలు కలకలం రేపాయి.మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులను ఓ వ్యక్తి కత్తితో పొడిచి పరారైనట్లు తెలు స్తోంది. ఈ ఘటన గవర్నర్పేటలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో చోటుచేసుకుంది. మృతులు విజయనగరం జిల్లాకు చెందిన వారిగా తెలుస్తోంది. వారు క్యాటరింగ్ పనుల నిమిత్తం వచ్చి అన్నపూర్ణ థియేటర్ సమీపంలో అద్దె గదుల్లో ఉంటున్నట్లు సమాచారం. హత్యల గురించి తెలు సుకున్న వెంటనే పోలీసులు క్లూస్టీమ్తో ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఇద్దరు యువకులను ఓ రౌడీషీటర్ కత్తితో పొడిచి హతమార్చి నట్లు సమాచారం.

# కాళేశ్వరం దోపిడిదారుల ఆస్తులను జప్తు చేయాలి

## ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు




హైదరాబాద్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం లో భాగస్వామ్యం అయిన వారి ఎవరు ఆస్తులు లెక్క కట్టినా అంచనాకు మించి ఉన్నాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. ఈఏన్సీ మరళీధర్ రావు దగ్గరే 5 వందల కోట్ల పైన ఉన్నాయి అంటే...కేసీఆర్ ,కేటీఆర్, హరీష్ దగ్గర ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. శ్రీధర్ ,హరిరామ్ నాయక్ ల దగ్గర ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయి. కాళేశ్వరం నిర్మాణం లో భాగస్వామ్యం అయిన ప్రతీ ఒక్కరి పై విచారణ జరపాలి. కేసీఆర్ అసమర్థత తో ప్రాజెక్టులు పూర్తి కాలేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో పదేళ్లు ఇరిగేషన్ శాఖ ను కేసీఆర్ ,హరీష్ రావే చూసారు.. దోపిడీ దారుల ఆస్తులు జప్తు చేసి పేద ప్రజలకు పంచాలని అన్నారు.

# బొగ్గరాపు దయానంద్ గుప్తను మార్యదపూర్వకంగా

## కలసిన ఇఫతేఖర్ ఉద్దీన్



**ఎల్‌బినగర్ ప్రజాబలం ప్రతినిధి:**బొగ్గరాపు దయానంద్ గుప్త ఎమ్ ఎల్ సి ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన ఇఫతేఖర్ ఉద్దీన్ ప్రెసిడెంట్ ఖైరతాబాద్ జిల్లా సేవాదళ్ కాంగ్రెస్, ఈ సందర్భంగా వారి నియామకమును తెలుసుకొని ఇఫతేఖర్ ను సన్మానించిన ఎమ్ ఎల్ సి ఈ సందర్భంగా ఏ ప్రజా సమస్య వున్న నన్ను సంప్రదించాలని నేను ఏళ్ళ వేళల నేను అందుబాటులో ఉంటానని దయానంద్ గుప్త తెలిపారు . ఈ కార్యక్రమంలో బద్దం సతీష్ గౌడ్ గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్ కన్వీనర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,నర్సింగ్ నేత టీపీసీసీ కార్యదర్శి, చేతన్ యూవజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, వినోద్, రాధా కృష్ణ, అశోక్,

## ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు

## -2022 -23 టెన్త్ బ్యాచ్ విద్యార్థులను ఘనంగా సన్మానించిన నరేందర్ రెడ్డి



కరీంనగర్ చక్కటి ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణతో విద్యను అందించడం ద్వారా ఘనవిజయాలను చాలా సులభంగా నమోదు చేయవచ్చుని,విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించగలుగుతామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో 2022 -23 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు భారతదేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం ప్రత్యేక అభినందన సభను నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల ప్రారంభం నాటి నుండి విద్యార్థులకు ప్రాథమిక దశ నుండి ఐఐటీలో, నీట్ లో అత్యంత అనుభవజ్ఞులైన నిపుణులైన ఉపాధ్యాయులచే చక్కటి ఫౌండేషన్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఆ ఫౌండేషన్ ఫలితంగానే నేడు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ఐటి, ఎన్ఎఫ్ఐటి, ఎయిమ్స్ లలో సీట్లు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. సుమారు 35 మంది విద్యార్థులకు ఐఐటిలలో, ఎన్ఐటిలలో, ఐఐఐటిలలో సీట్లు సాధించారని, ఒక విద్యార్థికి హైదరాబాద్ ఎయిమ్స్ లో, నలుగురు విద్యార్థులకు ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు రాబోతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.ప్రణాళికబద్ధమైన విద్య ద్వారా విజయం సాధ్యమైనదని, యజమానం వారు అందించే తోడ్పాటు, వారు చేసే కృషి చాలా మార్గదర్శకమని విద్యార్థులు, తల్లిదండ్రులు యజమాన్యాన్ని ప్రశంసించారు.ఎన్.అనిరుద్ సాయి , జె. వామిక, ఐఐటి హైదరాబాద్, వి సంజితారెడ్డి, కే.వీరేంద్ర ప్రసాద్, డి.త్రిదం సాయి - ఐఐటి ఖరగ్పూర్, యు.హాసిని- ఐఐటి ధన్బాద్, జి.ప్రభంజన్ రెడ్డి- ఐఐటి ఇండోర్ ఐఐటీలో సీట్లు సాధించారని, మెడికల్ విభాగంలో వి.శశాంక్ రెడ్డి - ఎయిమ్స్, హైదరాబాద్ లలో సీట్లు సాధించారన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చాలా ఆలోచింపచేసాయి. వారి పిల్లలకు అత్యుత్తమ విద్య ద్వారా ప్రతిష్టాత్మక విజయాన్ని సాధింపచేసిన విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డిని తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,జమ్మికుంట సామాజిక ఆస్పత్రి సందర్శన....



జమ్మికుంట సామాజిక ఆసుపత్రి పరిధిలో మహిళలందరికీ ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షలు వేగవంతం చేయాలని, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. వార్డులు, ఓపి విభాగం, ల్యాబ్, మెడికల్ స్టోర్స్, లేబర్ రూమ్ సందర్శించారు. వార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బంది వారికి అందిస్తున్న సేవలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని, వైద్య సహాయం అవసరం అనుకుంటే గర్భిణీలను ప్రసవ గడువు కంటే ముందే ఆస్పత్రిలో చేర్చుకోవాలని అన్నారు. ప్రతి నెలా ఓపి, ఐపి, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మహిళ, డెలివరీల నెలవారి నివేదికలను సిద్ధం చేసి పంపాలని అన్నారు. రోగుల పట్ల మానవీయకోణంలో వ్యవహరించి వారికి సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా బీపీ, షుగర్ సంబంధిత మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేటులో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఉచితంగా మందులు తీసుకునేలా చూడాలని సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో 13 సంవత్సరాలు నిండిన మహిళలు, బాలికలందరికీ అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బీపీ షుగర్ థైరాయిడ్ వంటి మందులను అందించాలని అన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వివిధ రకాల ఆరోగ్య సేవలు సులభంగా అర్థమయ్యే విధంగా బోర్డులు డిస్ప్లే చేయాలన్నారు. టీబి వ్యాధి నివారణకు వీలైనన్ని ఎక్కువ పరీక్షలు చేయాలన్నారు. ఊయలను అందరికీ కనిపించేలా ఆవరణలో ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలకు కాల్షియం, ఐరన్, మల్టీ విటమిన్, విటమిన్ సి, మాత్రలు పంపిణీ చేయాలన్నారు. హాస్పిటల్లో కావలసిన అత్యవసర సదుపాయాలను వెంటనే సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రైవేట్ అంబులెన్సులు ఆస్పత్రికి దూరంగా నిలపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ బాబు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆడపిల్లల సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, పాల్గొన్నారు

## మానసిక ఒత్తిడికి నిద్రపోలేకపోవడమే కారమమా!

### సరైన నిద్ర లేకపోతె మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి, మానసిక స్థితి, రోగనిరోధక శక్తి పై ప్రబావం

### ఒక్క గంట నిద్రలోటును భర్తీ చేయడానికి కనీసం నాలుగు రోజుల వరకు సమయం పట్టవచ్చు

హైదరాబాద్ జూలై 16 ;మానసిక ఒత్తిడి కారణంగానో, పని భారం వల్లనో, విందులు వినోదాల వల్లనో కొన్ని సందర్భాల్లో మనం కంటినిండా నిద్రపోలేకపోతాం. ప్రతి మనిషి జీవితంలో ఇది సర్వసాధారణం. అయితే కేవలం ఒక గంట నిద్ర తక్కువైనా దాని ప్రభావం మన శరీరంపై పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆ ఒక్క గంట నిద్రలోటును భర్తీ చేయడానికి కనీసం నాలుగు రోజుల వరకు సమయం పట్టవచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.అనేది కేవలం అలసటను తీర్చుకోవడానికి ఉపయోగపడే సాధనం మాత్రమే కాదని నిపుణులు అంటున్నారు. అది మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి, మానసిక స్థితి, రోగనిరోధక శక్తి లాంటి అనేక శారీరక, మానసిక ప్రక్రియలకు అత్యవసరమని చెబుతున్నారు. మనం నిద్రపోయినప్పుడు మెదడులో రోజువారీ పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిపోయి కొత్త సమాచారం నిక్షిప్తం అవుతుంటుందని, కేవలం ఒక గంట నిద్ర తగ్గినా ఈ ప్రక్రియలన్నీ సరిగా జరగక చిన్నపాటి 'స్లీప్ డెట్' అంటే నిద్ర బాకీ ఏర్పడుతుందని వివరిస్తున్నారు.ఆ నిద్ర బాకీని తీర్చడానికి మన శరీరం కేవలం ఒక రాత్రి అదనంగా నిద్రపోవడంతో సరిపోదని, మెదడు, శరీర కణాలు సాధారణ స్థితికి రావడానికి, కోల్పోయిన విశ్రాంతిని తిరిగి పొందడానికి కొన్ని రోజులు పడుతుందని ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. అందుకే ఒక రాత్రి గంట నిద్ర తక్కువైతే మరుసటి రోజు అలసట, ఏకాగ్రత లోపం, చికాకు లాంటి లక్షణాలను అనుభవించాల్సి వస్తుందని అంటున్నారు.

నిద్ర బాకీని తీర్చుకునేదెలా..?

ఏదైనా కారణం వల్ల నిద్ర బాకీ ఏర్పడితే తర్వాత రోజుల్లో గాఢమైన నిద్రద్వారా దాన్ని తీర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గాఢ నిద్ర కోసం ప్రతిరోజు ఒకే సమయానికి నిద్రపోవడం, ఒకే సమయానికి నిద్రలేవడం చాలా ముఖ్యమని చెబుతున్నారు. వారాంతాల్లో కూడా టైమ్ షెడ్యూల్ను తూచాతప్పకుండా పాటిస్తే నిద్రబాకీ పేరుకుపోకుండా ఉంటుందని అంటున్నారు. అదేవిధంగా మంచి నిద్ర కోసం పడకగది చీకటిగా, చల్లగా, నిశ్శబ్దంగా ఉండేలా చూసుకోవాలని సలహా ఇస్తున్నారు.నిద్రకు ఉపక్రమించే ముందు ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండాలంటున్నారు. రోజూ మధ్యాహ్నం ఓ 20 నిమిషాలపాటు పవర్ నాప్ తీసుకోవడంవల్ల కూడా అలసట తగ్గి, రోజంతా చురుకుగా ఉండవచ్చని చెబుతున్నారు. అయితే పగలు ఎక్కువసేపు నిద్రపోవడం, సాయంత్రం వేళల్లో కునుకు తీయడం మంచిది కాదని అంటున్నారు. సాయంత్రం వేళల్లో కెఫీన్, ఆల్కహాల్ తీసుకోవడం కూడా నిద్రకు భంగం కలిగిస్తుందని చెబుతున్నారు.కాబట్టి నిద్రకు భంగం కలిగించే పనులకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు ఆరు గంటలకు తగ్గకుండా, ఎనిమిది గంటలకు మించకుండా నిద్రపోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతున్నారు.

## రాజకీయ అవకాశాలు దక్కని ఎన్నో కులాలు బీసీలలో ఉన్నాయి.

## ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తన నివాసంలో యూపీఎఫ్ నాయకులు, 72 కులాల ప్రతినిధులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమావేశం అయ్యారు.

ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ 25 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అయ్యే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుంది. ఆ 25 వేల పదవుల్లో సగం మంది మన ఆడబిడ్డలకే అవకాశం దక్కుతుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఇప్పటి వరకు రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు సబ్ కోటా కల్పించాలని అన్నారు.సర్పంచులు, ఎంపీపీలుగా ఇప్పటి వరకు రాజకీయ అవకాశాలు దక్కని ఎన్నో కులాలు బీసీలలో ఉన్నాయి.. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచడం ఎంత ముఖ్యమో.. రాజకీయ అవకాశాలు దక్కని వారికి పదవులు దక్కేలా సబ్ కోటా ఇవ్వడమూ అంతే ముఖ్యం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలి.. అది కేంద్రం పరిధిలో ఉంటుంది.. రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్నాయి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ కేబినెట్ చేసిన సవరణ తీర్మానం గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్నది.. గవర్నర్ గారు కేబినెట్ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసి గెజిట్ జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. గవర్నర్ ఆర్డినెన్స్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ వేయకుంటే ఎవరైనా కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లకు అడ్డు తగిలే ప్రమాదమున్నది.. ఆ అవకాశం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. రిజర్వేషన్లను పెంచుతూ చట్ట సవరణ చేసే అధికారం కేంద్రం పరిధిలో ఉంటే.. ఉన్న రిజర్వేషన్లలో సబ్ కేటగరైజేషన్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే. రాజకీయ అవకాశాలు దక్కని కులాల నుంచి సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్ లు కావాలంటే సబ్ కేటగరైజేషన్ ఒక్కటే మార్గమని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కేవియెట్ వేయకుండా ఆర్డినెన్స్ ఇస్తే.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడుతాం.. దీనిపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వం ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తోంది.. వెంటనే రూ.8 వేల కోట్ల ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని అన్నారు.

## ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

### ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్





కోరుట్ల, : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇంటి నిర్మాణాలు పనులు పూర్తి చేయాలనిజిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా లోని మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులు చేపట్టిన ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలన జరిపారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు సత్వరమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. వివిధ కారణాల వల్ల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేకపోయిన లబ్ధిదారులను కలిసి, వారికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక తోడ్పాటు గురించి వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశిత గడువు లోపు నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని, నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులను జిల్లా కలెక్టర్ పలుకరించి, ఇంటి నిర్మాణానికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. నిర్మాణాలను పనులను వేగంగా పూర్తి చేసుకోవాలని, వివిధ దశలను అనుసరిస్తూ వెంటవెంట డబ్బులను ఖాతాలో జమ చేయిస్తామని అన్నారు. అలాగే మండలంలోని సాతారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల లోని తరగతి గదులలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించాలని, శుభ్రంగా ఉంచాలని అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని గ్యాస్ పొయ్యి మీదనే చేయాలని వంట సరుకులను ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు.అదేవిధంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు బోధించే విద్య విధానాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధించే విధానము విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు.పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో మొదటి స్థానం సాధించాలని విద్యార్థులను మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు అదేవిధంగా కిచెన్ గార్డెన్ లో కూరగాయల మొక్కలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గారి పరిశీలన తర్వాత బోధనలో గాని, పాఠశాల రెడి నెస్ లో గాని పిల్లల సౌకర్యాల ఏర్పాట్లు గాని ఎట్టి పొరపాటు లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.పాఠశాల ఉపాధ్యాయులు. సమయపాలన తప్పకుండా పాటించాలని సూచించారు.ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట మెట్పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, మల్లాపూర్ మండల తహసిల్దార్ రమేష్,హౌసింగ్ పిడి ప్రసాద్,మల్లాపూర్ ఎంపీడీవో శశి కుమార్ రెడ్డి,సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణ ప్రజల ప్రాణాల పరిరక్షణే లక్ష్యం

## విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ సుదర్శనం

కోరుట్ల, విద్యుత్ ప్రమాదాల నివారణ ప్రజల ప్రాణాల పరిరక్షణే లక్ష్యంగా మెరుగైన విద్యుత్ అందించేలా పునరంకితమై పని చేద్దాం అని జగిత్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుదర్శనం అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో పర్యటించిన జిల్లా ఎస్ఇ సుదర్శనం విద్యుత్ శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎస్ఇ సుదర్శనం 132/33కేవీ, 33/11కెవి కథలాపూర్ సబ్ స్టేషన్ లను సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న సిరికొండ సబ్ స్టేషన్ పనులను సమీక్షించి త్వరితగతిన పనులు చేయాలని కాంట్రాక్ట్, అధికారులకు సూచించారు. తదనంతరం కోరుట్ల లోని కటుకం సంగయ్య ఫంక్షన్ హాల్ లో మూడు మండలాల విద్యుత్ సిబ్బందితో విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. జగిత్యాల జిల్లాలో విద్యుత్ ప్రమాదాల జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. ఎస్ఈ వెంట మెట్ పల్లి డీఇ మధుసూదన్, డిఇ టెక్నికల్ జిల్లా సేఫ్టీ ఆఫీసర్ గంగారాం , ఏడీఇ రఘుపతి , ఏఏఓ భూమయ్య, కోరుట్ల,మేడిపల్లి, కథలాపూర్ మండలాల ఏఈ లు, సబ్ ఇంజనీర్లు , ఓఅండ్ఎం ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లెల్లో సాగునీళ్లు లేవు..

## పట్నంలో తాగునీళ్లు లేవు : కేటీఆర్

హైదరాబాద్ జూలై 16 అటు పల్లెల్లో.. ఇటు పట్నంలో మొదలైన సాగు, తాగునీటి కష్టాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. పల్లెల్లో సాగునీళ్లు లేవు.. పట్నంలో తాగునీళ్లు లేవు అని కేటీఆర్ విమర్శించారు. నాడు ఇంటింటికీ నల్లా నీళ్లునేడు సాగు, తాగునీళ్లు లేక జనం కన్నీళ్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కృష్ణా, గోదావరి నదుల నిండా నీళ్లు పారుతున్న, వాటిని ఎత్తిపోయకుండా కాంగ్రెస్ సర్కార్ కక్షగట్టిందని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం గేట్లు తెరిచిపెట్టారు, పాలమూరు రంగారెడ్డి పనులు పడావుపెట్టారు అని ధ్వజమెత్తారు. సర్కారు మోసానికి సాక్ష్యంగా రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయన్నారు. బోర్లు అడుగంటి పోయాయని, పొలాలు పడావున పడ్డాయన్నారు.వ్యవసాయానికే కాదు .. వ్యక్తిగత అవసరాలకు నీళు లేని దుస్థితి ఏర్పడిందన్నారు. సాగునీళ్లను వదిలిపెట్టి తాగునీళ్లకూ ప్రభుత్వం బలిపెడుతుందన్నారు. రెండు రోజులు ఎదురుచూసినా రాని ట్యాంకర్లు. ఎన్ని సార్లు ఫోన్లు చేసినా స్పందించని అధికారులు. సర్కారు నిర్వహణ లోపంతో రోజుకు ఏకంగా ఎనిమిది వేల ట్యాంకర్ల డిమాండ్. పాలన చేతగాక వ్యవస్థలు పతనమవుతున్నాయి. నీళ్లు కొనలేక, పాట్లు పడలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ పాపం ప్రజలకు శాపంగా మారిందన్నారు. చివరగా జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ నినదించారు.

# అందోల్ నియోజకవర్గం లో పర్యటించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

## అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్ హెల్త్ కేర్ హబ్ గా మారుస్తా

## మంత్రి దామోదర్ రాజనర్సింహ

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 16 ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా: నియోజకవర్గ కేంద్రమైన ఆందోల్ మండలంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు, ఈ సందర్భంగా పలు ప్రభుత్వ విద్యాసంస్థలు, వాటి నిర్మాణ పనులను, పరిశీలించి,అధికారులతో సమీక్షించారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అందోల్ నియోజకవర్గంన్ని, రాష్ట్రంలో ప్రత్యేక ఎడ్యుకేషనల్, హెల్త్ కేర్ హబ్,గా అభివృద్ధి చేస్తామన్నారు, అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, విద్య,వైద్య, రంగాల్లో ప్రత్యేక హబ్, గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రాజెక్టులు చేపట్టినట్టు మంత్రి తెలిపారు, అందోల్ నియోజకవర్గం లోని (కేజీబీవి) కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, పాఠశాలను మంత్రి సందర్శించారు, ఈ పాఠశాలలో (సిఎస్ఆర్) నిధులతో, నిర్మించిన ఆధునిక డిజిటల్ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్,కిచెన్ బ్లాక్, విద్యార్థుల కోసం అందిస్తున్న భోజనం మెనూ, మొదలైన వసతులను సమీక్షించారు, విద్యార్థులతో మాట్లాడారు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు, నేడు



ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు స్కూళ్ల కంటే, మెరుగైన మౌలిక వసతులతో ముందున్నాయని, విద్యార్థులకు క్వాలిటీ విద్యను నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తున్నామని, మంత్రి తెలిపారు, అంతేకాక నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో, మౌలిక వసతులు అందించేందుకు చర్యలు చేపట్టినట్టు మంత్రి వెల్లడించారు, ప్రతి పాఠశాలలో, డిజిటల్ లెర్నింగ్ ఫెసిలిటీలు, కంప్యూటర్ విద్య, సైంటిఫిక్ ల్యాబ్స్ వంటివి అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి వివరించారు, తర్వాత మంత్రి నాందేడ్ ఫ్లైఓవర్ జాతీయ రహదారి నుండి అందోల్- జోగిపేట, పట్టణానికి నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు, రహదారి నిర్మాణం శర వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి దామోదర్ రాజనర్సింహ, పర్యటనలో భాగంగా అందోల్ నియోజకవర్గం లో, ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న, నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించారు, కాలేజీ నిర్మాణ పనులను, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను, వేగంగా పూర్తి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ,అధికారులను ఆదేశించారు, వీటితోపాటు మహిళా పాలిటెక్నిక్ కాలేజీని పరిశీలించారు, ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాండు, సిఐ అనిల్ కుమార్, ఎస్సై పాండు, పట్ల ప్రవీణ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు....





## దళిత బంధు నిలిపివేతపై బీఆర్ఎస్ ఆగ్రహం

## ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు కేటీఆర్ హామీ

హైదరాబాద్ ఈరోజు తెలంగాణ భవన్‌లో జరిగిన దళితబంధు సాధన సమితి సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. దళితబంధు సాధన సమితి ఈరోజు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు లబ్ధిదారులకు కావాలనే నిధులు అందకుండా ఆపివేస్తుందని, ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ దళితబంధు సాధన సమితిని ఉద్దేశించి మాట్లాడారు. ఈరోజు దళితబంధు సాధన సమితి నేతలు, దళితబంధు రాక ఇబ్బందులు పడుతున్న పలువురు దళితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రతి ఒక్క దళిత బిడ్డకు బంధు వెంటనే ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దళితబంధుపై పెట్టిన ఫ్రీజింగ్‌ను వెంటనే తొలగించి, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా 12 లక్షల రూపాయల దళితబంధు ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి పార్టీ తరఫున లేఖ రాయనున్నట్లు తెలిపారు.కేవలం ఓట్ల కోసం, సీట్ల కోసం ఏర్పాటుచేసిన కార్యక్రమం దళితబంధు కాదని, దళిత జీవితాల్లో సంపూర్ణ సమగ్ర మార్పులకు తీసుకురావడం కోసం చేపట్టిన కార్యక్రమమని కేటీఆర్ అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన 10 లక్షలకు అదనంగా మరో రెండు లక్షలు కలిపి 12 లక్షలు ఇస్తామని చెప్పి దళితుల ఓట్లు వేయించుకొని వారిని ప్రస్తుతం మోసం చేస్తోందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.గతంలో దళితబంధు ఏర్పాటుచేసినప్పుడు "కేవలం ఓట్ల కోసం చేసిన కార్యక్రమం"గా మాట్లాడారని, అయితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 40 సంవత్సరాల క్రితం సిద్ధిపేట ఎమ్మెల్యేగా దళితుల జీవితాల్లో ఎదురైన సమస్యలను అధ్యయనం చేసేందుకు దళిత చైతన్య జ్యోతి పేరుతో చేపట్టిన కార్యక్రమం స్ఫూర్తిగా దళితుల జీవితాల్లో మార్పులు తీసుకురావడం కోసం ఈ గొప్ప కార్యక్రమం చేపట్టారని తెలిపారు. దేశ చరిత్రలో దళితబంధు, రైతుబంధు వంటి కార్యక్రమాలను దమ్మున్న నాయకులు, కేసీఆర్ వంటి నాయకులు మాత్రమే చేయగలరని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన రోజు నుంచీ దళితుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం కల్యాణ లక్ష్మి, గురుకులాలు, దళితబంధు వంటి అనేక కార్యక్రమాలను చేపట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు.

## బోయినపల్లి ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్ లో ఘనంగా బోనాల పండుగ.

## పోతురాజుల వేషాలతో విద్యార్థుల విన్యాసాలు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలోని ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్ లో బుధవారం రోజున ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య లయబద్ధంగా విద్యార్థుల నృత్యాలతో పోచమ్మ దేవాలయానికి వెళ్లి మొక్కలు చెల్లించుకున్నారు. పోతురాజుల వేషధారణ చేసుకున్న విద్యార్థుల నృత్యాలు గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆనంద్ విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణలో బోనాల పండుగ యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించడం జరిగింది. అలాగే ఈ పండుగను ఆషాడమాసంలో ప్రారంభించి, శ్రావణమాసం చివరిదాకా జరుపుకోవడం జరుగుతుంది. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# జలమండలికి వినతి పత్రం ఇచ్చిన బి.ఆర్.ఎస్ మణికొండ నాయకులు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 16 జూలై 2025**మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలు త్రాగు నీరు గురించి పడుతున్న ఇబ్బందులకు తమవంతు కృషిగా భారత రాష్ట్ర సమితి స్థానిక నాయకులు కలసి కట్టుగా జలమండలి కార్యాలయం వద్దకు చేరుకుని ప్రజలు ఎదుర్కుంటున్న ప్రధాన సమస్యలలో మొదటగా 2025 ఫిబ్రవరి 6 న అలుకాపూర్, ఎల్.ఐ.సి కాలనీలలో ఉన్న రిజర్వాయర్ లను తూతూ మంత్రంగా మొదలు పెట్టిన చెందాన ఇనాగురేషన్ చేసి మిన్నకుండడం చేతగాని తనంగా భావించ వలసి వస్తూ ఉందని ప్రజలు తీవ్రంగా దుయ్యబడుతున్నారు. పెద్ద పెద్ద అపార్ట్మెంటులకు కట్టడి లేని విధంగా నీటి సరఫరా ఇవ్వడం వలన సామాన్య ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయమై సంబంధిత అధికారులు దర్యాప్తు చేయాలని, సామాన్య ప్రజల వద్ద ముక్కు పిండి బిల్లులు వసూలు చేస్తున్నారని, చట్ట పరిధిలో లేని వాల్యు ఛార్జీలు వసూలు చేస్తున్నారని కానీ అందుకు ప్రతి ఫలంగా ఛార్జ్ చేసిన మేర నీటిని విడుదల చేయడం లేదని ప్రతి ఇంటికి సమన్యాయంగా నీటిని సరఫరా చేయాలని, ఇక అతి ముఖ్య విషయం ఏమిటంటే మునిసిపల్ చట్ట పరిధి ప్రకారం 240 గజాల ఇండ్లు, అపార్ట్మెంటు మాదిరి కట్టడాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ లు జారీ చేయవలసిన అవసరం లేదని, అట్టి విషయమై తెలంగాణ రాష్ట్ర మునిసిపాలిటి అంతర్భాగమైన జలమండలి అధికారులకు ఎంత మాత్రం అధికారం లేదని, కానీ జలమండలి అధికారులు చట్టం మా చుట్టం అనుకొంటూ తమ ఇష్టానుసారం వ్యవహరిస్తూ మునిసిపల్ పర్మిషన్ కు విరుద్ధముగా కట్టడం కట్టావని దృష్టికి తెస్తూ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఇష్టానుసారం మెదులుతూ ఇబ్బడి ముబ్బడిగా జలమండలి నీటి సరఫరాకు బిల్లులు వసూలు చేస్తున్నారని ప్రజలు తెలుపగా స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. కావున సంబంధిత అధికారులు ప్రజల బాగు కోరి ప్రజా ప్రయోగ కార్యక్రమాలు చేపట్టాలని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తు, ప్లా కార్డులు చేతబూని నిరసన కార్యక్రమం చేపట్టి తత్ పర్యంతం అధికారులను కలిసి వ్రాత పూర్వక పిర్యాదు పత్రం అంద జేయడం జరిగినదని భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ మునిసిపాలిటీ నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, లక్ష్మణ్ రావు అందే, రూపా రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, సంగం శ్రీకాంత్, కిరణ్ యాలాల, బొడ్డు శ్రీధర్, బాబు రావు, ఆరిఫ్ మొహమ్మద్, సుమ నళిని, భాను చందర్, మాల్యాద్రి నాయుడు, షేక్ ఆరిఫ్, అజయ్, చెరుకూరి బాలాజీ, నర్సింగ్ రావు, బెన్నీ, ఆశ్వక్ అలీ, అష్రఫ్, నరసింహ రెడ్డి, శేఖర్ తది తరులు తెలియ జేసినారు.



## సింగూర్ ప్రాజెక్టు ఎడమ కాలవ ద్వారా పంట సాగుకు నీరు విడుదల

## పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి, దుర్గారెడ్డి,



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూలై 16 ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా: ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టు నుండి, ఎడమ కాలువ ద్వారా పంట సాగుకు నేటి ఉదయం 8.00, గంటలకు అనగా (17.7.2025 )నాడు మన ప్రియతమ నేత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ, సింగూరు ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేయడానికి విచ్చేస్తున్నారు, కావున యువజన సంఘాల నాయకులు,( ఎన్ ఎస్ యు ఐ) నాయకులు కార్యకర్తలు రైతులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంత చేయవలసినదిగ పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి తెలిపారు.....

# పొలం డబ్బులడిగితే దాడులా!...

**-జనసైనికులకే రక్షణ కరువా?**

**- వారంరోజులైనా చర్యలు శూన్యం**

కాకినాడ రూరల్, జూలై 16: కంచె చేను మేసిన చందంగా తయారయింది నేటి పరిస్థితి. అధికారం రాకముందు ఒకతరహాగా,వచ్చాక మరోరకంగా కొందరు నేతలు మారిపోతున్నారు. వివరాల్లోకి వెళితే కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామానికి చెందిన అరవ త్రిపురసుందరి 20ఏళ్ల క్రితం తండ్రి వారసత్వంగా వచ్చిన చేను సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆ సమయంలో ఆమె తండ్రి వారసులుగా ఉన్న ఇద్దరు కుమారులకు పొలం ఇవ్వగా వారు దాన్ని పట్టించుకోకపోవడంతో త్రిపురసుందరి కుటుంబ సభ్యులు సహాయంతో సాగు చేసుకుంటున్నది. ఈ తరుణంలో ఆమె సోదరుడి వాటాను విక్రయించారు. ఈ సమయంలో సోదరుడి వాటాకింద రూ.10 లక్షలు ఇస్తానని తూరంగి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు అద్దంకి వీరబాబు రెండేళ్ల క్రితం హామీనివ్వడం జరిగింది. కానీ నేడు ఈ పంటభూమిని కప్పివేసేందుకు ప్రయత్నిస్తుండగా తన బాకీవున్న డబ్బులకోసం త్రిపురసుందరి వీరబాబును అడగ్గా ఎదురుదాడికి పాల్పడ్డమే కాకుండా మీ అంతు చూస్తానని పొలంవద్ద కుటుంబసభ్యులను హెచ్చరించాడు. అంతేకాక సంఘటన జరిగిన రోజు రాత్రి 11గంటల సమయంలో మహిళ అని చూడకుండా తన చేయి వెనక్కి తిప్పేసి భౌతికదాడి చేశారని ఆమె విలేకర్లకు వివరించారు. పెద్దపెద్ద రాళ్లను ఇంటిపై గంజాయిబ్యాచ్ సాయంతో వేయడంతో మా ఆయనకు సైతం వీపుభాగంలో గాయమైందని విలేకర్లకు వివరించారు. ఈ విషయాన్ని జనసేన నాయకుడైన తన తమ్ముడికి కూడా తెలియచేశామన్నారు. కానీ ఇప్పటివరకు చర్యలు లేవన్నారు. త్రిపురసుందరి కుమారుడు అరవ నరేష్ మాట్లాడుతూ తమ తాతల వారసత్వంగా వచ్చిన 20ఏళ్ల ఆస్తిలో పొలం భాగంలో 18సెంట్లను అద్దంకి వీరబాబు కొనుగోలుచేయగా, ఆ డబ్బులింతవరకు ఇవ్వలేదని ఇపుడు జనసేన నాయకుడిగా ఉన్న తనను ఎవరూ ఏం చేయలేరని తిరిగి తమపై భౌతికదాడులు చేయడంతోపాటు ఇంటిపై గొడవచేయడం సీసీ కెమెరాల్లో రికార్డయిందని, మహిళాపక్షపాతిగా చెప్పుకునే జనసేన పార్టీలోనే మహిళలపై దాడులు చేయడం సరికాదని, ఈ విషయమై ఇప్పటికయినా స్థానిక ప్రజాప్రతినిధి కలగజేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

# కలెక్టర్ పాఠశాల ఆకస్మిక తనిఖీ, కొద్ది సమయంలోనే సమస్య పరిష్కారం.

## కలెక్టర్ ఆదేశాలతో డెస్క్ బెంచ్ లు ఏర్పాటు.
## విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరలింపు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశాల మేరకు వేములవాడ అర్బన్ మండలం మారుపాక ప్రభుత్వ పాఠశాలలో డెస్క్ బెంచ్ లు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని మారుపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు సరియైన డెస్క్ బెంచీలు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థుల విషయాన్నీ పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల సంఖ్యాకు అనుగుణంగా డెస్క్ బెంచీలు వెంటనే సర్దుబాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో వారు విద్యార్థులకు సరిపడా డెస్క్ బెంచీలు తరలించి, ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసిన కొద్ది గంటల్లోనే సమస్య పరిష్కారం అవడంతో విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# కేంద్రంలో పెండింగ్లో ఉన్న బీసీ రిజర్వేషన్ బిల్లులపై స్పష్టత ఇవ్వాలి. పొలాస నరేందర్.

## విద్య, ఉపాధి రంగాల్లో బిల్లుల ఆమోదం లేక విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుంది.
## 21న ఢిల్లీకి వెళ్లే సీఎం, అఖిలపక్షాన్ని వెంట తీసుకువెళ్లాలని డిమాండ్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బీసీలకు విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత మూడు మాసాల క్రితం కేంద్రానికి పంపిన రెండు బిల్లులు ఇప్పటికీ ఆమోదం కోసం పెండింగ్లో ఉండడాన్ని బీసీ సాధికారిత సంఘం తీవ్ర ఆవేదనతో ఖండించింది. ఈ విషయమై తక్షణ నిర్ణయం తీసుకోకపోతే విద్యార్థులు, నిరుద్యోగులు భారీగా నష్టపోతారని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ హెచ్చరించారు. ఇంజనీరింగ్, బిఈడి, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు అడ్మిషన్ ఇప్పటికే ప్రారంభమయ్యాయని, కానీ కొత్త రిజర్వేషన్లు అమలుకై కేంద్రం బిల్లు ఆమోదం ఆలస్యం కావడంతో విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. ఆర్డినెన్స్ తో స్థానిక ఎన్నికలు, అదేవిధంగా విద్యా రిజర్వేషన్లకు చర్యలు తీసుకోవాలని, హైకోర్టు ఆదేశాల మేరకు 30 రోజుల్లో రిజర్వేషన్ల ఖరారు చేయాల్సిన పరిస్థితిలో, రాష్ట్ర క్యాబినెట్ ఇటీవల పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించే ఆర్డినెన్స్ జారీ చేయడం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరగాలని తీసుకున్న ఈ చర్యను అభినందించిన నరేందర్. అదేవిధంగా విద్య, ఉపాధి రంగాల్లో బీసీల రిజర్వేషన్లు బిల్లుల ఆమోదం కోసం కూడా చురుకైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ పర్యటనలో అఖిలపక్ష భాగస్వామ్యం కావాలి.

ఈనెల 21న సీఎం ఢిల్లీకి వెళ్ళనున్న నేపథ్యంలో, బీసీ బిల్లుల ఆమోదం అంశాన్ని ప్రధానంగా తీసుకోవాలని, అఖిలపక్షా నాయకులను వెంట తీసుకువెళ్లాలని, పొలాస నరేందర్ విజ్ఞప్తి చేశారు. కేంద్రాన్ని ఒప్పించి, చట్టబద్ధంగా బిల్లుల ఆమోదం కోసం సమర్ధంగా వాదించాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీలో హామీ మేరకు చర్యలు అవసరం. అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్ నెంబర్ కు చట్టబద్ధమైన మార్గాన్ని పెంచుకోవాలని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. అవసరమైతే విద్య, ఉద్యోగంలో రిజర్వేషన్లకు సంబంధించి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని అన్నారు.

బీసీ విద్యార్థుల భవిష్యత్తు రిజర్వేషన్లపై కేంద్ర నిర్ణయం మీద ఆధారపడింది. ప్రభుత్వం కేంద్రంతో చర్చించిన న్యాయబద్ధంగా ఆమోదం పొందేలా కృషి చేయాలని పొలాస నరేందర్ తెలిపారు.

# రాజన్న సన్నిధిలో ఎమ్మెల్సీ అద్దంకి, ప్రభుత్వ విప్ ఆది.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని బుధవారం రోజున ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దర్శనానికి రాగా, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వాగతం పలికినారు. ఇరువురు కలిసి రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కలు చెల్లించు కున్నారు. వీరికి రాజన్న ఆలయ కార్యనిర్వాహక అధికారి రాధాబాయి నాగిరెడ్డి మంటపంలో శేష వస్త్ర ములుకప్పి,స్వామివారిప్రసాదాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాజన్న ఆలయాన్ని వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నవంబర్లో 1000 కోట్లతో వేములవాడ పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు అంకురార్పణ చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయానికి 150 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం రాజన్న ఆలయానికి ఏటి వంద కోట్లు ఇస్తానని రాజన్న భక్తులను మోసం చేసిందని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి పేరిట రంగురంగుల బ్రోచర్లతో మాత్రమే చూపెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో చేస్తున్నామని తెలిపారు.

మూడవ అభ్యర్థి లేకున్నా వారి వీడియోలో బ్రిడ్జి ఉన్నట్లు దాని పైనుండి వాహనాలు వెళ్లినట్లు చూపెట్టి రాజన్న భక్తులను, వేములవాడ ప్రజలను రూపాయలతో మూడవ బ్రిడ్జికి, 76 కోట్లతో ఆలయ అభివృద్ధి, మూల వాగులో, గుడి చెరువులో మురికి నీరు కలవకుండా 9 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు.

పట్టణాభివృద్ధి, దేవాలయ అభివృద్ధి సమాంతరంగా చేస్తున్నాం.

ముఖ్యమంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించిన మంత్రుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాజన్న ఆలయ పరిధిలో 50 ఎకరాలతో సుశీలమైన గోశాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. మొన్నటి క్యాబినెట్లో వేములవాడ గోశాల నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అవినాతన గోశాల నిర్మాణానికి క్యాబినెట్లో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గానికి రాజన్న భక్తుల పక్షాన మోసం చేశారని తెలిపారు.



అదే రాజన్న తంతేల మీద నా లగ్గం ఇక్కడ అయింది నా అత్తగారు కొదురుపాక అని ప్రజలను మభ్య పెట్టారు అని తెలిపారు. 2014 కు ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ఇప్పుడు కూడా అలానే ఉంది అన్నారు. ఒక్క పాత ఇటుక తీసి, ఒక్క కొత్త ఇటుక పెట్టలేదు అన్నాడు. గతంలో పిసిసి హోదాలో రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి రాజన్న ఆలయాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు అని, చేతల ప్రభుత్వమని పేర్కొన్నారు. 35 కోట్లతో అన్నదాన సత్రం, 47 కోట్లతో రోడ్డు వెడల్పు, ఆరు కోట్ల ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాజన్న ఆలయం, పట్టణ అభివృద్ధిలో అందరి సూచనలు, సలహాలతో ముందుకు పోతున్నాం అన్నారు. శృంగేరి పీఠం వారి ఆలోచనకు అనుగుణంగా వారి అనుమతులతో త్వరలోనే భీమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాజన్న సన్నిధిలోకి వచ్చే భక్తులకు శీఘ్రమైన దర్శనం కలిగేలా సకల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో గ్యాస్ కలెక్షన్లు.

## విద్యార్థుల సంఖ్య కనుగుణంగా డెస్క్ బెంచీలు ఏర్పాటు చేయాలి.
## మారుపాక లోని ప్రభుత్వ స్కూళ్లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.
## సైన్స్, సోషల్, మ్యాథ్స్ పాఠాలు బోధన.
## ఉపాధి హామీ కింద ప్రహరీ నిర్మించాలి.
## లీకేజీ లేకుండా వెంటనే బాగు చేయించాలి.
## కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో గ్యాస్ కలెక్షన్లను అందుబాటులోకి రానున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు. బుధవారం రోజున వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలోని అంగన్వాడి, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడానికి గమనించి శుభ్రం చేయించాలని పంచాయతీ సెక్రెటరీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండడం పై అసహనం వ్యక్తం చేశారు. బడిబాట కార్యక్రమంలో ఏమి చేశారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రైమరీ స్కూల్లోని తరగతి గదిలో విద్యార్థుల బెంచీలు సరియైన క్రమంలో ఏర్పాటు చేసి వారికి వీలైనంత సువిశాల గదిని కేటాయించాలని, రంగులు వేయించాలని సూచించారు.

ఉపాధి హామీ కింద ప్రహరీ గోడ నిర్మించాలి.

ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బెంచీలు లేకపోవడం గమనించి వెంటనే ఇతర పాఠశాలలో అధికంగా ఉన్న వాటిని ఇక్కడికి వెంటనే తెప్పించే ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలకు సరి అయిన ప్రహరీ లేదని, ఉపాధి హామీ కింద నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

సైన్స్, సోషల్, మ్యాథ్స్ పాఠాలు బోధన.

మారుపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 8,9,10 వ తరగతి విద్యార్థులకు సైన్స్, సోషల్,మాథ్స్ పాఠాలు బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు సరైన విధంగా విద్యా బోధన చేయవలసిందిగా ఉపాధ్యాయులను ఆదేశించారు.

లీకేజీ లేకుండా వెంటనే బాగు చేయించాలి.

అంగన్వాడి కేంద్రంలోని పిల్లల బరువును చెక్ చేశారు. పాఠశాల పరిసరాలు మొత్తం కలియతిరిగి పరిశుభ్రంగా లేకపోవడం గమనించి వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. అంగన్వాడి భవనం వాటర్ లీకేజీ లేకుండా వెంటనే బాగు చేయించాలని ఆజ్ఞాపించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వంటగదిని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

# రాజన్న ఆలయ 9 రోజుల హుండీ లెక్కింపు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రోజున రాజన్న ఆలయ 9 రోజుల హుండీ లెక్కింపు జరిగింది. రూపాయలు 1 కోటి,59 లక్షల,52 వేల,901 రూపాయలు. మిశ్రమ బంగారం 279 గ్రాములు. మిశ్రమ వెండి 14 కిలోల700 గ్రాములు ఆలయానికి సమకూరినది. హుండీ లెక్కింపు నందు కార్యనిర్వాణాధికారి రాధాబాయి, ఏ సి కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏ ఈ ఓ లు, పర్యవేక్షకులు, ఆలయసిబ్బందిపాల్గొన్నారు. ఎస్పీఎఫ్ మరియు హోంగార్డు సిబ్బంది భద్రత ఏర్పాట్లు చూశారు. ఇట్టి హుండీ కౌంటింగ్ నందు శ్రీ శివరామకృష్ణ భజన మండలి వారు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా యువ నాయకురాలు

## రాజనర్సింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిష రాజనరసింహ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి, (జులై 16 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా : అందోల్ నియోజకవర్గం లోని టేక్మాల్ మండల పరిధిలో గల, చంద్రు తాండాకు చెందిన, టేక్మాల్ సొసైటీ డైరెక్టర్, కట్రోత్ చందర్, నాయక్ ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో, తీవ్ర గాయాల పాలు కావడం జరిగింది, హైదరాబాదులోని (ఎస్ వి )ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవలే డిశ్చార్జ్ అయ్యారు, ఇట్టి విషయాన్ని, తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, దృష్టికి స్థానిక నాయకులు తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన త్రిషమ్మ, మానవతా దృక్పథంతో స్పందించి, రాజనర్సింహ ఫౌండేషన్ ద్వారా, ఆర్థిక సహాయాన్ని అందజేశారు, వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు, టేక్మాల్ మండల నాయకులు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఈ యొక్క ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది....

## పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

### మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశించారు.

వేములవాడ అర్బన్ మండల పరిధిలోని మారుపాక వద్ద సర్వేనెంబర్ 339 లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బుధవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలం హద్దులు సిద్ధం చేయాలని, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు పెట్రోల్ బంక్ నిర్మాణ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది అని తెలిపారు.

ఈ పర్యటనలో వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డిటిసిపిఓ అన్సార్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు, డిపిఓ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య మహిళ" వైద్య పరీక్షలు వేగవంతం చేయాలి



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 16** జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి పరిధిలో మహిళలందరికీ ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షలు వేగవంతం చేయాలని, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. వార్డులు, ఓపి విభాగం, ల్యాబ్, మెడికల్ స్టోర్స్, లేబర్ రూమ్ సందర్శించారు. వార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బంది వారికి అందిస్తున్న సేవలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని, వైద్య సహాయం అవసరం అనుకుంటే గర్భిణీలను ప్రసవ గడువు కంటే ముందే ఆస్పత్రిలో చేర్చుకోవాలని అన్నారు. ప్రతి నెలా ఓపి, ఐపి, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మహిళ, డెలివరీల నెలవారి నివేదికలను సిద్ధం చేసి పంపాలని అన్నారు. రోగుల పట్ల మానవీయకోణంలో వ్యవహరించి వారికి సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా బీపీ, షుగర్ సంబంధిత మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేటులో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రభుత్వ



ఆసుపత్రి నుండి ఉచితంగా మందులు తీసుకునేలా చూడాలని సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో 13 సంవత్సరాలు నిండిన మహిళలు, బాలికలందరికీ అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బీపీ షుగర్ థైరాయిడ్ వంటి మందులను అందించాలని అన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వివిధ రకాల ఆరోగ్య సేవలు సులభంగా అర్థమయ్యే విధంగా బోర్డులు డిస్ప్లే చేయాలన్నారు. టీబి వ్యాధి నివారణకు వీలైనన్ని ఎక్కువ పరీక్షలు చేయాలన్నారు. ఊయలను అందరికీ కనిపించేలా ఆవరణలో ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలకు క్యాల్షియం, ఐరన్, మల్టీ విటమిన్, విటమిన్ సి మాత్రలు పంపిణీ చేయాలన్నారు. హాస్పిటల్లో కావలసిన అత్యవసర సదుపాయాలను వెంటనే సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రైవేట్ అంబులెన్సులు ఆస్పత్రికి దూరంగా నిలపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ బాబు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సనా పాల్గొన్నారు.

## నైపుణ్యతను మెరుగుపరుచుకొని జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలి

### ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బంగాళా భారతి



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి జూలై 16 ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా:సదాశివపేట/పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బుధవారం నాడు అకడమిక్ ఇయర్ లో జాయిన్ అయినా బిఏ బీకాం బీఎస్సీ బిబి ఏ కోర్సులలో మొదటి సంవత్సరము జాయిన్ అయినా విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బంగాళా భారతి అధ్యక్షతన ఓరియంటేషన్ క్లాస్ నిర్వహించడం జరిగింది, ఈ మీ సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్నటువంటి సౌకర్యాలు కోర్సులు స్కాలర్షిప్లు మొదలగు వాటి గురించి చెప్పినారు శ్రద్ధగా చదువుకుని నైపుణ్యతను మెరుగుపరుచుకొని జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడి కళాశాలకు మరియు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని కళాశాలలో ర్యాగింగ్, మత్తు పదార్థాలు వాడకం అవుటర్స్ కళాశాల అనుమతి లేకుండా రావటం మొదలైనవి నిషిద్ధమని చెప్పారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిద్ధులు ఐక్య సి కోఆర్డినేటర్ సారవయ్య డాక్టర్ పి మురళీకృష్ణ శకుంతల మంజుల రాజిరెడ్డి శంకరయ్య నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఓరియంటేషన్ ప్రోగ్రాం ని విజయవంతం చేసినారు

### జగిత్యాల రజక సంఘం ఆధ్వర్యంలో

### అంగరంగ వైభవంగా వీరమ్మ తల్లి బోనాల శోభాయాత్ర..

జగిత్యాల జిల్లా కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంగరంగ వైభవంగా వీరమ్మ తల్లి ఎత్తుకొని శోభాయాత్ర పట్టణ వీధుల గుండా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని సాంప్రదాయ పద్ధతిలో వీరమ్మ తల్లి బోనాన్ని వార్డులోని మహిళలు ఇంటింటి నుండి బోనాన్ని ఎత్తుకొని పట్టణ వీధుల గుండా డప్పు చప్పుళ్ల మధ్య భక్తి పాటలతో జగిత్యాలలో వార్డులన్నీ మారుమోగాయి. ఈ వీరమ్మ తల్లి బోనాల సందర్భంగా శ్రీ మడలేశ్వర స్వామి వారి విగ్రహాన్ని తయారుచేకసి వీరమ్మ తల్లి బోనాల శోభాయాత్రలో నిర్వహించారు. ఈ విగ్రహాన్ని చూడడానికి పట్టణంలోని ప్రజలు ఆసక్తిగా చూశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ కుల బాంధవులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

## మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి జులై 16(ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా:వికారాబాద్/మర్పల్లి, వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నంలో పురుగులు రావడం మరియు ఫుడ్ పోయిసన్ జరగడంతో మర్పల్లి మండల కేంద్రంలోని కేజిబివి మరియు సిరిపురం హాస్టల్ లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్న,గురుకులాల్లో తరుచూ ఫుడ్ పాయిజన్ అనేది అభం శుభం తెలియని విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వ నిర్లక్ష్యం ఖరీదు ఎన్నో ప్రాణాలు బలి,ఫుడ్ పాయిజన్ జరిగిన తర్వాత విద్యార్థులకు సకాలంలో చికిత్స అందించకపోవడంతో ప్రాణాల మీదకు వస్తోంది.



విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడ. ఇప్పుడు ఎవరిని పంపాలి జైలుకు ఫుడ్ పాయిజన్ అయిన వసతి గృహాల్లో అందరు విద్యార్థులకు ముందస్తుగా అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించి, అవసరమైతే ఆసుపత్రికి తరలించి, మంచి వైద్యం అందించాలని కోరుతున్న మాటలే తప్ప చేతలు లేని ముఖ్యమంత్రి నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆసుపత్రిపాలు కావాలి, ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలి నాటి సంక్షేమ పాఠశాలలు నేడు దుర్భర స్థితికి వచ్చాయి దీనికి కారణం ఎవరు..?చేతనైతే గురుకులాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలు, కల్తీలేని ఆహారం కోసం ధర్నాలు రాస్తారోకోలు మరియు వసతి గృహాల్లో పిల్లలకు కుక్క కాట్లు, పాము కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాకులు లాంటి సంఘటనలు సర్వసాధారణమైపోయాయి, ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ నాయకులు ఎన్ని సార్లు విద్యార్థుల సమస్యలను లేవనెత్తినా, విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నా, పత్రికలు మరియు మీడియా ఎన్నిసార్లు తమ గళం వినిపిస్తున్నా.. విద్యాశాఖ మంత్రి లేని మన రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో పర్యవేక్షణ లేదు. రాష్ట్రంలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నా చర్యలు మాత్రం లేవు ఎందుకు. ప్రభుత్వం ఇకనైనా కళ్ళు విప్పి చూడకుంటే రాష్ట్రంలో విద్యావ్యవస్థ మొత్తం నిర్వీర్యం అయిపోతుంది కాబట్టి ఇప్పటికైనా కళ్లు తెరిచి పిల్లల భవిషత్తు కోసం ఆలోచించండి. అని తెలిపారు ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ ఇన్చార్జి డాక్టర్ మెతుకు ఆనంద్ మాజీ జడ్పిటిసి మధుకర్ మర్పల్లి మండల ఇన్చార్జి శ్రీకాంత్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ డి అశోక్ మాజీ డైరెక్టర్ గౌస్ ద్దీన్ టౌన్ ప్రెసిడెంట్ గఫర్ సీనియర్ నాయకులు యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్తంభంపల్లి వంతెన నిర్మాణం వెంటనే పూర్తి చేయండి.

## బోయినపల్లి మండల కేంద్రంలో అఖిలపక్ష సమావేశం నిర్ణయం.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** బోయినపల్లి మండల కేంద్రంలో బుధవారం రోజున సమావేశం నిర్వహించడం జరిగింది. స్తంభంపల్లి గ్రామంలోని గంజి వాగు వద్ద నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అన్న నేతలు మాట్లాడుతూ జూలై 21 సోమవారం రోజు నుండి బోయినపల్లి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం చేయనున్నట్లు ప్రకటించారు. వంతెన నిర్మాణం దాదాపు 14 నెలలుగా అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ మరియు చొప్పదండి శాసనసభ్యుడు గతంలో హామీ ఇచ్చినప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం నిరాశ కలిగించిందని తెలిపారు.

బోయినపల్లి మండల ప్రజలు పాదయాత్రలు, బైక్ ర్యాలీలు, ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదని అఖిలపక్షం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 20వ తేదీ లోపు నిర్మాణ పనులు ప్రారంభించక పోతే, మరుసటి రోజు అనగా 21వ తేదీ నుంచి నిరాహార దీక్షలు చేయాలని సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది.

రెండు నియోజకవర్గాలకు ప్రధాన రోడ్డు అయిన ఈ మార్గంలో వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవాలని, మండల ప్రజలందరూ దీక్షలో పాల్గొని ఇట్టి రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో బి.ఆర్.ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, బిజెపి సీనియర్ నాయకులు బొంగొని అశోక్ గౌడ్, సిపిఎం మండల కార్యదర్శి గురజాల శ్రీధర్, తాజా మాజీ సర్పంచులు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపల్లి కరుణాకర్, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి తిరుపతి, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, బీఎస్పీ జిల్లా నాయకులు ఆల్వాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మేళా



కోరుట్ల, :తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైజింగ్ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు బుధవారం కోరుట్ల మునిసిపాలిటీ లోనీ స్వశక్తి మహిళా భవన్ లో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మేళా నిర్వహించారు. మెప్మా ఆర్పీలు, మహిళా సంఘుల సభ్యులు తయారు చేసిన తినుబండారాలు,ఇతర పదార్థాలను స్టాల్స్ లా ఏర్పాటు చేసి విక్రయించారు. పలు వార్డులలో తడి చెత్త పొడి చెత్త హానికార చెత్త,ప్లాస్టిక్ నిషేధం గురించి మహిళా సంఘాల సభ్యులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ అశోక్, మెప్మా టి.ఎం.సి శ్రీరామ్ గౌడ్ ,సి.ఓ.లు సంధ్య, గంగారాణి మెప్మా సిబ్బంది,పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com